15

Tallapaka Works: Vol. XV

# SRINGARA SANKIRTANALU

BY

**TALLAPAKA ANNAMACHARYULU**

*Edited by*

**A. V. SRINIVASACHARYULU,**
*Telugu Pandit, S. V. U. O. R. Institute, Tirupati*

**1961**

*Published by*

TIRUMALA-TIRUPATI DEVASTHANAMS, TIRUPATI

శ్రీతాళ్లపాకవారి గేయరచనలు – సంపుటము 15.

# శృంగార సంకీర్తనలు

## అన్నమాచార్య విరచితములు

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయ పుస్తకశాలలో ఆంధ్రపండితుఁడగు
అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యునిచేత
పరిష్కరింపఁబడినవి.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి అనుమతిని
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు
శ్రీ చెలికాని అన్నారావు, బి.ఏ., గారి అనుమతిని
ప్రకటింపఁబడినవి.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణ, తిరుపతి.

1961

# తిరుమల తిరుపతి దేవస్థానముల
# సర్వస్వామ్య సంకలితము

పదునైదవ సంపుటము

1961

తి. తి. దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

# పీఠిక

చరాచరప్రపంచమునకు ప్రపంచమందలి జీవులకు జీవాణువులకు వాని ఉనికికి మనికికి ప్రభాకరుని కరస్పర్శ అవసరము. ఆతని కరస్పర్శ లేనిదే ఏదియు ప్రకాశమును పొందజాలదు. యుగయుగాలుగా తరతరాలుగా శతాబ్దాలు శతాబ్దాలుగా కాలగర్భమున అణగి వెలుగు మొగమును చూడకయున్నను ఏనాడు ఆతని కరస్పర్శ కలుగునో ఆనాటి నుండియే ఆ వస్తువు ప్రసిద్ధిని పొందగలుగుచున్నది. అదే విధముగా కొన్నివందలయేండ్లు అసూర్యంపశ్యలుగా ఆలనపాలన లేక కాలగర్భమున అడగియుండిన తాళ్లపాకవారి గేయరచనముల యోగ్యతను తాము గుర్తించి అధికారులచేతను లోకముచేతను గుర్తించునట్లు చేసినది శ్రీ ప్రభాకరులే. వారి బాట ననుసరించియే యీ కీర్తనల పరిష్కరణము సాగుచున్నది.

నాఁడు శ్రీవేంకటేశ్వరస్వామివారికి అంకితములైన కీర్తనలను నేఁడు వారే ప్రకటించుకొనుచున్నారనుట యతిశయోక్తి కాదు. ఈ కీర్తనల ప్రకటన విషయమున తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల సంఘమువారును ముఖ్యముగా దేవస్థానముల కార్యనిర్వాహకులైన శ్రీ చెలికాని అన్నారావుగారును మిక్కిలి శ్రద్ధాభక్తులు చూపుచున్నారు.

ఎన్నో వందల యేండ్లకుముందు అవతరించి కీర్తనలరచించి పాడి పాడించి ఆనందించి ఆనందింపజేసి తరించి అంతరించిన అన్నమాచార్యులే నేఁడు శ్రీ అన్నారావుగారుగా జన్మించి తాము రచించిన కీర్తనలనే యిట్లు ప్రకటించుకొనుచున్నారేమో ! వీరికి ఏడుకొండల వెంకటరమణస్వామివారు ఆయురారోగ్యముల నొసగి ఈ కీర్తనల ప్రకటనమున ఇతోధికమైన భక్తిప్రపత్తులు కలిగింపవలయు నని భగవంతుని ప్రార్థించుచున్నాను.

ఒకనాడు అన్నమయ్యకు అప్తుడై యతని యడుగులకు మడుగు లొత్తుచుండిన సాళ్వ నరసింహరాయలే నేఁడు శ్రీ టి. ఆర్. నరసింహము గారుగా జన్మించి తాము నిమిత్తముగా రచితములయిన కీర్తనలను ప్రకటించుకొనుటకై శ్రీ అన్నారావుగారికి ఈ కీర్తనల విషయమున చేదోడు వాదోడుగా నున్నారేమో! అను విధముగా ప్రవర్తించుచున్నారు. వీరికిని శ్రీస్వామివారు ఇతోధిక శ్రద్ధాసక్తులను ఆయురారోగ్యములను కలిగింపవలయు నని స్వామివారిని ప్రార్థించుచున్నాను.

నేటికి ప్రకటితములైన తాళ్లపాక సంకీర్తనల సంపుటములలో నిది పదునైదవది. ఇందు 250 వ రేకునుండి 300 వ రేకువరకు గల శృంగారసంకీర్తనలు ప్రకటింపబడినవి. శృంగార సంకీర్తనల సంపుటములలో నయిదవ దిది.

తాళ్లపాకవారి కీర్తనలను ప్రచారమునకు తెచ్చుటయందు శ్రద్ధ వహించుచున్న సంగీత విద్వాంసులకును, ఆలిండియా రేడియోవారికిని తెలుగుదేశము ఎంతో ఋణపడి యున్నది. వారికి శ్రీస్వామివారు ఇతోధికమైన శ్రద్ధాసక్తులు కలిగించి ఆయురారోగ్యములను కలిగింపవలయు నని ప్రార్థించుచున్నాను.

సుమారు 1000 సంవత్సరములనుండి అరబ్ దేశమున వారి కావ్యములను తామ్రఫలకములపై వ్రాయుచుండిరని వారిచరిత్రవలన తెలియుచున్నది. ఆ ఆచారమునుబోలియే తాళ్లపాకవారి రచనలుగూడ ఇన్నివేల రేకులపై కెక్కినవేమో! ఆ రేకులుకూడ 36 అంగుళముల పొడవు 15 అంగుళముల వెడల్పు కలిగియున్నవి. అంచులోను ముద్ర వేయబడి యున్నది. నేఁడు అహోబలమున దొరకిన రేకులతీరును సరిగ అదే విధముగ నున్నది. నేటికిని జెరూసలేమ్ నగరమున హామీదియా పుస్తకాలయమున ఆరేకులు కలవు. రాగిరేకులపైగాక చర్మములపైగూడ వ్రాయు నాచారము ప్రాచీనమైనదే అరబ్బులకు. ద్వితీయప్రతాపరుద్రుని నాటివాడు అన్నమాచార్యులకు సుమారు నూరేండ్లకు ముందుండినవాడు

నైన కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములలో 32 వ వచనమున " సకలజీవహింసలు చేసి మాంసమువండించేటి లోహము వేద శాస్త్రపురాణంబులు వ్రాసేటి లోహములున్ను పరుసము సోకిన శుద్ధ సువర్ణము గాదా " అని కలదు. దీనినిబట్టి మనదేశములో కూడ ఆనాడు లోహములపై గ్రంథములు వ్రాయు అలవా టున్నట్లున్నది.

స్వరసహితమైన సాహిత్యము కడచిన శతాబ్దపు కడపటి భాగమునసే ఆరంభించి వ్యాప్తిని పొందినదని సుప్రసిద్ధులైన సంగీతవిద్వాంసుల అభిప్రాయము. కాని యిందుకు భిన్నముగా నిప్పటికి లభించిన విషయ సామగ్రిని నివేదించుచున్నాను.

(1) సరిగమాది స్వరవిన్యాసముతోను సాహిత్యముతోను తిరుమలలో శ్రీస్వామివారి చంపకప్రదక్షిణోపక్రమమున సుమారు 4 అడుగుల వెడల్పు 7 అడుగుల ఎత్తుగల శిలాఫలకములపై శాసనరూపముగా చెక్కించియుండిరి. అవి యెన్ని చెక్కి నాటియుండిరో తెలియరాదు. కాని 1919 లో నేనువెళ్లి చూచునప్పటికి 4 వ వరుససంఖ్యగల శిలాఫలకమును, సంఖ్యలేనిది యొకటియు వెరసి రెండు ఫలకము లుండినవి. అస్మద్గురువర్యులైన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి కీవిషయమునుతెలిపి దేవస్థానము వారి అనుమతితో వెంటనే లారీలో ఆ శిలాఫలకములను తిరుపతిలోని దేవస్థానమువారి మ్యూజియమునకు చేర్చితిని. కారణాంతరములచే నేటి వరకు ఆ శిలాఫలకముల ప్రకటనము జరుగ లేదు. ఇప్పుడే వాని ప్రతిబింబములు తీయబడినవి. అందలి సాహిత్యము తాళ్లపాకవారిదిగనే కలదు. అన్నమాచార్యులచే దేవభాషలో రచింపబడి ఆయన పుత్రుడైన పెదతిరుమలాచార్యులచే వ్యాఖ్యానింపబడి ఆయన మనుమడైన చినతిరుమలాచార్యులచే పద్యకావ్యముగా రచింపబడిన " సంకీర్తనలక్షణము " అను గ్రంథమునకు లక్ష్యము లందు చెక్కినట్టున్నారు. ఇందులో అక్కడక్కడ ఉద్గ్రాహము, మేళాపము, ధృవము, అంతరము, ఆభోగము ఉగము, ఆవృతనియమము, ఝంప, అట, రూపక, తివడ అని కలవు

శ్రీవెంకటేశ్వరముద్రతో సంస్కృతభాషలో కీర్తన కలదు. లిపితీరు వగైరాలన్నియు చినతిరుమలాచార్యుల నాటివే. పూర్తి ప్రతిబింబములతోను సాహిత్యముతోను తరువాతి సంపుటములో ప్రకటించుచున్నాను.

(2) తంజావూరి సరస్వతిమహల్ లైబ్రరీలోగల ప్రాచీన తాళపత్రప్రతులలో పురందరదాసులవారివి కొన్ని, తోడరమల్లనియు అభినవ భరతాచార్యుడనియు ప్రసిద్ధిని పొందినవాడు అచ్యుతదేవరాయల మంత్రి సంగీతసాహిత్య విద్వాంసుడునైన బయకారరామామాత్యుని కీర్తనలు కొన్ని, శ్రీరంగరాజుకుమారుడు శ్రీవెంకటాద్రిరాజు పేర రచించినవి కొన్ని, గోవిందదీక్షితుల కుమారుడు వెంకటమఖివి కొన్ని, మేలట్టూరు శ్రీరామనాధ సోదరులు రచించినవి కాబోలు కొన్ని సంగీతసాహిత్యములతో కలవు. ఇప్పటికి నాయెఱుక కందినంతవరకు మనవి చేసితిని. ఇంకను ఏవైన దొరకిన రాబోవు సంపుటములో మనవి చేయగలను.

శ్రీరంగమున తాళ్లపాకవారి సంకీర్తనల తామ్రఫలకములు తాళపత్రగ్రంథములు కల వని తెలిసికొని కోరగా మద్రాసు గవర్నమెంటువారు తమ అధీనమునగల రేకులనుండి కాపీ చేసుకొనుటకు దయతో అంగీకరించినారు. అందలి సంకీర్తనలనుకూడ తెచ్చి యిచ్చుటి రేకులలోని కీర్తనలతో సరిచూచి, ప్రకటింపవలసిన కీర్తనలను ప్రకటింపగలను. ఇందుకు దేవస్థానమువారి తరఫున మద్రాసు గవర్నమెంటువారికి జోహారు లర్పించుచున్నాను. నేటికిని శ్రీరంగమున తాళ్లపాకవారిపేర ఉత్సవాదులు జరుగుచున్న వనియు కీర్తనలు పాడుచుందురనియు వినికి. దాని యాథార్థ్యమును రాబోవు సంపుటమున తెలుపగలను.

సింహాచలమున, చిదంబరమున, ఇంకను అహోబలమున, చుట్టుపట్లు, కదిరిలోను తాళ్లపాకసంకీర్తనల తామ్రఫలకము లున్న వని తెలియవచ్చుచున్నది. వానిని సేకరించుటకు ప్రయత్నము జరుగుచున్నది. సింహాచలమున నేటికిని తాళ్లపాకవారిపేర ఉత్సవాదులు జరుగుచున్న వనియు వారిపాటలు పాడుచున్నా రనియు వినికి.

పుదుక్కోటలో శ్రీకృష్ణభాగవతారు వారియొద్ద కొన్ని కీర్తనల సంపుటములు కల వనియు వారు పాడుదు రనియు విన్నాను. *

తంజావూరి సరస్వతిమహాల్ లైబ్రరిలోని వరుస నెం. 809, M. నెం. 448 గల "విష్ణునామసంకీర్తనఫలము" అను కృష్ణమాచార్యుల సంకీర్తనల తాళపత్రగ్రంథము తుదిని ఐదుపత్రములలో వెంకటేశ్వర సేవాఫలము మేలుకొలుపుపాటలును గలవు. ఆ ఐదుపత్రములలోనివి గూడ తాళ్లపాకవారికి కాదగును. అందే వరుస నెం. 459. B. నెం. 11657 గల " పదములు కీర్తనలు " అను సంకలనగ్రంథమున 14 తాళపత్రములలో తాళ్లపాక సంకీర్తనలు రాగతాళములతో గలవు. అవియు క్రమముగా ప్రకటింపబడును. ఇందుగల కీర్తనలన్నియు ఒకచరణమును ముందు పాడి తర్వాత పల్లవిని పాడి ఆ తర్వాత మిగిలిన చరణములను పాడునట్లు వ్రాసి యున్నవి. ఇది రేకులలోని ఆనుపూర్వికి భిన్న మైనది.

నేటి కుపలబ్ధములైన తాళ్లపాక సంకీర్తనల ఆనుపూర్విగల రేకులలో అక్కడక్కడ కొన్ని సంఖ్యలవి కానరావు. కానరానిరేకులు కొన్ని నలువదేండ్లకు పూర్వము మదరాసు యూనివెర్సిటివారు, కొన్ని ఆంధ్ర సాహిత్యపరిషత్తువారికిగాను శ్రీజయంతి రామయ్యపంతులుగారు ప్రదర్శనము (ఎగ్జిబిషన్) న కని కొనిపోయిరి. అవి యేమైనవో తెలియరావు. † ఆంధ్రవిశ్వవిద్యాలయమున హిస్టరీడిపార్టుమెంటులో కొన్ని ప్రతిబింబములు మాత్ర మున్న వని తెలియవచ్చెను. అవి సేకరించు ప్రయత్నము జరుగుచున్నది.

తాళ్లపాకవారికి రాజులు ప్రజలు నిచ్చుచుండిన మర్యాదలు, వారి సంతతిని గూర్చిన వివరములు, నేటికిని ప్రచారములోనున్న తాళ్లపాకవారి

---

* ఈ విషయమును ప్రొఫసరు సాంబమూర్తిగారు కూడ ధ్రువపఱచిరి.

† శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు కూడ నీ విషయమును ధ్రువపఱచిరి.

కీర్తనలు యింతకుపూర్వ మిచ్చినవి గాక మిగిలినవాని వివరములు. శ్రీశాస్త్రిగా రిచ్చినవిగాక యింకను మిగిలినవి రాబోవు సంపుటములో ప్రకటింపగలను.

తలనెఱసినవాడను వయసుముదిరినవాడను కాకపోయినను వయసున చిన్నవాడనైన నన్ను శ్రీశాస్త్రిగారి శిష్యుడననే ప్రేమతో నన్నీకీర్తనల పరిష్కరణకార్యమున నియోగించిన శ్రీ అన్నారావుగారికి జోహారు లర్పించుచున్నాను.

అన్నమాచార్యుల సంకీర్తనల పరిష్కరణ కార్యమును ప్రకటన కార్యమును చూచుటకు నాకు అనుమతి యిచ్చిన శ్రీవెంకటేశ్వర యూనివెర్సిటీ అధికారులకు జోహారు లర్పించుచున్నాను.

ముద్రణమున పరిష్కరణమున కొన్ని దోషములు దొరలియుండ వచ్చును. సహృదయులు మన్నింతురు గాక.

తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రణాలయమువారు సకాలమునకు ముద్రణము చేసి యిచ్చినందులకు కృతజ్ఞత తెలుపుచున్నాను.

తిరుపతి
11—10—'61

అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు.

శ్రీ
శుభమస్తు
శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

## ౧౩-వ సంపుటము

[స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన, పదారు యేండ్లకు తిరువేంగళనాథుఁడు ప్రత్యక్షమైతేను, అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ * నిరుధానకు, తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన శృంగార సంకీర్తనలు.] †

251-వ రేకు దేసాక్షి

దగ్గరితె మొగచాటు దప్పుల నుంటేఁ జవి
నిగ్గుల యీరెండూను నీవాళ్లనే కంటినే ॥ పల్లవి ॥

చెలియ పతిఁ గానక చింతతో నుండి అతఁడే
పిలువఁగా యిప్పుడైతే బిగిసేవే
కలయ నంటా దూరి గక్కనఁ జెయి వట్టితే
మొలకనవ్వులతోడ ములిగేవే ॥ దగ్గ ॥

అప్పుడైతే యెదమాట లాడించి నాయకుఁడు
తప్పక చూచితే నిట్టె తల వంచేవే
వుప్పతించి దూరఁగానె వొద్దఁ గూచుండి నాతఁడు
పిప్పిగట్టె సిగ్గులతోఁ బెనఁగేవే ॥ దగ్గ ॥

---

* ఈ శబ్దము అపరిచితము. అస్మద్గురు దేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు "నిరోధానకు? తిరోధానానకు?" అని సందేహముతో పాఠము సూచించిరి.
నిరుధానము అనగా చనిపోవు అను అర్థమున ప్రయోగించి నట్లున్నది.

† ఈ వచనము మొదటి రేకునమాత్రమే గలదు.

చిత్తములోఁ గోరినట్టి శ్రీవెంకటేశ్వరుఁడు
అత్తి నిన్నుఁ గూడితేనె అలసేవే
పొత్తుల మోవితేనెతీపుల సోకించె నితఁడు
బత్తి సేయఁగా నీవు భ్రమసేవే. ॥ దగ్గ ॥ 1

పాడి

ఏమే నేవచ్చి యిప్పు డెంత దడ వాయనే
దీమసపుదానవు నేఁ దెమలించఁ గలనా ॥ పల్లవి ॥

నిక్కిచూచి నన్నాతఁడు నీవద్దికిఁ బెట్టి పంపె
యెక్కడ నున్నది చిత్త మే మంటివే
కక్కసించి యడిగితే కంట నీరు వెట్టేవు
యెక్కడ గెలవవచ్చు నిటువంటివారిని ॥ ఏమే ॥

వాకిటఁ దా నిలుచుండి వడి నాతో సన్న సేసి
యీకడ నా కిఁక బుద్ధి యేమంటివే
పైకొని కొంగు వట్టితే బలిమి నుసు రనేవు
నీకు నీకే తెలుసునే నెరవాదితనము ॥ ఏమే ॥

యిదిగో శ్రీవెంకటేశుఁ డెచ్చరింపించి నాచేత
యెదుటనె పెనగొనీ నే మనేవే
పొదిగి కలనెఁ దానె పూఁచి నీవు నవ్వేవు
ముదమునఁ బను లెల్ల ముందువెన కాయనే. ॥ ఏమే ॥ 2

భైరవి

ఏమిసేతు నాగుణ మీపాటిది
కామించి పీవుగాఁగాఁ గైకొనేవు గాని ॥ పల్లవి ॥

ననుపు వటించఁగానె నంటు నీతో నైతిఁ గాని
పెనఁగితేఁ గడుఁ గడు పెలుచ నేను

మనసు నమ్మించఁగానె మారుమాట లాడఁ గాని
ఘనమై మీరి వచ్చితె గబ్బిదాన నేను ॥ ఏమి ॥

సలిగె చెల్లించఁగానె సరుసమాడేఁ గాని
మలసితే నంతకంటె మంకను నేను
చలివాసి నవ్వఁగానె సంతోసించుకొంటిఁ గాని
సొలసి కపటమైతె జూటుదాన నేను ॥ ఏమి ॥

కైవసము గాఁగానె కరఁగి మెచ్చితిఁ గాని
మూవంకలు మెట్టితేనె మొక్కలి నేను
శ్రీవెంకటేశ నీవు చేరి కూడఁగానె కాని
సోవలుగా మొరఁగితే జూజరి నేను. ॥ ఏమి ॥ 3

లలిత

ఆపె నందునో నిన్ను నందునో యీ చేఁతలకు
యేపున వూరెల్లా పొందు లింతగాఁ జేసితివి ॥ పల్లవి ॥

యిద్దర మేకతమాడె యీవేళ మనవద్ద
గుద్దిరాన నాపె వచ్చి కూచున్నది
దిద్దరాదా అప్పేమైనఁ దీసుకొంటేఁ గనక నీ
విద్దెస సతుల కస మింతగా నిచ్చితివి ॥ ఆపె ॥

లోనికేఁగి నీవు నేను లోలత నవ్వుచుండఁగా
తానువచ్చి నీకుఁ బాదము లొత్తీని
నేనగా నియ్యఁగరాదా జీఁతము చిక్కితేఁగన
యీ నెపాన మందెమేళ మింతగాఁ జేసితివి ॥ ఆపె ॥

వోరిచి ముసుఁగు వెట్టు కొాగి నిన్నుఁ గూడితేను
పేరున శ్రీవెంకటేశ పిలిచీ నాపె
యీరాదా ఆపె సొమ్ము లెత్తుక వచ్చితేఁగన
యీరీతి చనవు లిచ్చి యింతగాఁ బెంచితివి. ॥ ఆపె ॥ 4

## శ్రీరాగం

ఎవ్వరి నే మన లేవు యింతేసికి నోపము
పువ్వునఁ బుట్టినయట్టి పూఁపవంటివాఁడవు ॥ పల్లవి ॥

మిక్కిలి నీతో నేను మేరలు మీరిన నైతే
యెక్కడ నెవ్వతె వచ్చి యేమనునో
దక్కితి సారెసారెకుఁ దడవకువయ్య మమ్ము
చిక్క నీ వందరిపెట్టుఁజెట్టువంటివాఁడవు ॥ ఎవ్వ ॥

చెనకి నీ బుజముపై చెయి నేను వేసితేను
వనిత యెవ్వతె వచ్చి వంతు వట్టునో
పెనఁగి నీ వాడా నీడాఁ బిలువకువయ్య నన్ను
తనిసి సూదిపిరిఁది తాడువంటివాఁడవు ॥ ఎవ్వ ॥

గుట్టున నిన్నుఁ గూడితి గోర నిన్ను నూఁదితేను
దిట్టయై యెవ్వతె వచ్చి తేరి చూచునో
పట్టి శ్రీ వెంకటేశ్వర భ్రమలఁ బెట్టకువయ్య
బట్టబయటిపెసరుఁబంటవంటివాఁడవు. ॥ ఎవ్వ ॥ 5

## సౌరాష్ట్రం

అలిగేదె సహజము ఆఁడువారికి
మలసి నీవె తిద్దుక మన్నించవయ్యా ॥ పల్లవి ॥

పలుకక నే నెంత పంతాన నీతో నుండిన
తలఁపు నీపైదెకాన తప్పు లేదు
చెలఁగి మందెమేళాన చెయివట్టి తీసినాను
యెలమి నీవూచిగాన కెగ్గు లేదు ॥ అలి ॥

మల్లాడి కోపముతోడ మంచము దిగకుండిన
తొల్లె నీకాలు దొక్కితి దోసము లేదు

పల్లదాన వెంగెమాడి పకపక నవ్వినాను
వెల్లవిరి నాపనికి వెగటు లేదు ॥ అలి ॥

కావరించి నిన్నుఁగూడి గర్వముతో నుండినాను
కైవసమయితిఁగాన కడమ లేదు
శ్రీ వెంకటేశ నన్నుఁ జిత్తగించి యేలితివి
వేవేలు భోగములకు వేసట లేదు. ॥ అలి ॥ 6

252-వ రేకు రామక్రియ

కానీవయ్య దానికేమి కాంత యవివేకి గాదు
సానఁబట్టి చూచీని సరిత లన్నియును ॥ పల్లవి ॥

మంతనాన నీతోను మాటలాడినంతలోనె
పంతము దప్పదుగా పడఁతికిని
సంతసాన నిన్నుఁజూచి సరసమాడినంతలో
దొంతుల కురుకఁడుగా దొరకొని మరుఁడు ॥ కానీ ॥

వరు సెరిఁగి కాచుక వద్దఁ గూచుండి నంతలో
చొరతనము దప్పదు తొయ్యలికిని
విరసములేక నీకు విడె మిచ్చినంతలోనె
కరకరిఁ బెట్టవుగా కప్పురపుటుండలు ॥ కానీ ॥

ననుపునేసుక నీతో నవ్వి నంతలోననె
తన నేరుపు దప్పదు తరుణికిని
యెనసె శ్రీ వెంకటేశ యిటు నీవాదరించఁగా
పెనపులఁ బెట్టవుగా ప్రేమపువలపులు. ॥ కానీ ॥ 7

కాంబోది

చెప్పినట్టె పతిపంపు సేతువు గాక
చిప్పిలుఁ జెమటలతో సిగ్గు లేఁటికే ॥ పల్లవి ॥

చెక్కు చేతఁ బెట్టుకోగా సెలవుల నవ్వు నీకుఁ
  జిక్కె నేఁడు మరి వేరె చింత యేఁటికే
దక్కె నీకు వలపులు దండ నున్నాఁడు విభుఁడు
  మొక్కలపు వెరగుతో మోన మేఁటికే ॥ చెప్పి ॥

నిట్టూర్పు నించఁగాను నిక్కఁగుచములమీఁద
  యిట్టి పులకలు నిండె నేఁక టేఁటికే
జట్టిగొనె వేడుకలు చనవు లాతఁడె యిచ్చె
  వట్టి అలుకతోఁ దల వంచ నేఁటికే ॥ చెప్పి ॥

పానుపుపై నుండఁగానె బలిమి శ్రీవెంకటేశుఁ
  డానుక నిన్నుఁ గలసె నార డేఁటికే
నీనోము లీడేరె నీమొ (మ?) గఁడు నిన్ను మెచ్చె
  కోనల బొమ్మ జంకెన కొన రేఁటికే. ॥ చెప్పి ॥ 8

బౌళి

మానుసులకుఁ దరమా మరి యివి నీకె కాక
  అనుకొని సేసే నీ దయ్యపు చేఁతలు ॥ పల్లవి ॥

నిండు గొల్లతనమున నీకె తగునయ్యా
  కొండ యెత్తినట్టి గొడగుల నీడలు
గండపురాకాసివేఁటకాఁడవు నీ కమరును
  దుండగపుటూరజాతు (త?) రబోనాలు ॥ మాను ॥

యిల దేవపిండమవయ్యిన నీ యాటలయ్యా
  బలుసముద్రాలమీఁది పాటపరువు
అలరు కాముకుఁడవుఅయిన నీకుఁ జెల్లునయ్యా
  చలమరి బ్రహ్మతోడి చయ్యాటాలు ॥ మాను ॥

కొయ్యరాచవాఁడవు కోరి నీకు నబ్బె నయ్యా
  పుయ్యక దూలచుట్టాల పోరాటాలు
యియ్యెడ శ్రీవెంకటేశ యేలితి పదారువేల
  నెయ్యాన నన్నుఁ గూడితి నిలిచెఁ బైకొసరు. ॥ మాను ॥ 9

## హిజ్జిజి

ఏమి చూచే వాపెదిక్కు యెందాఁకాను
నేముసేసేపనిగాదు నెయ్యపు యీవేళను ॥ పల్లవి ॥

చెలి నీతో నవ్వు నవ్వి చెక్కు లెల్లాఁ జెమరించె
వలిపె పావడఁ దుడువఁగరాదా
నిలువెల్లఁ బులకించె నీతో మంతనమాడి
చలివాయఁ బచ్చడ మిచ్చుటఁ గప్పరాదా ॥ ఏమి ॥

కాంత నీపదాలు వాడి కడు దప్పిగొనె నిదె
యింతట మోవితేనియ లియ్యరాదా
చెంత నీపాదా లొత్తి సిగ్గునఁ గుమ్మడి జారె
కాంతుఁడవు యింతటను కాఁగిలించరాదా ॥ ఏమి ॥

వనిత నీమోము చూచి వసివాడు వాడీ నదె
వెనుకొని నీవు తెర వేయరాదా
ఘనుఁడ శ్రీ వెంకటేశ కలసితి వింతలోనె
ననిచె నలమేల్మంగ నంటు సేయరాదా. ॥ ఏమి ॥ 10

## భైరవి

నీవు వాఁటి దూర నేలె నిన్ను నంటినకతాన
యీవిధిఁ బొందెను నిన్ను నివి దూరుఁగాక ॥ పల్లవి ॥

కప్పుర మేమి సేసునె కాంతుఁడు రాకుండఁగాను
అప్పటివేళనె కారమాయఁగాక
తప్పుగద్దా గందానకు తాపాన నీవుండఁగాను
వుప్పతిల్లి దానికె వుడుకెత్తెఁగాక ॥ నీవు ॥

విరులకు నేర మేదె విరహంపువేళ నీకు
గరిమ వేఁడికి నొడిగట్టెఁగాక
మరుఁడు పగవాఁడా నీమనసులో కాఁక సోఁకి
తిరమై అనంగుఁ డంటా తిట్టువడెఁగాక ॥ నీవు ॥

చల్లగాలి వెట్ట యౌనా సారె నీమీఁద విసరి
పల్లదాన వడ దాఁకి భ్రమసెఁగాక
యిల్లిదె శ్రీ వెంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడఁగాను
యెల్లవారు మంచివారై యీడేరిరిగాక. ॥ నీవు ॥ 11

ఆహిరి

చెప్పినట్టు సేసేఁగాక చెనక నేలా
కప్పితివి పచ్చడము ఘన తిదె చాలదా ॥ పల్లవి ॥

యెన్నిరేవు మంచిమాట లెందాఁకా నాదేవు
విన్న వినుకులె కావా వెనకకును
సన్నముగాఁ బులకించె జలజలఁ జెమరించె
కన్నుల నీళ్ళు దుడిచి కైకొంటివి చాలదా ॥ చెప్పి ॥

యింతలోనె చెక్కు నొక్కే వేమి నేరుచుకొంటివి
వంతు వచ్చినదెకాదా వనితలతో
దొంతులాయఁ గోరికలు తురుమునెరులు జారె
యింతట వంచినశిర సెత్తితివి చాలదా ॥ చెప్పి ॥

కలసితి విట్టె నన్ను కడుజాణ వవుదువు
తొలుతనె మెచ్చనా దూరుతా నిన్ను
యెలమి శ్రీ వెంకటేశ యేకచిత్తమాయ నాకు
తెలిగన్నులనె సిగ్గు దేర్చితివి చాలదా. ॥ చెప్పి ॥ 12

253-వ రేకు సామంతం

గుట్టువాఁడ వంటాఁ గొసరితి
యిట్టి నీ వంటేది యెఱఁగముగా ॥ పల్లవి ॥

చెక్కుచేతితో సెలవి నవ్వితే
తొక్కేవు పాదాలు దోమటిగా
అక్కర నీ వింత ఆసకాఁడ వవుత
యిక్కడ మాలోనె యెఱఁగముగా ॥ గుట్టు ॥

మంతనాన నీతో మాటలాడితే
సంతసానఁ గొంగు జాఱించేవు
బంతినె నీ వింత పంతగాఁడ వౌత
యెంత కెంత నేము యెఱఁగముగా ॥ గుట్టు ॥

సిగ్గుతోడనే సేవ సేసితే
యెగ్గు దీర నన్ను నెనసితివి
అగ్గపు శ్రీ వెంకటాధిప యిట్టవుత
హిగ్గిన వేడుక నెఱఁగముగా. ॥ గుట్టు ॥ 13

ముఖారి

ఏలే చెలియ యీ యింతుల కెల్ల
సోలగిలి నీ చనవు చూపవలెనా ॥ పల్లవి ॥

మిక్కిలి యాతఁడు నీపై మేలు గలఁడంటానె
వెక్కసాన నిందరిలో విఱ్ఱవీఁగేవు
చక్కనివిభుఁడు నీ జవదాఁటి కుండితేనె
తక్కక నీ వాకతెవే దక్కఁగొంటివా ॥ ఏలే ॥

మనసి చ్చాతఁడు నిన్ను మన్నించె నంటానె
యెనలేక యిందరి నీ వేలఁ జూచేవు
ఘనమైన మోహపుకాంత నవుదు నంటానె
. గునియుచు సారె నాడుకొనవలెనా ॥ ఏలే ॥

అన్నిటాఁ బట్టపురాణి వై తె నవుదువు గాక
వెన్నుఁడు శ్రీవెంకట విభునికిని
వన్నెలు చూపవలెనా వడి నీ సవతులకుఁ
బన్నియాతఁడును నీవె బ్రదుకరమ్మా. ॥ ఏలే ॥ 14

దేవగాంధారి

అతిరాజసపు దొరవైన నిన్నును
సతమైన నే నిట్టెసాదించవచ్చునా ॥ పల్లవి ॥

వెడఁగు నీ సుద్దులెల్ల వీనుల వినుటగాక
నొడిగి నిన్నవి నే మానుపవచ్చునా
కడఁగిన చేత లెల్ల కన్నులఁజూచుటగాక
అడఁచి నీతో నొఁగా దనవచ్చునా ॥ అతి ॥

పచ్చి నీగుణములకు పరిణామించుటగాక
కెచ్చురేఁగి బొమ్మల జంకించవచ్చునా
తచ్చిన నీ యెమ్మెలకుఁ దలవంచుకొంటగాక
వొచ్చమని నిన్ను మెచ్చకుండవచ్చునా ॥ అతి ॥

దక్కిన నీకాఁగిటను తనివి నొందుటగాక
చక్కని నిన్ను నేఁ గొసరవచ్చునా
అక్కున శ్రీ వెంకటేశ అలమేలుమంగనేను
యెక్కువ నీరతు లివి యెంచవచ్చునా. ॥ అతి ॥ 15

లలిత

కల దింతె మాఁట కంతుని యాఁట
తెలుసుకో నీలోనిదియె పూఁటవూఁట ॥ పల్లవి ॥

అలమేలుమంగా హరియంతరంగా
కలితనాట్యరంగ కరుణాపాంగ
చెలువుఁడు వీఁడె చేకొను నేఁడె
వలరాజుతూపులివి వాఁడిమీఁది (ద?) వాఁడి ॥ కల ॥

అలినీలవేణి యంబుజపాణి
వెలయంగ జగదేకవిభునిరాణి
కలయు నీ పతి వచ్చె గక్కన ని న్నిదె మెచ్చె
పలికీని చిలుకలు పచ్చి మీఁదఁబచ్చి ॥ కల ॥

సితచంద్రవదనా సింగారసదనా
చతురదాడిమబీజచయరదనా
యితవైన శ్రీ వెంకటేశుఁడు ని న్నిదె కూడె
తతిఁ దలపోఁతలు తలకూడెఁ గూడె. ॥ కల ॥ 16

ముఖారి

మగువ నేను నీవు మగవాఁడవు
తగ చొక్కజాతి గాదు తలవయ్య నీవు ॥ పల్లవి ॥
వేఁకపు వెన్నెలముగ్గు వేడుక నామోము నిగ్గు
చీఁకటినీలపుగీము జిగి నీమోము
యేఁకట నీకును నాకు నేఁటిపొందు నన్నుంత
తాఁకనాఁడవద్దు వద్దు తలవయ్య నీవు ॥ మగు ॥
కలువరేకులముంపు కలికి నీకనుసొంపు
జలజపురూపు నీ చాయలచూపు
యెలమితో నిందు కందు కేవూరి కేవూరు
తొలఁకు గచ్చులు మాని తొలవయ్య నీవు ॥మగు ॥
తనరుఁ గొండల తరతరము నావురము
మినుకువజ్రపుటేను మించు నీమేను
ఘనుఁడ శ్రీవెంకటేశ కలయు నీరతులలోఁ
దనిసి నే నొక్కటైతిఁ దలవయ్య నీవు. ॥ మగు ॥ 17

భూపాలం

మూలనున్నవారి మమ్ము ముంగిటవేసీఁగాక
జోలి దవ్వీఁగాక నే సోదించఁగలనా ॥ పల్లవి ॥
వెన్నెలతె యెండలంటా వేగించె తనకుఁగాను
నన్ను నవ్వీఁ దనతో నే నవ్వఁగలనా
చిన్నిచెమటలవాన చిత్తడిపాలైన నా
చన్ను లంటీఁ దన్ను నే జుంకించఁగలనా ॥ మూల ॥
పాయ మిదీ భార మంటాఁ బలికె నాతోమాట
లాయము దాఁక నాడీ మారాడఁగలనా
కాయంపుఁబులకలచే గజిబిజియైన నాపైఁ
జేయి వేసీఁ దన కిది చెల్ల దనఁగలనా ॥ మూల ॥

నిమిషమె యుగమై నివ్వెరగైన నన్నుఁ
దమి నడియాస ముంచీఁ దాళఁగలనా
సమరతి ననుఁ గూడె జంట శ్రీ వేంకటపతి
కమలపుటింతి నింతేఁ గావనఁగలనా. ॥ మూల ॥ 18

254-వ రేకు మంగళ కౌశిక

దవ్వులసరసములు తగునా నీకు
వువ్విళ్లె మేన నొచ్చమున్నవానివలెను ॥ పల్లవి ॥
గోడ నిక్కి చూచేవు గొబ్బున దగ్గరిరావు
ఆడనుండె యెడమాట లాడించేవు
వీడెపు నీమోవి చూపి వికవిక నవ్వేవు
కూడి ముట్టువారి ముట్టుకొన్నవానివలెను ॥ దవ్వు ॥
యెదుట సన్నలు సేసే వేకతము లాడేవు
పొదిగి నే రమ్మంటేఁ బొందు చూపేవు
బెదరేవు నీమేను పెనుగోర నంటితేను
చెదరి చీఁకటితప్పు సేయువాని వలెను ॥ దవ్వు ॥
అలికేవు వులికేవు అంతలోన భ్రమసేవు
వెలయ నిలువుననె వెరగందేవు
యెలమి శ్రీ వెంకటేశ యీడకు విచ్చేసి నీవు
కలసితి విదె కలగన్నవానివలెను. ॥ దవ్వు ॥ 19

ముఖారి

కూడని దొకటొకటి కోరీ మరుబలము
ఆడనె నీసతి కన్నియుఁ గూడె ॥ పల్లవి ॥
పొంగెటిమనసే వెలిపులకమొలకలు
అంగపుఁ జెమట మోహపుఁగరఁగు
వెంగలితమకములు విసరెటి వూర్పులు
అంగన కిదివో అన్నియునుఁ గూడె ॥ కూడ ॥

యెనసెన యాసలె యెదురుల చూపులు
అనుగుఁగూరిములె ఆలకింపులు
నినుపు మోమోటములు నిండిన నివ్వెరగులు
అనయము సతి కిప్పు డన్నియునుఁ గూడె ॥ కూడ ॥

కాఁగిటిపరవశాలు కన్నులతేలింపులు
చేఁగల సిగ్గులె చిరునవ్వులూ
యీగతి శ్రీ వెంకటేశ యింతలో విచ్చేసి చెలి
నాఁగి కూడఁగా నివి యన్నియునుఁ గూడె. ॥ కూడ ॥ 20

మంగళ కౌశిక

చేరి నీవు చెప్పినట్టు సేసితి నేనూ
వారి వీరివలె మఱవకుమీ నన్నునూ ॥ పల్లవి ॥

జలధి దచ్చి లక్ష్మిని సంగడిఁ బెండ్లాడునాఁడు
అలరి రుక్మిణిఁ బెండ్లి ఆడెనాఁడు
నెలనువిల్లు విఱిచి సీతఁ బెండ్లియాడునాఁడు
పలికి బొంకనిమాఁటపట్టు నాకు నిమ్మీ ॥ చేరి ॥

సరుసఁ బదాఱువేలుసతులఁ బెండ్లాడునాఁడు
అరసి భూసతిఁ బెండ్లియాడు నాఁడు
పరగ రేపల్లె గోపభామలఁ బెండ్లాడునాఁడు
యిరవై యిచ్చినబాస యిమ్మీ నాకు ॥ చేరి ॥

అదె శ్రీ వెంకటపతి అలమేలుమంగ నిట్టె
అదన నీవు పెండ్లియాడునాడూ
యిదె నన్నుఁ గూడితివి యెక్కువగా మన్నించి
యెదుట నమ్మించినవి యెంచుమీ నాకు. ॥ చేరి ॥ 21

లలిత

పోయిన దెల్లాఁ బొల్లు పూఁచిన దొక్కటె కాక
కాయజకేళికి నింకఁ గదియ రమ్మనవే ॥ పల్లవి ॥

అడిగిరావె విభుఁ డందు కేమనీనో
యెడయనిదాస నీకిచ్చినాఁడు
నుడుగులు దప్పినాను నోముఫలము దప్పదు
తడవి యింతటనైన దగ్గరి రమ్మనవే ॥ పోయి ॥

పిలిచి రాఁ గదె తనబిరు దెట్టు చెల్లీనో
పెలుచు మే నాహి నాకుఁ బెట్టినాఁడు
వెలయఁ దినఁగ నదె వేమైనఁ దీ పవును
తలఁగక యింకనైన దగ్గరి రమ్మనవే ॥ పోయి ॥

యిచ్చిరావె యీవిడెము యిన్నిటా మెచ్చితినని
కొచ్చినరతుల నన్నుఁ గూడె నేఁడు
తచ్చిన పక్వాన నంటు తరువఁ దరువ వెన్న
యిచ్చట శ్రీ వెంకటేశు నిట్టె రమ్మనవే. ॥ పోయి ॥ 22

శంకరాభరణం

ఇద్దరు మోనాన నున్నా రిది యేమయ్యా
వద్ద నాకె పైకొని నీవలెనె పో అయ్యా ॥ పల్లవి ॥

పూచిన తంగేడువలె పొలఁతి దండ నుండఁగ
యేచి కూచుండు మన విది యేమయ్యా
చాఁచి కప్పురవిడెము సరి నీకు నందియ్యఁగ
చేచేత నందుకోవు చెల్లఁబో యేమయ్యా ॥ ఇద్ద ॥

ముంగిటి నిధానమై ముదిత పూఁకొనఁగానె
అంగవించి మాటలాడ వదేమయ్యా
బంగారుసురటి నీపై చెమటలు విసరఁగ
అంగ మెల్ల మరచితి వది యేమయ్యా ॥ ఇద్ద ॥

నిండిన సంపదవలె నెలఁత ని న్నంటితేను
అండ నో రెత్తలే వైతి వదేమయ్యా
మెండగు శ్రీ వెంకటేశ మెలుఁత నిన్నుఁ గూడఁగ
యెండ లెల్ల నీడ లాయ నిది యేమయ్యా. ॥ ఇద్ద ॥ 23

లలిత పెళ్లిపాట.

ఇక నేలయ్య మా యెదమాటలు
మొకమొక మెదుటనె ముయికి ముయాయ ॥ పల్లవి ॥
సుదతికి నీచూపు సూసకమై చెలువొందె
కదిసాకెచూపు బాసికము నీ కాయ
యెదుర నీకు నాకెకు నిద్దరి మీచిఱునవ్వు
వెదచల్లు కప్పురపు విడెము లాయ ॥ ఇక ॥
తొయ్యలికిఁ జేసన్నఁ దోరణపుఁజిగు రాయ
యెయ్యెడఁ దొయ్యలిమోహ మీడుదో డాయ
యియ్యెడ నాయెద మీయిద్దరి సరసములు
కయ్యములులేని కంకణదారా లాయ ॥ ఇక ॥
నెలఁతకు నీమోవి నిచ్చ కొత్తవిందులాయ
పొలఁతిమోవి నీకు బువ్వము లాయ
యెలమి శ్రీ వెంకటేశ యిద్దరి మీకూటములు
కలకాలమును మీకుఁ గాణాచు లాయ. ॥ ఇక ॥ 24

255-వ రేకు శంకరాభరణం

మానవుగా మమ్ము నేల మగనాలిఁ జెనకేవు
కానీ కానీలే యింకాఁ జాలదా ॥ పల్లవి ॥
దక్కెఁ నీకుఁ జాలదా తగు రుకుమిణి నీవు
వెక్కసాన లూటిసేసి వేసుకొన్నది
మొక్కల మది చాలదా మున్ను త్రిపురాంగనలఁ
జిక్కించి చీఁకటితప్పు సేసినది ॥ మాన ॥
చెల్లె నదె చాలదా చేకొని రేపల్లె నీవు
గొల్లెతల మానములు కొల్లగొన్నది
అల్లది చాలదా నరకాసురుఁడు దెచ్చుకొన్న
పెల్లగు కామినులనుఁ బెండ్లాడినది ॥ మాన ॥

అంత నీకుఁ జాలదా అల పూవులవారింటి
కాంత నీవు వొడికిన కల్లతనము
చెంతలఁ గూడితి నన్ను శ్రీ వెంకటేశ నీవు
మంతు కెక్కితిఁ జాలదా మన్నించినది. ॥ మాన ॥ 25

సామంతం

వెలుపించఁ బోయి మరి వెలుచినట్టయ్యీఁ జుమ్మీ
నెటి నాతోడి యలుక నీతిగాదు సుమ్మీ ॥ పల్లవి ॥
మోనముతో నుండే వేమె ముదిత నీమాట లెల్ల
నాని నాని మొలచీఁ గనక లోలోనె
ఆనకమై నవ్వ వేమె అంగన నీనగవులు
పూని నీకుత్తికెలోన వుక్కిపోవుఁ జుమ్మీ ॥ వెలు ॥
ధీరతఁ జూడ వదేమె తెరవ నీకనుచూపు
కేరి యిమ్ముచాలక కిక్కిరిసీఁ జుమ్మీ
మారుమోమయ్యే వదేమె మగువ నీమోము కళలు
పేరడై వొక్కచోటనె పెంటలయ్యీఁ జుమ్మీ ॥ వెలు ॥
వుసురనే వప్పుడేమె వువిద నాకాఁగిటిలో
వుసురు నీచనుఁగొండ లోడీఁ జుమ్మీ
నసల శ్రీ వెంకటేశుఁడ నారతిమై మఱచేవు
కసుగాపై నీమోవి గంటివడుఁ జుమ్మీ. ॥ వెలు ॥ 26

మంగళకౌశిక

మనసుకు మనసే మర్మము గాక
వినికివలెఁ డనకు విన్నవించఁ గలనా ॥ పల్లవి ॥
తలుపులో తమకము తానె యెరఁగఁ డట
యెలమిఁ దన్నుఁ గొసర నేలె నాకూ
కలిమిఁ జంద్రునిరాక కలువపువ్వులకును
తెలిపిరా యెవ్వరైన దినదినమునకు ॥ మన ॥

తప్పక వరు సెరిఁగి తానె విచ్చేయఁ డట
యిప్పుడు విలువ నంప నేలె నాకూ
పుప్పతిల్లుఁ గోవిలకు నొగి వసంతకాలము
చెప్పుదురా యెవ్వరైనఁ జెలఁగి యేఁటేఁటను ॥ మన ॥

దగ్గరి వచ్చినవాఁడు తానె యెరుఁగుఁ గాక
యెగ్గు సిగ్గు లిటు దీర్ప నేలె నాకు
అగ్గమై శ్రీవెంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
నిగ్గు నిలువుకు నీడ నేర్పిరా యితరులు. ॥ మన ॥ 27

వరాళి

ఏల నన్ను నేర మెంచే వింత కున్నదా
చాలు నో విభుఁడ నీతోఁ జలము నా కున్నదా ॥ పల్లవి ॥

గద్దరి నా మొకము నాకన్నులకె పాటి గాక
సుద్దుల నీచూపు చల్లఁ జో టున్నదా
బద్దమై నావదనము పాటలకె కొద్దిగాక
యిద్దివో నాతో మాట కెడ మున్నదా ॥ ఏల ॥

కొనబు నాచేతులు నాకొప్పు వెట్టనె కాక
వొనరి నీకై దండ కోపి కున్నదా
పెనఁగు నాపాదములు పిరుఁదు మోవనె కాక
ననిఖి నీవొద్దికి రా నడ పున్నదా ॥ ఏల ॥

సరి నాపురము నాకుచాలకె తావు గాక
సరవి నీకాఁగిటికి సం దున్నదా
కరఁగి కూడితి శ్రీవెంకటపతినె నిన్ను
యిరవైన నీకు నాకు నెర వున్నదా. ॥ ఏల ॥ 28

హిజ్జిజి

ఘనుఁడవు తెగి కొంకఁగ నేల
ననిచిన కొలఁదుల నదపవు గాక ॥ పల్లవి ॥

చూచీఁ జూడని చూపులు నీకె
లోచూపై మదిలో నాటె
కాచిన మాకులు కమ్మరఁ దమకే
మోచిన కొలఁదుల మోపైనట్లూ ॥ ఘను ॥

ఆడియు నాడని అరమాటలె నీ
కాడనె చిరునగవై వెడలె
గాడపుటింటికి కట్టలు గట్టిన
వేడుక నలుగుల వెళ్లినయట్లూ ॥ ఘను ॥

చిందియుఁ జిందని సిగ్గులు నీకే
విందుల కాఁగిట వెగటాయ
యిందునె శ్రీవెంకటేశుఁడ నీ నా
గొందుల చెనకులు గుఱుతయినట్లూ. ॥ ఘను ॥ 29

వరాళి

ఇంతటిది గావలదా యింతి యైతేను
కాంతునిఁ గళ లంటి కరఁగించె నిపుడు ॥ పల్లవి ॥

అలిగి వచ్చినపతి నలమి కాఁగిట నెత్తి
పలుకుల వినయాలు పచరించఁగా
సొలసి కోపాన నాఁటఁ జూచె విభుఁ డంతలోనె
చెలియ చెమట గోరఁ జిమ్మెఁబో చిన్నులనూ ॥ ఇంత ॥

మక్కువ మంకులతోడ మాటలాడకున్న పతి
చెక్కు నొక్కి జలజాక్షి సేద దేర్చఁగా
వెక్కసము లాడెటి విభుని వదనమున
పుక్కిటి తమ్ములమిడి పొలిఁతి వాలించెనే ॥ ఇంత ॥

పంతపు శ్రీవెంకటేశుఁ బడఁతి వొయ్యనె చేరి
అంతరంగ మెల్ల దేర్చి యాదరించఁగా
రంతుతో రతుల నిబ్బరము చూపె నాతఁడును
మంతనానఁ జొక్కించి మఱపించె మేనూ. ॥ ఇంత ॥ 30

256-వ రేకు ముఖారి

ఇంక నేల ఆ సుద్దులు యేరా నీవు
కొంకుతా నేఁ గొసరితే కూళతనము రాదా ॥ పల్లవి ॥

కానరాదా నీ గుణాలు కడు నీ మైకాఁక లందె
మానక యప్పటినె మాటాడేఁ గాక
మోనపుగుట్టు విడిచి ముసిముసి నవ్వు నీపై
నానఁబెట్టి చల్లితేను నగుఁబాటు గాదా ॥ ఇంక ॥

తెలియరాదా నీ మోహము తెల్లవారి వచ్చినందె
అలుగలేక నీచే విడె మందితిఁ గాక
నిలువుకు నిలువున నీ మోహము చూచి నేను
బలిమి నేసి పెనఁగితేఁ బసురువేయదా ॥ ఇంక ॥

యిరవు గాదా నీపంతము యిప్పుడు నన్నుఁ గూడినందె
పొరసి నిన్ను బట్టువలెఁ బొగడఁ గాక
అరిది శ్రీవెంకటపతి ఆయము లంటితినిన్ను
యెరవుగా నిన్నేమనిన యెచ్చు కుందు గాదా. ॥ ఇంక ॥ 31

సాళంగం

నేఁ దన్నుఁ గైకోని నేర మిందేదే
యీదెసఁ దనమంచ మెక్క నైతినా ॥ పల్లవి ॥

అలుకేదె జంకేదె ఆకెయింటనుండ నన్ను
సొలసి చూచిన మారుచూడనా నేను
యెలమిఁ గోప మిందేటి దిద్దరు ముచ్చటలాడ
వెలినుండి యిన్నియును విననైతి నటవే ॥ నేఁద ॥

కుచ్చితపు సణఁ గేది గొణఁ గేది నాయందు
నచ్చుఁ దనమోవి చూచి నవ్వ నైతినా
కెచ్చురేఁగి కపటాలు గిపటాల కేది యెడ
రచ్చఁ దనసేఁత లెల్ల మెచ్చ నైతినా ॥ నేఁద ॥

వేస లేది వోస లేది వింతచెలి విడిపించి
గోస నాసచేసి తన్నుఁ గూడనా నేను
లాసిన శ్రీవెంకటేశు లాగు లెల్లఁ గనుఁగొని
యీసడముదీర వుర మెక్కనైతినా. ॥ నేఁద ॥ 32

కాంబోది

ఆయ నాయఁ బోయఁ బోయ నల్లనాఁడె నీ
చాయల సన్నల పొందు చాలునయ్యా ॥ పల్లవి ॥
వెన్నెలలు వేఁ డె (డ?) నుచు విసరించుకొనె నాపై
కన్నుల నవ్వులు చల్లి కాఁక రేఁచేవు
పన్ని వురిసిన యంనుపై నుడుకు చల్లినట్లు
యెన్న మాతో మేకు సేసే విఁక నేలయ్యా ॥ ఆయ ॥
పాయము వేఁగని యిట్టె బదలివుండె నాపై
నీ యడమాటమూట లేల యెత్తేవు
చాయల వేయిటిమీఁద జవ్వాదికొమ్మ్మరీతి
ఆయములు సోకించే వవునయ్యా ॥ ఆయ ॥
సరసాలు వాఁడె (డ?) నుచు సారెకు మొక్కె నసుచు
మురిపెము (పు?) గో రేల మోపే వయ్యా
గరిమ శ్రీవెంకటేశ కరుణించి మెచ్చినట్టు
కరఁగి కూడితి నన్నుఁ గత లేలయ్యా. ॥ ఆయ ॥ 33

సాళంగం

ఇంతుల నెంత దూరునో యింత కపుదె
యిఁతట రాపమ్మ మెచ్చు నింత కపుదె ॥ పల్లవి ॥
యిదె వచ్చి నదెవచ్చి నింతి యని యాసాస
నెదురుచూచుఁ బతి నింత కపుదె
వెదపీడనితురుము విడువ ముడువఁ బట్టె
హృదయ మేమౌనో పతి కింత కపుదె ॥ ఇంతు ॥

పొంది యెవ్వరు ముందరఁ బొలసిన నీవె యని
　యెందు నిన్నె పేరుకొను నింత కపుడె
　ముందు నీపయ్యెదకొంగు మూయఁ దియ్యనె పట్టె
　యెందరి నంపునో పైపై నింత కపుడె ॥ ఇంతు ॥
నిన్నుఁ దలఁచి తలఁచి నిద్దిరించి కలలోన
　యెన్నఁగఁ గాఁగిటఁ గూడు నింత కపుడె
　పన్నిన శ్రీవెంకటేశుఁ బైకొని కూడితి విట్టె
　యిన్నాళ్లిటులఁ గాదు యింత కపుడె. ॥ ఇంతు ॥ 34

## ముఖారి

ఔనో కాదో నీ వాన తీవయ్య
　పూని వేరొకటి యిఁకఁ బోలదయ్యా ॥ పల్లవి ॥
చంచలము నాచూపు చంచలము నీగుణము
　యెంచె నీ వే మనేవౌ యెరఁగమయ్య
　మించి నా గుబ్బలు రాయి మొగి నీ గుండె రాయి
　అంచల నాకడ నేమి యాడుకొనేవయ్యా ॥ ఔనో ॥
చిగురు నా యధరము చిగురు నీ చిత్త మదె
　తగెఁ దగ దంను కేమి తలవయ్య
　నగవు నా మోమెల్ల నగుఁబాటు నీచింత యీ
　తగవు చెలులతోడ తరిఁ జెప్పవయ్యా ॥ ఔనో ॥
లేఁత నాకుఁ గొనగోరు లేఁత నీవయసు గడు
　యీఁతలు మోఁతలు నిఁక నేలయ్యా
　ఘాతల శ్రీవెంకటేశ కదిసి కూడితి నన్ను
　యీతల నిద్దరిభావాలేక మాయనయ్యా. ॥ ఔనో ॥ 35

## మధ్యమావతి

ఆయము లంటే యారచికత యిది
　చాయల సన్నకు చలి యిఁక నేదయ్యా ॥ పల్లవి ॥

మూయక మూసిన ముత్యపుమొగడలు
మోయక మోచే మొదలేదే
పూయక పూచిన పున్నమవెన్నెల
పాయక కాసే బయ లేదయ్యా ॥ అయ ॥

పుట్టక పుట్టిన పొది జక్కవ లవి
మెట్టక మెట్టే మేరేదే
పెట్టక పెట్టిన పెనుమేఘమునకుఁ
బట్టిన చోటను బలు వేదయ్యా ॥ అయ ॥

పారక పారిన బలుతీఁగెలకును
ఆరితేర నిఁక నరుదేదే
యీరీతి శ్రీవెంకటేశుఁడ నే నిన్నుఁ
గోరి కూడితిని కొద యేదయ్యా. ॥ అయ ॥ 36

257-వ రేకు హిజ్జిజి

జలములఁ బాసిన జలజాప్తునిచే
జలజము నొగిలిన చందంబాయ ॥ పల్లవి ॥

చక్కని యీపతి సతిఁ బెడఁబాసిన
వెక్కసపు మనసే వేఁడాయ
చెక్కు చేతితోఁ జింత్తించిన నది
అక్కట మదనుని యచిదంబాయ ॥ జల ॥

రమణి పతికడకు రాక నిలిచినా
తమి నిట్టూర్పులు దగులాయ
తమకంబున సతి దలపోయంగా
భ్రమసి చూచురెప్పలు నొప్పాయ ॥ జల ॥

యింతలో నిద్దరి కెడ మాటాడఁగ
అంతట వీనుల కాసాయ
యింతయు శ్రీవెంకటేశ్వరుఁ గూడఁగ
యింతేసి యిందాఁక నేమేమోఆయ. ॥ జల ॥ 37

దేసాళం

ఏడ కేడ యెంచి చూచి యెఱఁగవటే
కూడునా కపటములు (లు?) కూటము లెందైనను ॥ పల్లవి ॥

మోమువంపుఁ గోప మేడ ముసిముసి నవ్వు లేడ
యేమే యెండలు వెన్నెల లెనయునటే
దోమటి వొట్లివి యా(యే?)డ తొంగిచూపు లివి యా(యే?)డ
సామై నల్లవేఁడియునుఁ జలువయుఁ గూడునా ॥ ఏడ ॥

అంటితేఁ బెనఁగు లేడ అందులోఁ గొంకు లేడ
జంటఁ గారములు దీపుఁ జవు లౌనటే
బంటు బంటు పంత మేడ బాస లెచ్చరించ నేల
వొంటిఁ జీఁకటి వెలుఁగు వుండునా యెందైనను ॥ ఏడ ॥

అవ్వలయి వుండ నేల అద్దములో సన్న లేల
దవ్వులఁ జేరువ లౌక తారుకాణటే
రవ్వల శ్రీవెంకటాద్రిరమణుఁడనె నిన్ను
యివ్వలఁ గూడితి నింక నెర వౌనటే. ॥ ఏడ ॥ 38

వరాళి

నీట ముంచు పాల ముంచు నీచిత్త మిఁకను
యీటగు నీపతిభావ మిది గలది ॥ పల్లవి ॥

తప్పక చూచుఁ జూచు తలవంచు నంతలోనె
వుప్పతిల్లఁ బులకించు నుస్సు రనును
కప్పురగంధి నీవుఁ గదిసి కూడిన కాఁక
చెప్పరాదు విరహము చెంతల నీపతికి ॥ నీట ॥

చిన్నఁబోవు నంతలోనె చెలులపైఁ గోపగించు
కన్నుచో వెదకు మేనఁ గప్పు కప్పును
కన్నెరో విభుఁడు నీవు కళ లంటినదాఁక
మిన్నక చింతాజలధి మీరరాదో యమ్మ ॥ నీట ॥

బుద్ధు లెంచుకొను లోలో పోసరించి కల్లపడు
అద్దివో శ్రీవెంకటేశుఁ డాడ నాడనె
వొద్దికై నీ విటువలె వొనగూడి వుండుదాఁక
చద్దికి వేఁడికి వెదచల్లు లాయ వలపు. ॥ నీట ॥ 39

రామక్రియ

నీవు బడలితివి నేనుఁ జూచి బడలితి
కావించి నన్ను మరి కలసేవు గాని ॥ పల్లవి ॥

చెదరెఁ గస్తూరిబొట్టు చేత దిద్దుకొనవయ్య
అదన నిట్టూరుపులు ఆఁపవయ్య
వదలె తురుముగొంత వడిఁ జక్కఁ బెట్టవయ్య
పదరి వెనక మాతో బాససేతు గాని ॥ నీవు ॥

కడుఁ బులకించె మేను కప్పవయ్య పచ్చడాన
జడిసీఁ జెమటలు విసరుకోవయ్య
చిడియుఁ గెంపులమోవి చేత మూసుకొనవయ్య
నిడివి నిజము మాతో నెరపేవు గాని ॥ నీవు ॥

గందపుబేఁట్లు రాలీ కాఁగిలించుకొనవయ్య
విందుల పొందుల శ్రీవెంకటేశుఁడ
కందువ నాకూట మిది కడదంటా భ్రమసితి
పొందితి విప్పుడు యింకాఁ బొదిగేవు గాని. ॥ నీవు ॥ 40

సామంతం

ఉదయించె నతఁడు నీ వుదయించ వేలయ్య
మదిరాక్షిఁ గూడి యిట్టె మన్నించవయ్యా ॥ పల్లవి ॥

జలజబంధుఁ డతఁడు జలజాక్షివదనపు
జలజబాంధవుఁడవు సరస నీవు
అలరి నాకాశమందె యతనికి విహరించఁ
గలికి నడిమియాకస మిదె నీకు ॥ ఉద ॥

చీఁకటివైరి యతఁడు చెలియమనసులోని
చీఁకటివైరివి నీవు చేచేతనే
అఁక జక్కవలఁ గూర్చు నతఁడు నీ వీడ నైతె
కాఁక చనుజక్కవలఁ గలపఁగ వలదా ॥ ఉద ॥
దినరా జతఁడు భూమిఁ దెరవపాలికి నీవు
దినదినరాజవు తేజమునను
ఘనుఁడ శ్రీవెంకటేశ కాంతఁ గూడితివి నేఁడు
గనియై యాతఁడు సూర్యకాంతమునఁ గూడెను. ॥ ఉద ॥ 41

సామంతం

పూవక పూచిన వెల్లాఁ బూఁపలయ్యీనా
చేవదేర దగ్గరక చింత లెల్లఁ దీరునా ॥ పల్లవి ॥
రేపు నవ్వుదువుగాని రేయి నాకొం గంటకురా
దాపుల సరసములఁ దని వయ్యీనా
తీపునీరువట్టుగొంటె తేటనేయి మందవునా
పైపైఁ గలయక యీపచ్చిచేఁత లేలరా ॥ పూవ ॥
యిచ్చక మాడుదుగాని యియ్యకొంటిఁ బో పోరా
గచ్చుల వినయములు గాకమానీనా
మచ్చిక నాఁకలివేళ మంచి విరు లింపవునా
హెచ్చినరతులఁ గాక యింతవల్ల నేమిరా ॥ పూవ ॥
అవ్వల మొక్కుదుగాని అంతేసి నేయకురా
రవ్వ నిన్నుఁ జేయక నా రాఁపు వాసీనా
యివ్వల శ్రీవెంకటేశ యింతలోఁ గూడితి నన్ను
దవ్వులే చేరువ లాయఁ దలపోఁత లేలరా. ॥ పూవ ॥ 42

258-వ రేకు సామంతం

ఎందు కెందుఁ బోలిచేవె యింతి వోరి
అందుకె కాదా నీయధియాసలు ॥ పల్లవి ॥

పాదమున నే నిట్టె బయలుచిమ్మిన నీవు
వాదుకు వచ్చే వేమె వనితా
యీదెస నెంచి చూచితె నిటువంటి బయలె నా
గాదిలి నడు మవుత కానవా నీవు ॥ ఎందు ॥

దాపునఁ దామరమీఁదఁ దమ్ముల ముమిసితేను
కోపగించుకొనే వేమె కోమలి
పో పో ఆతామరనెపోలిన నా నెమ్మోము
చూపులు గలుగు నన్నుఁ జూడవా నీవు ॥ ఎందు ॥

అద్దము మెరుఁగు వెట్టేనని గోర నంటితేను
గద్దించే విది యేమే కలికి
నిద్దపు శ్రీవెంకటేశ నీవు నన్నుఁ గూడితివి
అద్దపు నాచెక్కు లిప్పుడవి చూచెఱఁగవా. ॥ ఎందు ॥ 43

శుద్ధవసంతం

నే సతము గాక నీకు నీవు నేనుఁ గలదాఁక
యీసులేని పిభుఁడ నీకివి సతమా ॥ పల్లవి ॥

మంతనపు నీ వొట్లు మాట నే నాడినదాఁకా
చింతల నీ సిగ్గు వొంటిఁ జిక్కినదాఁకా
పంతపు నీబిగువు నేఁ బచ్చి నేసినదాఁకా
అంతటి మీఁదట నీకు నవి సతమా ॥ నేస ॥

అలుకలుఁ జలములు ఆయము లంటినదాఁకా
బలిమి సరసము నేఁ బైకొనుదాఁకా
తలఁపు నీగుట్టు నేఁ దప్పక చూచినదాఁకా
అలరి యంతటిమీఁద నవి సతమా ॥ నేస ॥

కన్నుల నీమొక్కులు నేఁ గాఁగిలించినదాఁకా
మిన్నక రతులు నే మెచ్చినదాఁకా
యెన్నఁగల శ్రీవెంకటేశ నిన్నుఁ గూడితినే
అన్నులకడలపొంచు లవి సతమా. ॥ నేస ॥ 44

ముఖారి

ఇందు నందునె యింతిపోలికలు
విందుల విభునికి వేడుకలాయ ॥ పల్లవి ॥

వెడఁగుఁ దీగెలను విరులపరిమళము
పడఁతిమాటలనుఁ బరిమళము
బడిఁ గనకమునకుఁ బదారువన్నెలు
సుడిగొని వనితకు షోడశకళలు ॥ ఇందు ॥

కులికి సురతరువుకొమ్మనఁ బూఁపలు
పొలఁతికుచంబునఁ బూఁపలు
వెలయు వసంతపువేళనె చిగురులు
చెలిపాదములను చేఁగ చిగురులు ॥ ఇందు ॥

పొంత జలనిధులఁ బొడమెఁ దామెరలు
కాంతకరములె కమలములు
యింతట శ్రీవెంకటేశుఁడు గూడఁగ
కాంతరతుల కివి కదంబమాయ. ॥ ఇందు ॥ 45

లలిత

విచ్చేయవయ్య నీవు వేగమె యింతటనైన
తచ్చి యిన్నియును సరిదాఁకెఁ గదవయ్యా ॥ పల్లవి ॥

యింతిమనోరథములు యెంచరాదు పంచరాదు
కాంతుఁడ నీకురులు లెక్కకు రానట్టు
పొంత నాకె తలపోఁతఁ బుట్టినవిరహములు
వింతగా నీశిరసున వెళ్లెఁ గదవయ్యా ॥ విచ్చే ॥

చెలి చింతాలత లివి చిక్కులాయ జీర లాయ
కెలన నీరేకలు మైఁ గెరలినట్టు
అలరి యాకె మదనానలపుఁబొగ లెల్లాను
కులికి నీమేనఁ జుట్టుకొనెఁ గదవయ్యా ॥ విచ్చే ॥

సతికరములు నీసమరతులఁ బెనఁగె
రతి నీచూపులు మేన రాసైనట్టు
యితవై శ్రీవేంకటేశ యిన్నిటా మీయిద్దరికి
సతమైన వలపులు జట్లాయ నయ్యా. ॥ విచ్చే ॥ 46

శంకరాభరణం

నిన్ననె పెండ్లి నాకు నేఁడు నీకు
తన్నుఁ దానె సమకూడె దైవము మెచ్చితిరా ॥ పల్లవి ॥
మిక్కిలి మోహము నాకు మేఁటి రాజసము నీకు
నిక్కి చూపు లెల్ల నాకు నిండుఁ బరాకు నీకు
మొక్కల మాటలు నాకు మోనపుగుట్లు నీకు
తక్కక సేసినయట్టి దైవము మెచ్చితిరా ॥ నిన్న ॥
విరహపుఁగాఁక నాకు వెన్నెల నవ్వులు నీకు
సరసపుఁ దమి నాకు జంపులు నీకు
పెరిగె యాసలు నాకు బీరపు బిగువు నీకు
దరియై గడించినట్టి దైవము మెచ్చితిరా ॥ నిన్న ॥
బిగువుఁగాఁగిలి నాకు పెనుఁజెమటలు నీకు
జిగిమోవిఁ దేనె నాకు జీరలు నీకు
పగటు శ్రీవేంకటేశ పైపయిఁ గూడితి మిట్టె
తగుఁ దగు నిన్నిటికి దైవము మెచ్చితిరా. ॥ నిన్న ॥ 47

బౌళిరామక్రియ

ఏమాట కేమాఁట యెంత కెంతరా
యీమాటె యాడవె నీ వింకా నొకమారు ॥ పల్లవి ॥
అంటఁగాక వున్నదాన నట్టెవుండరా
అంటెనె నీ చూపులు నన్నంతక తొల్లె
అంటువాయఁ జెమట నీరాడవా నీవు చి
ట్టంటు నీచేఁతలు నామై నంటవలదా ॥ ఏమా ॥

తలపట్టుతో నుందాన దగ్గరకురా నా
తలఁ పట్టె నీ మీఁదఁ దగు లాయనే
తలపోఁత పేరు నీమైఁ దలకొనదా
తలపడి మేను మేనుఁ దడఁబడవలదా ॥ ఏమా ॥

కన్నుల నిద్దుర వచ్చీఁ గాఁగి లేలరా నీ
కన్నుల సన్నలె కావా కందువ చెప్పె
నన్ను నిట్టె శ్రీవెంకటనాథ కూడితి
కన్నెరొ యిట్టె రతులఁ గరగించవలదా. ॥ ఏమా ॥ 48

259-వ రేకు ముఖారి

విభునికి నీమాటె విన్నవించరా
సభల దూరపుపేర్లు జలధులఁ గూడవా ॥ పల్లవి ॥

దవ్వులనుండితేనె దగ్గరి వుండుట గాదా
దవ్వులనుండిన తన్నుఁ దలఁచఁ గదే
దవ్వుగాదా సూర్యునికి ధరణిఁ దామరలకు
దవ్వుల పొందులె కడుఁ దగులము లాయనే ॥ విభు ॥

ఆకడి మో మైతేనె యీకడి మో మౌత గాదా
ఆకడఁ దనదిక్కు మో మైతినేఁ గదే
ఆకసపు మొయి లేడ అడవినెమలి యాడ
దాకొని వింతగుచూపు తరితీపు దానే ॥ విభు ॥

ఆసమాట లాడితేనె అందకు వచ్చుట గాదా
వాసి నేఁ దనకడకు వచ్చితిఁ గదే
యీసులేక శ్రీ వెంకటేశుఁ డేడ నే నేడ
వేసరక కూడితిమి వింత లెల్లఁ జేరెనే. ॥ విభు ॥ 49

లలిత

ఇందు కేమె అందు కేమె యింతలోనె య(యె?)రవౌనా
అందపుఁ జుట్టాల మౌత అందరు నెరఁగరా ॥ పల్లవి ॥

వొద్దనుండవలెనా వొక్కటై తాను నేను
యిద్దరము నున్న నేల యేకమె కాదా
సుద్దముగ మోము మోముఁ జూడవలెనా యెదుట
కొద్దిచంద్రునందు రెండు గూడవా మాచూపులు ॥ ఇందు ॥

మాటలాడవలెనా నామాటలుఁ దనమాటలు
గాఁటపు ఆకసమందుఁ గలసీఁ గదె
చోట నిట్టె మేను మేను సోఁకవలెనా తన్ను
నాఁటి సోఁకినట్టి గాలె నన్ను సోఁకీఁ గదవే ॥ ఇందు ॥

కలయఁగవలెనా కందువ మామనసులు
గలపిన చిత్తజుఁ డొక్కఁడె కదె
యెలమి శ్రీవెంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
పలుకుఁ బంతము నొక్కపాటాయఁ గదవే. ॥ ఇందు ॥ 50

ముఖారి

ఓపో అదేమోయి వో బావ యింక
వోపనంటేఁ బోవునటె వో వో మరఁదలా ॥ పల్లవి ॥

వొరసే వదేమోయి వో బావ ని (న?) న్ను
వొరసీఁ బో నీకుచాలె వో మరఁదల
వొరకు నెత్తుకు సరి వో బావ నీవె
వొర తొమ్మిది చాఁచేవో వో మరఁదలా ॥ ఓపో ॥

వొగరులాడే వోయి వో బావ నీకు
వొగరు మోవిచిగురు వో మరఁదల
వొగరుఁ జిగురె చేఁగ వో బావ అదె
వొగిఁ బిసికితేఁ బసురో వో మరఁదలా ॥ ఓపో ॥

వొంటి దగ్గరే వోయి వో బావ నాకు
నొంటి గాదు నీ వుండఁగ నో మరఁదల
గొంటవై శ్రీవెంకటాద్రిఁ గూడితి బావ మన
కొంటి నేల ఆమాఁటలో వో మరఁదలా. ॥ ఓపో ॥ 51

హిందోళం

ఎంచ నిన్నిటికి లోనయితిఁగా నేను
అంచెలఁ దలఁచుకొంటె నరుదయ్యీ నాకు ॥ పల్లవి ॥

రేసు వెన్నెల య(యె?)ండ కోరిచెఁగా నాతనువు
ఆసల నా ప్రాణవిభుఁ డాతనిఁ బాసి
వోసరి నిట్టూర్పుగాలి కోపెఁగా నామనసు
గాసిలి యీతని తమకపువేళను ॥ ఎంచ ॥

విరహానలము చొచ్చి వెళ్ళెఁగా నామనసు
సరుగనఁ బతితోను సారె నలిగి
పొరిఁ గన్నీటివఱదఁ బోక వచ్చెఁగా నాచూపు
గిరవై చింతల మునిఁగినవేళను ॥ ఎంచ ॥

వుమ్మల మోనానఁ బతికుండెఁగా నా నగవు
అమ్మరో యీతఁడు మాటలాడినదాఁకా
నెమ్మిఁ బరవశములో నిలిచెఁగా నామునము
కమ్మర శ్రీ వెంకటేశుకాఁగిట యీవేళను. ॥ఎంచ॥ 52

వరాళి

ఏమౌత నెఱఁగ నీ వేమనేవె
నీ మన సొక్కటాయ నీవే నేనూ ॥ పల్లవి ॥

కొప్పు గడు వెడ జారె గుణము తేటలు దేరె
యిప్పుడు చెలియ నాతో నేమనేవె
రెప్పల ముత్యాలు గారె కప్పి చెక్కు చేయి చేరె
చెప్పినబుద్ధులు విం(టె?)టిఁ జీఁకటె వెలుఁగు ॥ ఏమౌ ॥

నిలువురాఁకలఁ గాఁగె నిట్టూర్పు గడు రేఁగె
యెలుఁగెత్తి నీవు నాతో నేమనేవె
వలపులు దల కెక్కె వాఁడి కుచముల కెక్కె
చెలియ నీ పూఁకొంటి(టె?) చేవె చిగురు ॥ ఏమౌ ॥

చెదరి పయ్యెదజారె సిగ్గులు సెలవిఁ గారె
యెదు రెదురనె చెలి యేమనేవె
యిదివో శ్రీ వెంకటేశుఁ డిటువచ్చి నన్నుఁ గూడె
సదమదమైతి రతిచలమె ఫలము. ॥ ఏమో ॥ 53

ఆహిరి

ఏల జోలిఁ బెట్టినే నిన్నిందాఁకాను
వోలి నీ కెదురు చూచుచున్నాఁడ నేను ॥ పల్లవి ॥

యేమినేసీనె చెలి యింతి నీ వేఁగెటివేళ
యేమె నీరాక కెదు రేతెంచెనా
ఆమాటలెల్ల నీవు ఆకె కెఱఁగించితివా
యేమని చెప్పుమనెనె యెడమాట నాకు ॥ ఏల ॥

జాణె నావుంగరము ఆకె వేల నున్నదా
మానిని నామేలు నీతో మది నెంచునా
తాను వచ్చే ననునో యీతరి నన్ను రమ్మనునో
పూని తన వ్రాలాకు పుత్తెంచెనా ॥ ఏల ॥

సతిమాఁట కింటివారు సమ్మతించి వుందురా
అతివ నీ మఱఁగున నది యెవ్వరె
యితవైన శ్రీ వెంకటేశుఁడ నైనందుకును
సతి నన్నుఁ గూడినదె సఫలము లాయ. ॥ఏల॥ 54

260-వ రేకు భూపాలం

నిండు సోబనము నేఁడు నెయ్యపు దంపతులకు
మెండుగ నారతులెత్తి మీఁద సేసచల్లరే ॥ పల్లవి ॥

కట్టుఁడు కలువడాలు ఘనమైన తోరణాలు
గట్టిగాఁ బట్టణము సింగారించరే
కిట్టి రుక్మిణీదేవిఁ గృష్ణుఁడు పెండ్లాడి వచ్చె
పెట్టుఁ డిందరికి నేఁడు పెండ్లి విడేలు ॥ నిండు ॥

పాడరె సోబనాలు పైపైనె పేరఁటాండ్లు
యీ డా డనక వీధు లేఁగించరే
జాడతో వాయించరె పంచమహావాయిద్యాలు
యీడనె పెండ్లికట్నా లియ్యరె యిద్దరికి ॥ నిండు ॥
పొత్తుల విందులు దెచ్చి బువ్వమున నిడరే
హత్తి గంధాక్షత లీరె అందరు నేఁడు
నిత్తెమై శ్రీ వెంకటాద్రి నిలయుఁ డీ కృష్ణుఁడు
తత్తరాన నీకెఁ గూడె దగ్గరి సేవించరే. ॥ నిండు ॥ 55

రామక్రియ

ఇంతట నిట్టె విచ్చేసి యింతిఁ గూడితేఁ గనక
వంతుకు నిన్ను జాణదేవర వనవచ్చును ॥ పల్లవి ॥
తనలోనె తలపోసి తప్పక చూచేవేళ
వనితను దేవగన్య యనవచ్చును
పనివి నిన్నుఁ దలఁచి పాటలు వాదేవేళ
అనుగు గంధర్వకాంత యనవచ్చును ॥ ఇంత ॥
చలపట్టి విరహాన జలకేళి సేయువేళ
అలివేణి నాగకన్య యనవచ్చును
చలువకుఁ జంద్రకాంతశిలపైఁ బొరలువేళ
అలరిన చంద్రకన్య యనవచ్చును ॥ ఇంత ॥
శ్రీ వెంకటేశ నీవు చెలియఁ గూడినవేళ
ఆకటించి నిజలక్ష్మి యనవచ్చును
వోవల నీ సొమ్ములలో వురమున మోచువేళ
దేవి యలమేలుమంగ దిష్ట మనవచ్చును. ॥ ఇంత ॥ 56

పాడి

చెఱఁగుమాసినసుద్ది చెప్పఁజాల కుందేవు
యెఱఁగము కైదప్పు లెందు మోచునో ॥ పల్లవి ॥

చెక్కుచేతితో నీవు సిగ్గువడి నవ్వేవు
చొక్కపు విభుఁడు నిన్నుఁ జూచె నంటాను
తక్కక యాతఁడు నిన్ను దగ్గరి పైఁ జెయి వేసి
యిక్కువ లంటినప్పుడు యేమి సేసేవే ॥ చెలి ॥

కాలిమీఁదఁ గాలు వేసి కడుఁ దల వంచేవు
ఆలరి కేలికిని రమ్మనె నంటాను
కోలుముందై యాతఁడె గొబ్బున దగ్గరి వచ్చి
కేలుఁ గేలఁ బెనచితె కిందు పడేవా ॥ చెలి ॥

సరిలేని తమకాన జలకేళి సేసేవు
అరిది శ్రీ వెంకటేశుఁ డంటీ నంటా
గరగరికల నిన్నుఁ గలసె నాతఁ డిట్టె
అరయఁగ నంటుముట్టు లవి దీరెఁ గదవే. ॥ చెలి ॥ 57

ఆహిరి

తరవాతి పసులెల్లఁ దగవాయఁగా
యెరవు సతము సేసీ నే మందునే ॥ పల్లవి ॥

కుప్పలుగాఁ దన్ను దూకి కోపగించె యందులోఁ దా
తప్పు వట్టీ నిది లెస్స తగవాయఁగా
చెప్పనేల రాళ్లుచక్కఁజేసె మలిగం డ్లేరీ
నిప్పు డిట్టె నే నిందు కేమందునే ॥ తర ॥

పూని తన్ను నేర మెంచి బుద్ధి చెప్పె యందులోను
తానూ బుద్ధులు చెప్పీఁ దగవాయఁగా
ఆని కస్తూరి నల్ల నంటెఁ దెలుకపిండి
యీ నెపాన నల్లనంటె నేమందునే ॥ తర ॥

చెమరించీ తొలమని చేతనంటి తోయఁబోతె
తమకానఁ గాఁగిలించీఁ దగవాయఁగా
సమరతి నన్నుఁ గూడె సరి శ్రీ వెంకటపతి
యిమిడె సంతసముల నేమందమే. ॥ తర ॥ 58

శ్రీరాగం

తగుఁ దగు నీకు నాకుఁ దలవయ్యా
తగవు లగవులాయఁ దమకించకువే ॥ పల్లవి ॥

మొఱఁగి కన్నుల నీకు మొక్కేమయ్యా వో
తెఱవ నేఁ గన్నులనె దీవించితినే
వెఱగంది మోవి నీకు విందు చెప్పేఁ బో నిన్ను
జఱసి నే గుక్కిళ్లఁ జివిగొంటిఁ బో ॥ తగు ॥

పెలుచు నా కోరికలఁ బిలిచేనయ్యా నేనుఁ
బలుమారు నాలోనె పలికితినే
మెలఁగి ని న్నొకవేల(ళ?) మెచ్చేనయ్యా
నలువంక సెలవుల నవ్వితి నేను ॥ తగు ॥

పెంపుడుఁగుచాల నిన్నుఁ బెద్దసేసేఁ బో నే
నింపుల రతుల ని న్నెచ్చరించేనే
గుంపెన శ్రీ వెంకటేశ కూడితిమయ్యా నిన్ను
దింపక నా వురమున దిష్టము మోచితినే. ॥ తగు ॥ 59

కాంబోది

చేతనైనపాటి సేవ సేయుదుఁ గాక
ఆత లీతలి పనులు అవి నావశమా ॥ పల్లవి ॥

'గచ్చుల నీ మన సిట్టె కరఁగించఁ గలఁ గాక
నచ్చు నీ చెమట మాన్ప నావశమా
పచ్చిగా నీమోవిమీఁదఁ బల్లు మోపఁగలఁ గాక
లచ్చన గుఱుతు మాన్ప లాగుల నావశమా ॥ చేత ॥

చేరి నీ సిగ్గులు దేరఁ జెయి వేయఁగలఁ గాక
నారుఁ బులకలు మాన్ప నావశమా
సారె నీ మోము నేను చక్కఁ జూడఁగలఁ గాక
యేరా నీనవ్వులు మాన్ప నివి నావశమా ॥ చేత ॥

అంటి నిన్నుఁ గాఁగిటిలో నలయించఁగలఁ గాక
నఁటు నీ నిట్టూర్పు మాన్పనావశమా
జఁటమై శ్రీ వెంకటేశ సరుసఁ గూడితి విట్టి
వెంట రాకు మని మాన్ప విభుఁడ నావశమా. ॥ చేత ॥ 60

261-వ రేకు ముఖారి

దూరలేను పోరలేను దొమ్మి దన్నుఁ జేయలేను
మోరతోపుఁదనముల మోనమెచాలు ॥ పల్లవి ॥

తత్తరించకురె పతి తానె నన్ను వలపించె
చిత్తము వచ్చినయట్టె సేయనీఁగదె
యెత్తినది మీఁదు దనకె మేనుఁ బ్రాయమును
మొత్తమి నా కింకమీఁద మోనమెచాలు ॥ దూర ॥

పిలువకురె మీరు పెండ్లాడె ననుఁ బొల్లె
వలసి నప్పుడు రానీ వరుసకును
పలికితిఁ దనదని ప్రాణమును మానమును
ములువాఁడి చెక్కుచేతి మోనమెచాలు ॥ దూర ॥

కక్కసపెట్టకురె కమ్మరఁ విచ్చేసెఁ దానె
మక్కువ గలుగుపాటి మన్నించనీవె
అక్కున శ్రీ వెంకటేశుఁ డాదరించి నన్నుఁగూడె
మొక్కలాన నాకింక మోనమెచాలు. ॥దూర॥ 61

కేదారగౌళ

ఎరవె సతము చేసె నేఁటికొ కాని
తరుణిసింగార మిది తలపోయరే ॥ పల్లవి ॥

గరిమె మెరుఁగుఁబోఁడిగాన కొప్పు ఘనమాయ
విరులు ముడిచె యి దేవిధమొకాని
సరి సింహమధ్యగాన శైలకుచము లమరె
గరిమఁ బయ్యద నేల కప్పినొ కాని ॥ ఎర ॥

కాంత చంద్రముఖిగాన కలువకన్ను లమరె
చెంతఁ జీఁకటిచూ పేల చిమ్మినొ కాని
బంతి వజ్రదంతి గాన పగడపుమో వమరె
పొంతఁ దమ్మలాన నేల పొదిపీనొ కాని ॥ ఎర ॥

పసిఁడిపతిమగానపదారుగళల మించె
యెసఁగెఁ దెల్లనినవ్వు లేదవొ కాని
కొసరి శ్రీ వెంకటేశుఁ గూడె నింతలోన నీకె
అఁకముదించని ఆస అది యెంతొకాని. ॥ ఎర ॥ 62

ముఖారి

ఇంక నేల వేగిరము యింతలోనిపనికిఁగా
తెంకి నే పానుపుమీఁద దిద్దుకొనేఁ గాని ॥ పల్లవి ॥

అంతనీవు దగ్గరకు ఆయములు సోఁకీని
పంతపు మాటాడకుర పచ్చి రేఁగీని
కొంత నీవు నవ్వకురా గుండె గడు ఝల్లురనీ
మంతనాన నీ పగటు మందలించేఁ గాని ॥ ఇంక ॥

తప్పక చూడకురా తనువెల్లఁ బులకించీ
చిప్పిలఁ బెనఁగకురా చెమరించీని
కప్పకుర పచ్చడము కడు సిగ్గు ముంచీని
చెప్పగల సుద్ది రేయి చెప్పేఁ గాని ॥ ఇంక ॥

బొమ్మల జంకించకురా పోరి నాకు చాలురా నీ
తమ్మ మోవి మోపకురా దప్పి దేరీని
చెమ్మగిలఁ గూడితివి శ్రీ వెంకటేశ నన్ను
సమ్మతించ నీగుణము చలి వాపేఁ గాని. ॥ ఇంక ॥ 63

రామక్రియ

నీకు నీకె తెలుసుకో నీ సుద్దులు
నాకుఁ బొద్దుసేసి నవ్వు నవ్వఁ దగునా ॥ పల్లవి ॥

కూడనన్న మానదు నాగుణ మేమొకాని
    ఆడ నీ చేఁతకు నిన్ను నంటఁ దగునా
    చూడ నన్న మానవు నా చూపు లేమొ కాని
    వాడికె నీ మోముదిక్కై పద్ద నుండఁ దగునా ॥ నీకు ॥

విన నన్న మానవు నా వీనులేమొ కాని
    కొనబు నీ మాఁట లూఁ కొనఁ దగునా
    నినుఁ బేరుకొన నన్న నిలువదు నా నోరు
    పెనఁగి ని న్నీడకుఁ బిలువఁగఁ దగునా ॥ నీకు ॥

సోఁక నన్న మానదు నా సోగ మే నేమొ కాని
    పైకొని నీ పచ్చి మీఁదఁ బచ్చి దగునా
    యీకడ శ్రీ వెంకటేశ యిటు నన్నుఁ గూచితివి
    కాకుగా నిన్నియుఁ దారు కాణించఁ దగునా. ॥ నీకు ॥ 64

ఆహిరి

కదిసిన మిము మెచ్చఁ గలము గాకా
    యెదిటి మీ యలుకలు యివి చూడఁ గలమా ॥ పల్లవి ॥

కన్నుఁ గొనలె వేరు కమ్మఁ జూపు లొకటె
    మిన్నక వుండె మీలో మీ రొకటె
    చిన్నఁబోయి నీ వాడ చెక్కుచేతఁ జెలియీాడ
    వున్నభావ మిది చూచి వోరుచఁగఁ గలమా ॥ కది ॥

వీను లివియె వేరు వినుకలి యొకటె
    ఆనకపు మీ మోహాలవి యొకటె
    పాను(పు)పై నాకె వెలుపల మలగుపై నీవు
    పూని వున్నమీకు నేము బుద్ధి చెప్పఁ గలమా ॥ కది ॥

కడఁగి చేతులె వేరు కాఁగిలిది యొకటె
    యెడసి కూడిన మీరిద్ద రొకటె
    అడరిన శ్రీ వెంకటాధిప మీ యిద్దరిలో
    జడియుఁ బంతములకు సాక్షి చెప్పఁ గలమా. ॥ కది ॥ 65

రామక్రియ

గుట్టుతో లోలో గొణఁగుట గాక
దట్టించి చెలులాల తను ననే దేమె ॥ పల్లవి ॥

ఆకసపుఁ జంద్రునికి నాసపడఁగా నేమి
వాకై రాని పతికి వలవఁగా నేమి
ఆకడ నందనిపంటి కఱ్ఱుచాఁచఁగా నేమి
జోకకురాని పతినిఁ జూడఁగా నేమి ॥ గుట్టు ॥

కొనబువెట్టి చెరకు కొన యేమి మొద లేమి
యెనయని పతిమాట లెన్నైనా నేమి
పొనిగి యంపలిచెట్టు పూచె నేమి కాచె నేమి
ననుచని పతి య(యొ?)ంత నవ్వినా నేమి ॥ గుట్టు ॥

వసంతకాలము దప్పి వంఱు గావఁగా నేమి
కసిగాపై యెలయించి కలయఁగా నేమి
యెసఁగి శ్రీ వెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వసమైన మీఁద నింక వాసు లెంచ నేమి. ॥ గుట్టు ॥ 66

262-వ రేకు ముఖారి

అతివ నీ సింగార మట్టిదెకా అందుమీఁద
పతివిరహము నైతె భావించ వసమా ॥ పల్లవి ॥

తామెరపైఁ దుమ్మిదలు దట్టమై మూఁగుండఁగాను
నేమముగ నది చూచి నీ విభుఁడు
కోమలి నీ విప్పు డిట్టె కుత్తికబంటి జలాన
ఆముక యీఁదులాడే వని తానూ దుమికె ॥ అతి ॥

మించు జక్కవలు తీఁగెమీఁద వాలి వుండఁగాను
అంచెల నీరమణుఁడు అది చూచి
వుంచానఁ బయ్యద జార నొగి విరులు గోసెటి
చంచని తా లేచి వచ్చి సరిఁ గాఁగిలించెను ॥ అతి ॥

నిక్కి మేడలోన నొక్క నెమలి నటించఁ జూచి
అక్కడ శ్రీ వెంకటేశుఁ డది నీ వని
అక్కరతో దగ్గరఁగా నంతలోన నీవు వచ్చి
పక్కనఁ గూడఁగ దనభ్రమల్లెలఁ బాసెను. ॥ అతి ॥ 67

భైరవి

ఆపాటి కాపాటి అందుకేమె
యీపని సరికి సరి యిందు కేమె ॥ పల్లవి ॥
యిదె తన మోవిఁగెంపు లెక్కఁ జూచి నా కన్నుల
కదనఁ గెంపు లెక్క నందు కేమె
చెదరెఁ గురులు దననుదుటిపై నా చిత్త
మెదుటనె చెదరెఁ బో యిందు కేమె ॥ ఆపా ॥
వన్నెలఁ దా ముడిచినవాఁడుఁ బువ్వు లటు చూచి
అన్నువ నా మోము వాడె నందుకేమె
పన్ని చిట్లుగందాల భావము చూచి నా మాట
లిన్నియుఁ జిటులు మనీ నిందు కేమె ॥ ఆపా ॥
సేయఁగల వెల్లఁ జేసి చేరి నన్నుఁ గూడఁగాను
ఆమెడ నేనుఁ గూడితి నందు కేమె
పాయపు శ్రీ వెంకటపతి మేను నామేను
యీయెడ నేకము లాయ నిందు కేమె. ॥ఆపా॥ 68

సామంతం

అప్పటి కప్పటి మాట లంతె చాలు
యిప్పుడు కాలు దాఁకించ నేల మొక్క నేల ॥ పల్లవి ॥
కూరవంది కసవేరె గుణము లోలో నేల
యేరా నిన్నుఁగూడి పాసె యెగపోఁ తేలా
నీరువట్టుగొని యిట్టె నెయ్యైనాఁ దెమ్మన నేల
సారె నీవు రానప్పటి చలిమందు లేలా ॥ అప్ప ॥

జాగరము సేయనేల సరిగా నిద్రించ నేల
వేగి నీ వేఁగినందుకు వెంట రా నేల
యీగతి నడుము చొర నేల కడుగఁగనేల
భోగించి నీకు నేపొద్దు బుద్ధి చెప్ప నేల ॥ అప్ప ॥
ఆకడఁ బంతము లేల అట్టె పందతన మేల
చేకొని గో రంటనేల సిగ్గువడ నేల
మేకుల శ్రీ వెంకటేశ మేలు నన్ను భ్రమయించి
పైకొని కూడితి వింక బా సడుగ నేల. ॥ అప్ప ॥ 69

## శ్రీరాగం

ఒకటి కొకటి యాస నుండఁ జెలిభావ మిది
మొకమెదుటనె నన్ను మోవ వ్రాసెనే ॥ పల్లవి ॥
పొలిఁతికురులు వ్రాయఁబోతేఁ దుమ్మిదలాయ
తలఁగకుండఁగ మోముఁదమ్మి వ్రాసెనే
కలికికన్నులు వ్రాయ గండుమీలై పొడచూపె
చెలపచెమట నీటిచెక్కులు వ్రాసెనే ॥ ఒక ॥
సరిఁ గుచములు వ్రాయ జక్కవలై పొడచూపె
నిరుదెస బాహులత లిటు వ్రాసెనే
గరిమ నడుము వ్రాయఁగా సింహమై తోఁచె
వరుసఁ దొడల యంటివనము వ్రాసెనే ॥ ఒక ॥
కోమలిపాదాలు వ్రాయఁ గూర్మములై పొడచూపె
ఆమని జవ్వనపులోఁ తటు వ్రాసెనే
యీమేర శ్రీ వెంకటేశుఁ డే ననుచుఁ గూడె
రామ యిట్టె యిదివో నా రతి వ్రాసెనే. ॥ ఒక ॥ 70

## సామంతం

ఇచ్చక మాడ నెఱఁగ నేమి సేతునే
హెచ్చిఁ బెంజెమటలు యేమి సేతునే ॥ పల్లవి ॥

చక్కని పతిగుణాలు సారె నాతోఁ జెప్పఁగాను
యెక్కడో వినీ వీను లేమి సేతునే
పెక్కుప నాతఁడు నన్నుఁ బిలువ నంపె ననఁగా
యిక్కడ నా మోము నవ్వీ నిఁక నేమి సేతునే ॥ ఇచ్చ ॥

యిదె మేడపై నతఁడు యిటు నన్నుఁ జూచె నంటే
హృదయము చిల్లులయ్యీ నేమిసేతునే
వదల కాతఁడు నా వాకిటికి వచ్చె నంటే
యెదుటఁ గన్నీ ళ్లూరీ నిఁక నేమి సేతునే ॥ ఇచ్చ ॥

బలిమి నాతఁడు నాపైఁ జెయి వేయఁగాను
యెలమి నిట్టూర్పు రేఁగె నేమి సేతునే
కలసి శ్రీ వెంకటాద్రిఘనుఁడు నన్నుఁ గూడఁగ
యెలఁదీగెమేను వొంగె నేమి సేతునే. ॥ ఇచ్చ ॥ 71

శుద్ధ వసంతం

చాలుఁ జాలు నాతో జాణతనాలా
చాలుకొన్న నీచూపు జళిపించ నేలరా ॥ పల్లవి ॥

పలుకవె చెలియ పచ్చిగా నదె రోరి
పలుకు నీ కప్పురపు బరణి నదె
నిలువవె కొంతవడి నే వచ్చినందాఁక
నిలువు నీ నామమందె నిక్కమాయ నదెరా ॥ చాలు ॥

అడిగేనె యింతి అప్పటి ని న్నొక సుద్ది
అడుగులు నీయందునవె కదరా
ముడికారి సట లేలె ముదితా
ముడి నీ సిరసునఁ గొమ్మడి యిదె కదరా ॥ చాలు ॥

కలసితిఁ గదె నిన్నుఁ గలికి నీవు
కలగంపపతి వౌతఁ గంటిరా నేను
అలరి ని న్నురమున నానితిఁ గదె నిన్ను
నల శ్రీవెంకటగిరి యానెఁ గదరా. ॥ చాలు ॥ 72

263-వ రేకు రామక్రియ

చెల్లెఁ జెల్లె నీవు సేసే చేఁత లెల్లాను నీ
పల్లదా లిన్నియు బండిబాటాయఁ దగవు ॥ పల్లవి ॥

కద్దు గద్దు నీ మాట కల్ల లేదు పొల్ల లేదు
వద్దు వద్దు నీతోడి వాదులు నాకు
ముద్దు ముద్దు సేసి నిన్ను మోవఁ బెంచె మీ తల్లి
పొద్దు వొద్దుఁ గోమటిండ్లపొరుగాయ బదుకు ॥ చెల్లె ॥

ఆయ నాయ నీ మాట లల్లములు బెల్లములు
మాయ మాయ నీకె మూరెఁడు నోరు
తోయఁ దోయఁ దల్లి వెన్నతోడఁ బెట్టె ముచ్చిములు
పోయఁ బోయ గొల్లదొమటాయఁ బో మా పెరుగు ॥ చెల్లె ॥

వింటి వింటి నిన్ననె నీవేసాలబాసలును
కంటిఁ గంటి నిఁక నేల కైకొంటివి
యింట నింట శ్రీ వెంకటేశ పంతమిచ్చి నన్ను
వంటి యంటి నిచ్చకొత్తలాయఁ బో నా మనువు. ॥ చెల్లె ॥ 73

ముఖారి

మానినిభావము చూచి మాకు వెరగాయ నిదే
పూని చూ పోపక నీపైఁ బూవు లెత్తి చల్లెను ॥ పల్లవి ॥

విరడు నీ మై సొమ్ముల నిగ్గు మాణికములలో
అందఁ దననీడ చెలి యన్నిటాఁ జూచి
కొండుక పదారువేలు గోపాంగనలు నీమై
నుండ వా రని తలఁచి వొగిఁ దల వంచెను ॥ మానిని ॥

వన్నెల నీ పచ్చడాన వ్రాసిన కోలాటపు
అన్నువపతిమలను అటు చూచి
మున్ను పురకామినులమోహము మఱవ లేక
పన్నుక వున్నాడ వని పకపక నవ్వెను ॥ మానిని ॥

కూడిన నీ రతిఁ దానె కోరి పెక్కుబంధముల
వేడుకఁ బెనఁగి శ్రీ వెంకటేశుఁడ
పాడి నిన్ని నేరుపులు పచరించితిఁ దా నని
చేదె వూరకె భ్రమసి సిగ్గు వడీ నదివో. ॥ మానిని ॥ 74

రీతిగౌళ

నీటినదు మదచితే నేఁడు రెండౌనా
యేఁటి కింక గొంకేవు యింతిఁ జేకోవయ్యా ॥ పల్లవి ॥
వాసులఁ జందురులోనె వడిఁ గందు గద్దు గాక
కాసే వెన్నెలలోనఁ గందు గలదా
ఆసల మోమునఁ గోప మటు నీపైఁ జల్లెఁ గాక
యీ సతికి మతిఁ గోప మింతయిన నున్నదా ॥ నీటి ॥
కొలనిలో కలువలకొట్టఁగొన వాఁడి గాక
అలరుఁ బరిమళము లవియూ వాఁడె
సొలసి చూచిన యింతి చూపులె వాఁడి గాక
నలువంకఁ గన్నులలో నవ్వులూ వాఁడా ॥ నీటి ॥
అంది నారికళపుఁ గాయకుఁ బైనె గట్టి గాక
కందువ లోనూ నట్టె గట్టి యయ్యీనా
పొందిన శ్రీ వెంకటేశ పొలిఁతి పై గుట్టు గాక
గొందినె కూడిన యింతిగుణము కఠినమా. ॥ నీటి ॥ 75

ముఖారి

ఏమే యిందు కెగ్గు లెంచఁ దగునా
కాముఁడు నేసినయట్టి కత లింతె కాక ॥ పల్లవి ॥
నేనా తనతో నెమ్మిఁ గొసరేదాన తన్నుఁ
గానక యెదురుచూచె కన్నులు గాకా
కానీ కానిమ్మని కదుఁ బగ చాటితినా
పూని జంకించినవె బొమ్మలింతె కాకా ॥ ఏమే ॥

అలిగి తనతో నే నవ్వలిమో మౌదునా
చెలఁగి వంచినది నా సిరసె కాక
మలసి తనతోను మాటలాడ కుందునా
వెలసిన విరహపువిసు పింతె కాక ॥ ఏమే ॥

పట్టఁగా నేనా పైకొనకుండేదాన
గుట్టుతోడ నుండెటి నా గుణము గాక
యిట్టె శ్రీ వెంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
పట్టిన నా నోము ఫల మింతె కాకా. ॥ ఏమే ॥ 76

లలిత

మదనరాగము నీకు మదనాతురము నాకు
యెదు రెదురఁ గలిగె నిందుకే మెచ్చితిఁ బో ॥ పల్లవి ॥

నిలువుల చెమటల నీమేను చూచి నా
నిలువెల్ల జెమరించె నేఁ డిదివో
కలువ కన్నుల నీ కావి చూచి నా కన్నుఁ
గలువలు కావి దేరీఁ గాఁకల కోపమునా ॥ మద ॥

వేఁడి నిట్టూరుపుల నీ వేషము చూచి నాకు
వేఁడినిట్టూర్పులు రేఁగె వెల్లవిరి
వాడుదేరెకళల నీ వదనము చూచి నేఁడు
వాడుదేరి చిన్నఁబోయ వదనము నాకు ॥ మద ॥

యెవ్వతో కాఁగిటి నీ యీ మేనిపచ్చి చూచి
యివ్వల నీ కాఁగిలి నీ కెక్కె నిపుడు
రవ్వల శ్రీ వెంకటేశ రతుల సంగడి నిట్టె
నివ్వటిల్ల నిన్నంటి నీయంత నైతి. ॥ మద ॥ 77

శంకరాభరణం

తా నెట్ల నున్నాఁడో తరుణి వినిపించవే
కానక నినుఁ గన్న నతనిఁ గన్నట్ల నాయనే ॥ పల్లవి ॥

కొంతవడిఁ దనపేరు కోరి నాలుకఁ దలఁతునే
కొంశవడి దనసుద్దులు కొమ్మలచే విందునే
కొంతవడి తానున్న కొలువుచిత్తరువు చూతు
కాంతయీరీతిఁ బొద్దు గడపుదునే నేను ॥ తానె ॥

మది నొక్కవేళఁ దనమాట దలపోతునే
కదిసి యొకవేళ దన్నుఁ గలలోనఁ గందునే
పదములనె వొకవేళ యెదురు నడతు నేఁ దనకు
తుద నిట్ల దినదినము దొబ్బుదునే నేనూ ॥ తానె ॥

సగినములు చూచుచు నే జరపుదునే వొకగడియ
వగలఁ దను దూరి లేకలు వ్రాతుఁ గొంతదడవు
జిగి నింతలోఁ గూడె శ్రీవెంకటేశ్వరుఁడు
మగిడి యల్లాడ నపుడు మఱఁగుపయి నిపుడూ. ॥ తానె ॥ 78

264-వ రేకు రామక్రియ

ఆకెవో నాప్రాణమోహనపురాణి
దాకొని వేవేలు కాంతలలోన నున్నది ॥ పల్లవి ॥

ముదితకురుల నెల్లా ముత్యములు మాణికాలు
గుదిగుచ్చి కీలుగంటు గొన్నది
సదరపు పసిఁడివజ్రాల చనుకట్టుది
అదె పైఁడిపూవులపయ్యెద వల్లెవాటుది ॥ ఆకె ॥

పచ్చలు దాచినయట్టి పాదుకలు మెట్టినది
లచ్చన మొగపుల మొలనూళ్లది
అచ్చపుటుంగరముల అందెలుఁ బాయవట్టాలు
గచ్చుల ముంజేతుల కంకణసూడిగేలది ॥ ఆకె ॥

నానాభూషణముల నానాసింగారాల
పానిపట్టి నా దిక్కె తప్పక చూచేది
అనకపు శ్రీవెంకటాద్రిపతినైన నన్ను
తానె వచ్చి కూడి నాదగ్గరనె వున్నది. ॥ ఆకె ॥ 79

సామంతం

అతనిదెస చూచి ని న్నపుడు దూరితి మమ్మ
వెతదీర నిఁకనైన విచ్చేయ వమ్మా ॥ పల్లవి ॥

వుదయచందురుఁ జూచి వువిద నీ మో మనుచు
అదన రావైతి వని యలిగి యవ్వలిమో మాయ విభుఁడు
యెదిటిమేఘముఁ జూచి యిదియె నీతురు మనుచు
కొదలుచును తల వంచి కొసరె నిన్ను ॥ అత ॥

చిలుకపలుకులు నీదుపలుకులని యిందాఁక
యెలయించి తని గొణఁగి యెడసి వీనులు మూసుకొని యుండెను
తళుకునను మెరువ నంతట నీదుచూపులని
తెలియనిభ్రమల దోమతెరలోని కేఁగె ॥ అత ॥

కోవిలలరొదలు విని కొమ్మ నీ యెలుఁ గనుచు
భావజుచేఁ బరచితని పదరి నిను వేవేలు మాటలాడె
యీవేళ విచ్చేసి యిటు నీవు గలయఁగా
శ్రీవెంకటేశ్వరుఁడు చి క్కొరఁగఁ డాయ. ॥ అత ॥ 80

రామక్రియ

ఔనె మాటకు మాట ఆడితివి వోరి
కాని యింకా నేమి గలిగినాఁ జెప్పరా ॥ పల్లవి ॥

కోరి నీ మోవి మెత్తన కుచములు కఠినాలు
చేరి నీతో పొందెట్టు సేయవచ్చునే
వోరి నీగుణము రాయి వొట్టిమాట చిగు రని
ఆరీతి నిందరికిఁ జూప ననువుగావలసిరా ॥ ఔనె ॥

కుత్తికె మరుశంఖము కురులు వంకగాలాలు
కొత్త నీకు నాకుఁ బొందు గూడు నటవే
వొత్తి నీ చదువు వేదా లొద్దినవి గాలాలు
జొత్తుగా నింతటఁ జెప్పి చూపఁగ వలసిరా ॥ ఔనె ॥

కడు నీ నవ్వు చల్లన కనుచూపు చురుకులు
కొడిమె నీవు న న్నెట్టు గూడితివే
వడి శ్రీవెంకటేశుఁడ వలపులరతి నీకు
సుడిసి చలి వేఁ దని చూపె నింతేరా. ॥ ఔనె ॥ 81

బౌళి

సరికి బేసి కవె పగ సాధించుఁ గాని
పరగ నందుకు నవె పతిమాఁటు చూపు ॥ పల్లవి ॥

వెన్నెలలె యెండ లట విరులె వాఁడె (డ?) ట
యెన్నఁగ నిందుకుఁగా నేల వెరవ
అన్నువ వెన్నెలరేని కారను రాహువుఁ జూపు
విన్నసై విరులకును విరహాగ్నిఁ జూపు ॥ సరి ॥

చిగురులే చేగ లట చిత్తజుఁడే పగ లట
యెగసక్కెముల నిందు కేల వెరవ
గుగురుఁ జిగురునకు కుత్తికె కోవిలఁ జూపు
షొ(పొ?)గరుఁజంద్రపుమోము పున్నమమారుకుఁ జూపు. ॥సరి॥

గాలియె వేఁ డట జక్కవ లుద్దీపన మట
యేల వెరవ శ్రీవెంకటేశుఁడు గూడె
గాలికిఁ జనుఁగొండలు కమ్మర నడ్డము చూపు
నాలి జక్కవలకు నీ నవ్వువెన్నెల చూపు. ॥ సరి ॥ 82

శంకరాభరణం

అది గురుతు మరవ ననవె నేను
అదన నిన్నిట జాణఁ డనవె తాను ॥ పల్లవి ॥

దోమటి నెందొ తన్నుఁ దోఁగి చూచితే నేను
నా మోము చూచి యట్టె నవ్వెఁగా తాను
కామించి యాడో సింగారములు నించుకోఁగా
వేమారు మొక్కితే దీవించెఁగా తాను ॥ అది ॥

దంతపుటోవరిలోన తా నేపని నుండఁగానో
కొంత నేఁ బిలిచితే నూఁకొనెఁగా తాను
దొంతులఁ దమ్ములముపొత్తులఁ జేయఁగాఁ గంటె
చెంత నన్నుఁ దప్పక చూచెఁగా తాను ॥ అది ॥
యీడకె శ్రీవెంకటేశుఁ డిప్పు డిట్టె విచ్చేసి
వాడికె సిగ్గులఁ దల వంచెఁగా తాను
కూడి చొక్కేవేళ మోము గురిగాఁ జూచితే నేను
మేడెపుఁ గాఁగిట నొక్కి మెరసెఁగా తాను. ॥ అది ॥ 83

ముఖారి

వేగుదాఁకా జాగరాల వేసారితిమి
వాగపు బిత్తరికాఁడ వచ్చేవా రావా ॥ పల్లవి ॥
తణుకున మోము చూపి తల దీసే వంతలోనే
తొలుత నీ చేఁతల సుద్దులే తవ్వేవు
చలపట్టి వూరకైన సారె సారె నవ్వేవు
వలవంత సటకాఁడ వచ్చేవా రావో ॥ వేగు ॥
పొడవులు చూపేవు పొంచి పగ చాటేవు
యెడసితే వెదకేవు యింతలోనే
బడి బడి నీడుగానిపనులకే పెనఁగేవు
వడఁబెట్టి సటకాఁడ వచ్చేవారావో ॥ వేగు ॥
బుద్దులఁ బోయేవు మెట్టి బూములెల్లాఁ దిరిగేవు
పొద్దువొద్దునకు నన్నుఁ బొదిగేవు
అద్దిర శ్రీవెంకటేశ అలమి కూడితి పిట్టె
వద్దనుండి యిట్లనె వచ్చేవా రావో. ॥ వేగు ॥ 84

265-వ రేకు వరాళి

కంటిమి వొకటిసేయఁగా నొకటి నీయందె
వొంట దొకటొకటికి నొద్దు మాతో బొంకులు ॥ పల్లవి ॥

మాటలాడఁబోతే మచ్చము మోవిఁ దోఁచె
నాటఁజూడఁబోతేను నవ్వు దోఁచెను
సీటున నుండఁగఁ బోతే నిద్దుర గన్నులఁ దేరె
యేటి కింకఁ జాలు చాలు నేల మాతో బొంకులు ॥ కంటి ॥

దగ్గరిరాఁబోతే వింతతావులు బుగులుకొనె
వొగ్గి విడె మియ్యఁబోతే నొలికె సిగ్గు
బెగ్గిలి వేఁడుకోఁబోతే పెంజెమట మేనఁ జిందె
యెగ్గు లెంచ నిఁక నిన్ను నేల బొంకే వయ్యా ॥ కంటి ॥

కాఁగిట నన్నంటఁబోతే గఁదపుబేఁటులు రాలె
మాఁగినరతులనుఁ దమకము రేఁగె
వేఁగుదాఁకా మాటల శ్రీవెంకటేశ కూడితివి
నీ గతులు చూడఁ జూడ నిజమె పో బొంకులు. ॥ కంటి ॥ 85

## భైరవి

ఆడనుండె యేమి గల్లా నానతియ్యరా
జాడతో నలుక గాదు చాలించరా ॥ పల్లవి ॥

చిగురాకు నామోవి చిత్తజు నడిద మట
తెగఁజేసు నీ వంత దిష్టించకురా
పగటు నాకుచములు పాయని జక్కవ లట
యెగరుఁజేసు నీ వింత దగ్గరకురా ॥ ఆడ ॥

నల్లని నాయారు యిది నంజువంటి పాముట
చెల్లఁబో యేమౌనో మమ్ముఁ జేరకురా
వెల్లవిరి నా నడుము వింత మేఁటి సింహ మట
కల్లరి యేమిసేసునో కాఁగిలించకురా ॥ ఆడ ॥

గరిమల నామేను కనకమువంటి దింతే
కరఁగజేసు నిట్టూర్పు గమ్మనీకురా
సిరుల శ్రీ వెంకటేశ చేరి కూడితి వింక
తరగు మొరఁగు దీరె దవ్వో చేరువరా. ॥ ఆడ ॥ 86

కౌండమలహరి

ఏమో సేయఁగఁ బోగా నేమో అయ
యేమని చెప్పుదుఁ బను లిటువంటివే ॥ పల్లవి ॥

పుక్కమీరి కృష్ణుఁడు మావుట్లు దించఁబోఁగాఁ
బక్కన నేఁ బారి తెంచి పట్టుకొంటినే
మొక్కలాన నతఁడు నా మోము చూచె నంతలోనె
మక్కువ నా మే నెల్ల మర పాయనే ॥ ఏమో ॥

కమ్మర నంతటఁబోక కాఁగులపాలంటఁ బోఁగా
బిమ్మిటిగాఁ గిందుమీఁదై పెనఁగితినే
యెమ్మెల నాతఁడు నా యిక్కువకుఁ జేయి చాఁచె
కమ్మి నా చిత్తము నీరై కరఁగితినే ॥ ఏమో ॥

వుద్దండాన గట్టి వెన్నముద్ద లారగించఁగానె
గద్దించి కాఁగిట నేఁ గమ్మికొంటినే
వొద్దనె శ్రీ వెంకటేశుఁ డొంటి నన్నుఁ గూడఁగా
నిద్దరికిఁ బులకించి యేక మైతిమే. ॥ ఏమో ॥ 87

సాళంగనాట

ఎటువంటి మోహమో యెట్టి సంతసములో
ఘటియించె నిద్దరికిఁ గందువ మాయెదుటా ॥ పల్లవి ॥

కామిని యెదురు చూడగఁ గన్నుల పండుగలాయ
ఆమని నీ రాకల మోహనరూపము
వేమరు నాలకించఁగా వీనుల పండుగలాయ
కోమలితో నీ వాడే గురిమాటలు ॥ ఎటు ॥

మానినికి నింతలోనె మంచి వుట్ల పండు గాయ
ఆనెటి నీ మించు నధరామృతము
తానకమాయ నిదిగో తగు దివ్వెల పండుగ
పాని నీ కరుణఁ జూచే పచ్చి చూపులు ॥ ఎటు ॥

కలికికి నిపు డిట్టె కాఁగిటి పండుగ లాయ
చలువ నీ కూటముల సమరతులు
అలరి శ్రీవెంకటేశ అన్నిటాఁ బండుగ లాయ
జలజాక్షి నీలోని సరసములు. ॥ ఎటు ॥ 88

నాదరామక్రియ

చెలువుఁడ నీవు మేలు చిత్తమె తీలు గాని
పలుకులఁ దనిసితి బాస లెట్టో కాని ॥ పల్లవి ॥

అంది నీ మాటలు మోవి యమృతపుఁ దీపె పో
చిందర నీ చేఁతలె చేఁదు గాని
విందుల నీ ప్రియములు వెన్నకంటె నున్ననె పో
కందువ నీ గుండె యిదె కడురాయి గాని ॥ చెలు ॥

సొంపుల నీ యిచ్చకాలు చుక్కలకంటె గనము
గుంపెన నీ గుణమె కొంచము గాని
తంపి నీ చుట్టరికము తామెరకంటె దంపర
యింపు నీ వలపె యార డిన్నిటిలోఁ గాని ॥ చెలు ॥

గరిమె నీ నగవులు కప్పురాలకంటెఁ జవి
కరఁగు నీ విడెమె కారము గాని
యిరవై శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సరవు లిప్పుడు మేలు నటదొల్లె కాని. ॥ చెలు ॥ 89

పాడి

ఎట్టు సింగారింత మమ్మ యీ యింతిని
ముట్టని సింగారము ముందు ముందె యమరే ॥ పల్లవి ॥

పొలితి చంద్రవంకబొట్టు వెట్టఁ బోయి సంది
మలసే గోరొత్తు చూచి మాని(ని) నవ్వేను
కలిమిఁ జంద్రగావి గట్టఁబోయి అద్దములో
సొలపుఁ గన్నులకావి చూచి నవ్వేను ॥ ఎట్టు ॥

అమరిన ముత్యాలహారములు వెట్టఁ బోయి
చెమటముత్యాలు చూచి చెలి నవ్వేను
కొమరె యరవిరులు కొప్పున ముడువఁ బోయి
తమిఁ బులక విరులు తాఁ జూచి కొంకెను ॥ ఎట్టు ॥
వీఁగుచుఁ బరిమళము వెలఁది పూయఁగఁ బోయి
కాఁగిటి వాసన చూచి కడు నవ్వెను
సోగల శ్రీవెంకటేశు సురతసింగారము
వాగమై యమరెఁ గాన వన్నెలెల్ల నమరే. ॥ ఎట్టు ॥ 90

266-వ రేకు వరాళి

మనలోనిమాఁటా మనసులో తీఁట
వెనకఁ జెప్పేఁ గాని విడువు మీ పూఁటా ॥ పల్లవి ॥
మొగములో బిగువు మోవిమీఁది తగవు
జిగి దేరె నిందరిలోఁ జెప్పనేలా
చిగురుఁగొప్పు చెదరు చిమ్ముఁ జూపుల బెదరు
నగితేనె పచ్చి దేరి నన్ను నేమీ ననకు ॥ మన ॥
ముక్కున వుసురులు చెక్కుల యసరులు
కుక్కి తోయ కంత కొంత గుట్టె మేలు
అక్కుపై గురుతులు అంగపు సరతులు
మక్కళించనేల యిది మరువకు చాలు ॥ మన ॥
కాఁగిటి మైతావులు కన్నుఁగవకావులు
యీగతి నా భావము నా యెదుట నేల
భోగపు శ్రీ వెంకటేశ పొందితివి నన్ను నిట్టె
రాఁగిన సరసములు రచ్చలలోఁ దగునా. ॥ మన ॥ 91

పాడి

ఇందుకేమి దోసమా యింతలోనిపని కేమి
కలదుఁ గుందు నేరుపుచేఁ గప్పి పోయఁ బో ॥ పల్లవి ॥

చక్కని నీ వదనము చందురునికంటె మేలు
ముక్కపోయినది నీమోవి యింతె పో
మిక్కిలి నీతురుమిది మేఘముకంటె మేలు
చిక్కువడి జారినది సిగ్గువాటి పో ॥ ఇందు ॥

నిచ్చలు నీ దేహ మిది నీలముకంటె మేలు
పచ్చియై వున్నది నీ భావ మింతె పో
తచ్చిన నీ కరములు తామెరకంటె మేలు
కొచ్చి దయలేనిది నీ కొనగోరె పో ॥ ఇందు ॥

పమ్మిన నీ కాఁగిలిది పానుపుకంటె మేలు
వుమ్మచెమటలఁ దోఁగె వుర మింతె పో
యెమ్మెల శ్రీ వెంకటేశ యిన్నిటా నీవు మేలు
చిమ్మి చిక్కించేది నీ చెలువమె పో. ॥ ఇందు ॥ 92

భైరవి

విన్నపాల కెవ్వరికి వేళ గాదు
వున్నతి నంతరంగాన నున్నాఁడు దేవుఁడూ ॥ పల్లవి ॥

సరుస చెమటలు మేన జారఁ గాను
నిరతపు నిట్టూరుపు నిగుడఁగాను
సరిఁ గరఁగి జవ్వాది జారఁగాను
వొరసి మలఁగుమీఁద నున్నాఁడు దేవుఁడూ ॥ విన్న ॥

తెల్లని కన్నుల నిద్ర దేరఁగాను
చిల్లరై గంథపుబేఁట్లు చిట్లఁగాను
వొల్లనె కొప్పున విరు లొలుకఁగాను
వుల్లసాన నరవిరై వున్నాఁడు దేవుఁడూ ॥ విన్న ॥

అలమేలుమంగ మేలమాడఁగాను
కలయఁ దమకములు గదుమఁగాను
అలరి శ్రీవెంకటేశుఁ డల్ల వాఁడె
వొలిసి యేకతమున నున్నాఁడు దేవుఁడూ. ॥ విన్న ॥ 93

శుద్ధవసంతం

తిట్టనేర్తునా నిన్ను దీవించ నేరుతుఁ గాక
దిట్టనై నీకు మోహించు తెరవ నేఁ గాక ॥ పల్లవి ॥

కోరి నీ వేమి సేసినఁ గోపగించ నేరుతునా
నేరుపునఁ జెక్కు నొక్కి నేరుతుఁ గాక
సారె నిన్ను వెంగెమాడి జరయఁగ నేరుతునా
ఆరీతినె నిన్నుఁ గొనియాడ నేర్తుఁ గాక ॥ తిట్ట ॥

చీకాకుమై చూచి వుదాసీనము సేయ నేర్తునా
నీకు నేఁ బ్రియము చెప్ప నేరుతుఁ గాక
ఆకడ నీనిట్టూర్పుల కదే మన నేర్తునా
దీకొని నీ యల పెల్లఁ డీర్చ నేర్తుఁ గాక ॥ తిట్ట ॥

కామించి మొక్కఁగ నిన్నుఁ గాల దొబ్బ నేరుతునా
నేమమునఁ గాఁగిలించ నేరుతుఁ గాక
గోమున శ్రీవెంకటేశ కూడితివి బాస సేసి
యీ మేలు మరవ నే నెంతైన నేర్తునా. ॥ తిట్ట ॥ 94

మంగళకౌశిక

సొరిది నీ జాడ లెల్లఁ జూచుట గాక
యెరవు సతము లెంచ నిఁక నేల విభుఁడా ॥ పల్లవి ॥

నీవే నే నైతే నిలుచుందువా ఆడ
వోవరి నామీఁద నొరగుందువు గాక
పూవే పిందైతే పూఁప లనే మాఁట లేల
చేవదీరి శ (స?)మువలెఁ జెప్పి చూపుఁ గాకా ॥ సొరి ॥

తమకమే కలిగితే దవ్వుల మాటాడుదువా
అమరి నాతో నేకత మాడుదు గాక
కమలమే కలువైతేఁ గడరేయి మొగుచునా
సమమై కాంచనములజాడ నుండుఁ గాక ॥ సొరి ॥

చిత్తము లేకము లైతేఁ జేతి కిత్తువా విడెము
పొత్తుల మోవినె అంది యిత్తువు గాక
యిత్తల శ్రీవెంకటేశ యిటు గూడిన నీ పొందు
హత్తి పాలునీరువలె నైక్యమాయఁ గాక. ॥ సొరి ॥ 95

పాడి

అక్కలాల అమ్మలాల అందరు నున్నా రిదె
చెక్కుచేత నుంటిఁ గాక సిగ్గువడి వుంటినా ॥ పల్లవి ॥
వుండి వుండి నాలోన నుసురంటి నింతె పో
అంద నేఁ దను వెంగెము లాడితినా
దండియై కన్నీళ(ళ్ల?)తోనే తప్పక చూచితిఁ బో
నిండుఁ గొలువునఁ దన్ను నేరము లెంచితినా ॥ అక్క ॥
నా తమకములు చూచి నవ్వుకొంటి నింతె పో
చేతికి లో నని తన్నుఁ జెనకితినా
మోతలఁ గాఁకలతోనే మోము వంచితి నింతె పో
పై తరవుపెట్టి తన్ను బలిమి సేసితినా ॥ అక్క ॥
కడలేని మోహమునఁ గాఁగిలించితి నింతె పో
వుడివోని వెరగుతో నూరకుంటినా
31 యెడలేక శ్రీవెంకటేశుఁడు నన్నేలఁగాను
కడు నే మెచ్చితిఁ బో కాదంటినా. ॥ అక్క ॥ 96

267-వ రేకు సామంతం

తొల్లి సేసినంతె చాలు తోడఁ జేతనం బెట్టు
చిల్లరచేఁతలు యిఁక జేయఁగవద్దనవే ॥ పల్లవి ॥
గొల్లెత లుసురు పిల్లఁగోవిమోతలై యంటె
వొల్లనె నన్నిఁక నేఁప నొద్దనవే
మెల్లనె వారితో బొంకి మే నెల్ల నల్లి నాయ
కల్లలు నాతో నాడఁ గమ్మటి వద్దనవే ॥ తొల్లి ॥

నెలఁతల కనుదిష్టి నెమలిచుంగులై యంటె
వలఁబెట్టి చలపట్ట వద్దనవే
అల మదరాగము పీతాంబరమై మొల నంటె
యెలయించి నను( బాయ నింకా వద్దనవే ॥ తొల్లి ॥
చేరినవారిపొందులు శ్రీసతియై వుర మంటె
వోరసేయ నాతో నొద్దనవే
యీరీతి శ్రీవెంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడి
గారవించె నిఁక నెంమూఁ గదల వద్దనవే. ॥ తొల్లి ॥ 97

శంకరాభరణం

నాకు నాకే వెరగయ్యీ నన్నుఁ జూచి
పైకొని మరుఁడు నేసే భ్రమత గాఁబోలును ॥ పల్లవి ॥
పులకించితి నింతె పూవులమొగ్గలు రాలీ
కలికి వసంతము గాఁబోలు
పలికితి నింతె నేను పైకొని కెంజాయకెంపు
కలయఁగ నెరసంజ గాఁబోలును ॥ నాకు ॥
విందుల నవ్వితి నింతె వెన్నెలపొలపు గాని(సీ?)
కందువ చంద్రోదయము గాఁబోలును
ముందరఁ జూచితి నింతె ముంపు దామెరలు రాలీ
ధిందుపడి యింతలోనె తెల్లవారఁబోలును ॥ నాకు ॥
చెమరించితి నింతె నేసముత్యములు రాలీ
తమి శ్రీవెంకటపతి దగ్గరఁ బోలు
అమరఁ గూడితి నింతె ఆతఁడు మేను మరచె
సమమోహములలోని సందడి గాఁబోలును. ॥ నాకు ॥ 98

దేసాళం

ఇందరు సవతులకు నిటు నేనె గురియా
సందడి నాతనినే జరయ రాదా ॥ పల్లవి ॥

కోరి నన్నుఁ జూచి చూచి కోపగించే వది యేమే
ఆరీతి నాతఁడు మాటలాడ కుంటేను
సారె వెంగెమాడేవు చలమున నిది యేమే
రారాఁపై నీ కడకు రాకుంటేనూ ॥ ఇంద ॥

వున్నట్టి నామాట విని వుస్సురనే వది యేమే
అన్నిటా నాతఁడు మేలమాడఁ డంటాను
కన్నులఁ దప్పక చూచి గదరుకొనే వేమే
మన్నన నాతో సరి మన్నించఁ డనుచు ॥ ఇంద ॥

నాలి నా యెదుట నీవు నవ్వు నవ్వే వేమే నిన్నుఁ
బోలిమితోఁ బొంది నన్నుఁ బొందె నంటాను
ఆలరి శ్రీ వెంకటేశుఁ దాతఁడేమి సేసినాను
నీలాగు భాగ్యము గాక నే నేమి సేతునే. ॥ ఇంద ॥ 99

బౌళి

అయినట్టయ్యీఁ గాని అల్లాడనే
పయిపూఁత సటమాని పదరాదా ॥ పల్లవి ॥

కన్నులఁ జూడనిదానవు మన్నుఁ గపకవ నవ్వ నేలె నీ
చిన్ని మో మెత్తనిదానవు చెక్కు చెమరించనది యేలె
కన్నె సిగ్గువద్దదానవు నన్నుఁ గడు నిక్కి చూడనేలె యీ
పన్నెటి మాయలు మాని పదరాదా ॥ అయి ॥

పొంచి మాటాడనిదానవు మాతో బొమ్మల జంకించనేలె నా
మంచానకు రానిదానవు నీవు మరి వుస్సు రన నేలె
కంచపు పంతపుదానవు మా కత లాలకించ నేలె యీ
పంచల మాయలు మాని పదరాదా ॥ అయి ॥

వొలిసీ నొల్లనిదానవు నీ వొళ్లు పులకించ నేలె నేఁ
గలసితి శ్రీ వెంకటపతిని
బలిమిఁ బెనఁగేదానవు యిట్టె పరవశ మంద నేలె నీ
పలుకుల మాయ(లు) మాని పదరాదా. ॥ అయి ॥ 100

### సామంతం

ఆఁటదాని కింత యేల అంతలోని పనికిఁగా
పూఁటపూఁటఁ దనతో నేఁ బోరనేలా ॥ పల్లవి ॥
వలవని పతికె వలచే యా రోఁత లేల
మలసెటి విరహాగ్నిమంట లేదా
పలుకని పతితోడఁ బలుకఁగ నది యేల
ములుగుచుఁ బానుపుపై మోనము లేదా ॥ ఆఁట ॥
యింటికిరానిపతికి నెదురు వోవఁగ నేల
జంటయి మునుఁగఁ జింతాజలధి లేదా
నంటులేని పతితోడ నవ్వఁబో నంత యేల
అంటరాని చిగురాకుటమ్ములు లేవా ॥ ఆఁట ॥
కడదొక్కె పతితోడఁ గాఁగిలించ నిది యేల
ముడిచి యవ్వలి మారుమోము లేదా
అదరి శ్రీ వెంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
సడి వూరకే యంటి సరసము లేదా. ॥ ఆఁట ॥ 101

### సాళంగం

చెప్పకువే వానిసుద్ది చెవు లెల్లాఁ జిల్లు లయ్యీ
దప్పిదేరెఁ జాలు చాలు తానె బదుక నీవే ॥ పల్లవి ॥
వొక యింతికిఁ బుట్టి వొకరికొడుక ననె
అకట నేఁ దిట్టఁగాఁ దా నటు రోసీనా
వికటించి మేనమామ పీటి కేఁగి తానె చంపె
యెకసక్కెఁడు వీనితో నేఁటి చుట్టరికమే ॥ చెప్ప ॥
కొడుకు దెచ్చినయట్టి కొమ్మలు పదారువేల
యెదరై పెండ్లాడెఁ దన కేఁటి వావే
చిదుముడి గొల్లెతల చీరలు దొంగిలినట్టి
అడిబండనికి నేఁటి యాచారమే ॥ చెప్ప ॥

శ్రీ వెంకటాద్రిమీఁద శ్రీసతి నురాన మోచె
యీవలఁ దనకు నిఁక నేఁటి సిగ్గే
కావించి నన్నుఁ గూడి కమ్మరఁ బ్రియము చెప్పె
యీవేళ వెసక యెంచ నిఁక నేఁటికే. ॥ చెప్ప ॥ 102

268-వ రేకు సాళంగనాట

సటలకు జంపు నాతో జరపీఁ గాక యిట్టె
కటకటా నిజ మెల్లఁ గానరాదా నాకు ॥ పల్లవి ॥

కడుమోహము నాపైఁ గలవాఁడె తా నైతె
యెడమాట లాడుదాఁకా హృదయము నిలిచీనా
వొడఁబాటులేమి గల్లా వొద్ద నాతో నాడుఁ గాక
విడువు మనవె యిట్టివేషము లెరఁగనా ॥ సట ॥

కరుణె తనమతిఁ గలిగినవాఁ డైతె
అరయ నాహారనిద్ర లాడఁ ఏన కింపౌనా
కొరతలేమిగల్లాఁ గోరి నాతో నాడుఁ గాక
వెరవున విడు విడు వేసా లెరఁగనా ॥ సట ॥

తానె నే నైతె తనువులు వే రౌనా
తానె మతికి మతిఁ దారుకాణ లౌఁ గాక
యీ నెపాన శ్రీవెంకటేశుఁడు నన్నుఁ గూడె
వీనుల వినిన వింతె వేసా లెరఁగనా. ॥ సట ॥ 103

పాడి

కొండవంటి దొరతోడి కోపములేల
దండనె దవ్వుదవ్వుల దక్కుటింతె కాకా ॥ పల్లవి ॥

పూచిన వెన్నెలలంటేఁ బుప్పొడి వెదక నేల
చూచి చూచి కన్నులనె చొక్కుట గాక
యేచి నీవు నవ్వితే న దేమని యడుగ నేల
నాచుల మారుకు మారు నవ్వుటింతె కాక ॥ కొండ ॥

నేతిబీరకాయంటే నేయి వెదకఁగ నేల
పూఁతగాని లోలోనె పూఁకొంట గాక
చేత నీవు విలిచితే చేరి దగ్గరఁగ నేల
మోఁతల నందుకు మెచ్చి మొక్కుటింతె కాకా ॥ కొంద ॥
కోరి మోవితేనెలంటే గుక్కిళ్లు మింగ నేల
చేరి నిన్నుఁ గూడి యిట్టె చేకొంట గాక
ఆరయ శ్రీవెంకటేశ అంత నీతోఁ జల మేల
మేర మీరినట్టి నిన్ను మే లనుట గాక. ॥ కొంద ॥ 104

రామక్రియ

కందము విందము గాక కన్నులారను
అంది యెంద వెన్నె లైతే నదెవ్వరి మేలు ॥ పల్లవి ॥
కాసీవె అందు కేమి కా దనఁగ వచ్చునా
మోనానఁ దాన(ను?)ంటేఁ జాలు మొక్కే నేను
పోసీ పోసీ వీరి వారి బుద్ధులైన విసెఁగా
ఆని వేము దియ్య నైతే నదెవ్వరి మేలు ॥ కంద ॥
తనలోనె నవ్వనీవే దాని కేమి దోసమా
వొనర మమ్ముఁ జెనకకుంటేఁ జాలు
కననీ కననీ తన కడలచుట్టరికాలు
అనుమె మిను మైతే నదెవ్వరి మేలు ॥ కంద ॥
మేలు మేలు యిది యేమె మేనవావి బలువా
యీలీల నన్నుఁ గూడె నింతే చాలు
అలరి శ్రీవెంకటేశుఁ డంతటివాఁ డౌఁ గా
అలు మగఁ డొక్క  డైతే నదెవ్వరి మేలు. ॥ కంద ॥ 105

హిజ్జిజి

దక్కె నీకుఁ బంతము తగు నింక సంతము
మక్కువఁ గలసి యనుమాన మింకానా ॥ పల్లవి ॥

పచ్చికస్తూరినామము పాదపులత్తుక లాయ
కొచ్చి పతిమీఁద నేలె కోప మింకాను
నిచ్చ సిరసువిరులు నీకుఁ బాదపూజ లాయ
దిచ్చరి నీ యలుకింకాఁ దీర దాయనా ॥ దక్కె ॥

పతివదనము తమ్మపడిగమాయ నీకు
మతిఁ జల మింకా నీకు మానదటవే
అతని చెక్కుచెమట లర్ఘ్యపాద్యము లాయ
తతి నీగుండె గరఁగదా యింకాను ॥ దక్కె ॥

మంచి మంచి వుంగరాల(లు?) మాణికపు మట్టెలాయ
మంచ మెక్కి వుండి యడమాట లింకానా
వంచనై శ్రీ వెంకటేశు వావి వరుసయుఁ గూడె
అంచె రతులఁ గూడితి వాస లింకానా. ॥ దక్కె ॥ 106

పాడి

ఎట్టు గెలువఁగ వచ్చు నిట్టి వానిని
మెట్టి వచ్చీ నా కాలు మేలు గాదా ॥ పల్లవి ॥

కొచ్చి కొచ్చి తన్ను నేఁ గోపగించఁగా తా
నచ్చపు నవ్వులు నవ్వీ నంతె కాదా
వొచ్చముదనం ను నే నొగిఁ జూపఁగా నన్ను
మెచ్చి చేయి వేయ వచ్చీ మేలు గాదా ॥ ఎట్టు ॥

వెక్కసమై తన్ను నే వెంగెమాడఁగా తా
నక్కడివా రందు మోపీ నంతె కాదా
తెక్కుల నేఁ దన్ను దూరి తిట్టఁగానె నేఁడు దా
మిక్కిలి నన్ను దీవించీ మేలు గాదా ॥ ఎట్టు ॥

కడుఁ దమకాన నేఁ గసరఁగా తా
నడరి కాఁగిట నించీ నంతె కాదా
యెడయక శ్రీ వెంకటేశుఁ డిటు గూడి నా
మెడ యెత్తి చెక్కు నొక్కీ మేలు గాదా. ॥ ఎట్టు ॥ 107

సామంతం వాకీవాక్సౌ

పో పో నీ పోలికలు పోలుచకురా అయితే
నీ పోలికలసాటె నే నయ్యేనే ॥ పల్లవి ॥

పాముపడుకవాఁడ పట్టకురా ఆ
పామువంటి యాస నీకుఁ బాయదు గదే
గామిడి చక్రమువాఁడ కదియకురా వో
చామ నీ పిఱుఁదు ఘనచక్రము గాదా ॥ పోపో ॥

నెమలిచుంగులవాఁడ నిలు నిలరా ఆ
నెమలినడపు లెల్లా నీకు లేదటే
తమి సంకుఁబేరివాఁడ తడపకురా
అమరె నీ మెడ శంఖ మదె కదవే ॥ పోపో ॥

కొండపయి శ్రీవెంకటేశ కొంకనేలరా ఆ
కొండలకుచాలు నీకుఁ గొలఁదె కదే
నిండుఁ గాఁగిటను నన్ను నించితి వవురా
నిండుఁగళలమోము నెలఁతవు గదవే. ॥ పోపో ॥ 108

269-వ రేకు ముఖారి

కాఁగలదయ్యాఁ గాక కాఁక లేఁటికే
దాఁగ నేల యింతలోనె తానె నే ననవే ॥ పల్లవి ॥

కంటిచూపు వాఁ డాయ కమ్మనవ్వు వేఁ డాయ
యింటిలో నింకాబుద్ధులేమి చెప్పేవే
కుంటెనలు విసుపైఁ గోరికలు ముసిపై
అంటఁగాక వున్నదాన నానవెట్ట నేఁటికే ॥ కాఁగ ॥

మంతనాలు దరచాయ మాటపట్టు గురుచాయ
యెంత కెంత వొడఁబా ట్లిఁక నేఁటికే
దొంతులాయఁ గూరిములు దూరులాయ నేరములు
వంతులు వాసులు నింక వద్దనవే ॥ కాఁగ ॥

చిత్తమెల్ల నీ రాయ సిగ్గు లెల్ల జా రాయ
యిత్తల వెనకసుద్దు లిఁక నేఁటికే
అత్తిన శ్రీ వెంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
తత్తరపు వేడుకలు దలకూడెనే. ॥ కాఁగ ॥ 109

మంగళకౌశిక

ఏకచిత్త మైనప్పు డిన్నియు మఱె(ఱ?)య్యీఁ గాని
నాకు నీ వేళకు నీ నవ్వులె చాలు ॥ పల్లవి ॥

చిక్కువడివున్నది నా చిత్తము నీ
చెక్కులఁ జిందరలైన జీరలవలె
చక్క నన్ను మాటాడించకురా నీవూ నీకు
మొక్కేను నా కింక మోనమె చాలు ॥ ఏక ॥

కడుఁ గాఁక రేఁగె నా కాయము నీ
కదలపుక్కిటితమ్మకారమువలె
పది నా పయ్యెదకొంగు పట్టకురా నీకు
వెడఁ బంత మిచ్చే నాకు విరహమె చాలు ॥ ఏక ॥

పరవశమాయ నా భావము
గరిమ నిద్దురల నీ కన్నులవలె
యిరవై శ్రీవెంకటేశ యేలితివి యిది
మరిగితిమి నాకు నీ మన్ననె చాలు. ॥ ఏక ॥ 110

ఆహిరి

ఇట్టిదివో సతిమోహ మిదివో మా విన్నపము
యెట్టు వలసినఁ జేయు మిఁక నీ చిత్తము ॥ పల్లవి ॥

తరుణి నీకు వలచి తనువె మఱచెఁ గాని
మరులు నీపై భక్తి మఱవదు
గరిమ విరహవడఁ గన్నులు మూసెఁ గాని
నిరతి నీవు వచ్చే వని తలుపే మూయదు ॥ ఇట్టి ॥

నింతు నీపై చింతచేత నిద్దుర విడిచెఁ గాని
దండి నీ నామజపము తా విడువదు
అండనె సింగారించె యాసలె మానెఁ గాని
నిండుఁ జేత నీకు మొక్కే నేమమే మానదు ॥ ఇట్టి ॥

చిక్కి యిట్టె నిన్నుఁ గూడి సిగ్గులతోఁ బాసెఁ గాని
తక్కక నీ సరసము తాఁ బాయదు
మిక్కిలి శ్రీవెంకటేశ మెచ్చ నిన్ను నేర్చెఁ గాని
చక్క నీ వెటు సేసినా సాదించ నేరదు. ॥ ఇట్టి ॥ 111

శ్రీరాగం

ఇంతికి నీ వెరవా యిచ్చకా లెరవు గాక
మంతనము నీకు లేదా మారు లేదు గాక ॥ పల్లవి ॥

తలపోఁత గరవా తరుణిట్టె నినుఁ బాసె
కలది నెన్నడు మనె కరవు గాక
పులకలుగొంచమా పొలిఁతి ని స్సిటు చూడ
కొలఁదివాఁడిన మోమె కొంచము గాక ॥ ఇంతి ॥

జాగర మేమి దొడ్డా సతితో నీ వలుగఁగా
తోఁగిన నీటికన్నులె దొడ్డ గాక
బాగుల ని న్నద్దలించ బరవా బొమ్మలను
పాఁగిన యింతికుచాలె పై తరవు కాక ॥ ఇంతి ॥

ఆయములు దాఁకవా అంగజుఁడు చెలి నేసె
దాయపుఁ గోరిక కొనదాఁకదు గాక
యీయెడ శ్రీవెంకటేశ యింతి నిట్టె కూడితివి
మాయలా యిన్నియును నీ మన్ననలె కాక. ॥ ఇంతి ॥ 112

కాంబోది

విడు విడరే యీ విధ మేల సతి
బడి బడి నేఁటికి భ్రమయించేరే ॥ పల్లవి ॥

కామాతురమున కలిగిన కాఁకలు
ఆమని పన్నీట నారీనా
నేమపు నీరువట్టు నేతఁ దీరునా
కామిను లేఁటికిఁ గారించేరే ॥ ఏడు ॥

చిత్తములోపలి చింతలచీఁకటి
యెత్తిన దీపాల నెడసీనా
గుత్తపుటాకలి గుక్కిళ్లఁ దేరునా
యిత్తల సతి నే లేఁచేరే ॥ ఏడు ॥

శ్రీవెంకటపతిఁ జెందెటి యాసలు
తావుఁ గుంపెనలఁ దనిసీనా
యీవేళనె చెలి నితఁడు గూడెను
నావల మీ రేల నవ్వేరే. ॥ ఏడు ॥ 113

బౌళిరామక్రియ

ఒద్దు మమ్ముఁ జెనకక వుండుమనవే
యిద్దరము నెదురైతి మింతె పొమ్మనవే ॥ పల్లవి ॥

పాలవంటికులము మా భావము నిచ్చలము
నాలి మమ్ముఁ జూచి యేల నవ్వీనె తాను
పోలింప మా యుంకులును పువ్వొడిమై సంకులు
చాలు నిది చూచి తాను సన్న లేల సేసీనే ॥ ఒద్దు ॥

మోచేవి చల్లలు నేము ముడిచేవి మొల్లలు
పూఁచి యేల రట్టుసేసి పొంచీనె తాను
కాచేదా మా మందలు కడసారె నిందలు
యేచి తాను మమ్ము గేలి యేల సేసీనే ॥ ఒద్దు ॥

గుంపెన మా నడపు కొప్పు గడు నిడుపు
తెంపున మ మ్మేల యింత తేల నాడీనే
యింపుల శ్రీవెంకటేశుఁ డింతలోనె మమ్ముఁ గూడె
సంపదల మమ్ము నేల సాదించీనే. ॥ ఒద్దు ॥ 114

270-వ రేకు నాదరామక్రియ

చెల్లని చేఁతలు చెల్లీఁ జెలియ నీకిట్లని
అల్లదె నీ పతి నిన్ను నడిగి రమ్మనెనే ॥ పల్లవి ॥

నాతి నీ మోముఁ దమ్మిలో నవ్వువెన్నెలలు గానె
యీతల నందుకు నిందు కేమి వోదే
నీతుల నీ యెదుటను నీ రమణుఁ డిటు చూచి
ఆతల నీ భావము అడిగి రమ్మనెనే ॥ చెల్ల ॥

కేరి కన్నుఁగలువల కెంపు సూర్యోదయ మాయ
యేరీతి నందుకు నిందు కేమి వోదే
కారణము లేని చేఁత కమ్మర నీ పతి చూచి
ఆరసి నీ భావము అడిగి రమ్మనెనే ॥ చెల్ల ॥

జక్కవచన్నులమీఁద చంద్రవంక లటు నించి
తక్క శ్రీవెంకటపతి తానె చూచె
యిక్కువతో నిన్నుఁ గూడి యెదురుమేడ యెక్కి
అక్కడ నీ భావము అడిగి రమ్మనెనే. ॥ చెల్ల ॥ 115

సామంతం

నీకు నీకె మాకు మాకె నేరుపులు
ఆకడ నీకడ నే మంత కోపఁ గలమా ॥ పల్లవి ॥

మందమిరియాలువో నీమాటలు
నిందలకు గురివో నీనీటులూ
సందడిఁ బెండ్లివో నీ సరసాలు
అందపు రమణుఁడ నే మంత కోపఁ గలమా ॥ నీకు ॥

సూదుల మూటలువో నీసుద్దులూ కదుఁ
బోదిసేసేకొండి వీబుద్ధులు
గాదెల కొలుచువో నీ గాథలు
ఆదెస నీదెస నే మంత కోపఁ గలమా ॥ నీకు ॥

ముట్టితేనె ముయివో నీమొక్కులు
చెట్టునఁజేటఁడువో నీచిక్కులు
గుట్టున శ్రీ వెంకటేశ కూడితివి యిఁక
నట్టు నిట్టు నిన్ను నాడ నంత కోపఁ గలమా. ॥ నీకు ॥ 116

ముఖారి

అయినట్టయ్యీఁ గాక అంతయేఁటికే
పయిపైఁ గలపితివి పాఁచి యేఁటికే ॥ పల్లవి ॥
వల్లెవాటుఁ బయ్యదతో వాడుఁగొప్పు విరులతో
చల్లె లమ్మె గొల్లెతవు జంకె నేఁటికే
చిల్లర చెమటతోడ చిక్కని పూర్పులతోడ
గొల్లలెక్క లాడేవు కోప మేఁటికే ॥ అయి ॥
పులకజొంపాలతోడ బొమ్మంచు మోవితోడ
కొలచినందె కొలచి కొంక నేఁటికే
కలకల నవ్వుతోడ కందువ సిగ్గులతోడ
వెలయఁగఁ జెప్పేవు వింత లేఁటికే ॥ అయి ॥
పుక్కిటివిడెముతోడ పూఁతల గందముతోడ
అక్కునఁ బోసి చూపే వాన లేఁటికే
యెక్కువల శ్రీ వెంకటేశుఁడనైన నన్ను
గక్కనఁ గూడితి వింక గద్దించ నేఁటికే. ॥ అయి ॥ 117

రామక్రియ

నీవే నేనైతిఁగా నేరుపు నేరాల కేమి
చేవ దేరెఁ జాలు చాలు చెప్పకు నీ సుద్దులు ॥ పల్లవి ॥
తలఁ పొక్కటాయఁగా తమకము లెన్నియైనా
పలు కొక్కటాయఁగా పంతము లెన్నైనా
చలములు చెల్లెఁగా సాదింపు లెన్నియైనా
చెలువుఁడ చాలుఁ జాలు చెప్పకు నీసుద్దులు ॥ నీవే ॥

చన వెక్కు డాయఁగా సరసాలు గనమైనా
నను పిది గలిగెఁగా నాఁటకము లెన్నైనా
మన విది చెల్లెఁగా మంతనాలు దరచైనా
చెనకకు చాలుఁ జాలు చెప్పకు నీ సుద్దులు ॥ నీవే ॥

కూటములు గలిగెఁగా కోరికలు దరచైనా
నీటుమీఁద మిక్కిలిగా నిండుఁ బరవసమైనా
యేటికి శ్రీ వెంకటేశ యెనసితి మిద్దరము
చీటికి మాటికి నింకఁ జెప్పకు నీ సుద్దులు. ॥ నీవే ॥ 118

## శ్రీరాగం

ఇంత చాలదా యింతి కిదొకటే
రంతుల రమణుని రప్పించెఁ గనక ॥ పల్లవి ॥

పలికిన పలుకుకు పంతం బొకటే
వెలఁది విభుని నవ్వించెఁ గన
నిలిచిన నిలువుకు నిచ్చల మొకటే
మలయని పతిఁ బెడమరలించెఁ గనక ॥ ఇంత ॥

చూపు చూచుటకు సోద్యం బొకటే
యీపతిఁ జెమటల నెనపెఁ గన
తీపుల నటనకు తేజం బొకటే
కోపపుఁబతి నూఁకొనిపించెఁ గనక ॥ ఇంత ॥

ఘనమగు రతులకుఁ గైవస మొకటే
పెనఁగుల మైమరపించెఁ గన
వనిత కిదొకటే వడి శ్రీ వెంకట
ఘనుని మన్ననలు గైకొనెఁ గనక. ॥ ఇంత ॥ 119

## సామంతం

ఇంత యాల అంత యాల యేమాయ నిపు డిట్టె
పంతపు పతికడకె పదరాదా ॥ పల్లవి ॥

చెక్కిటిచేయి యేఁటికె చెలి నీ భావముచూడ
చక్కని తామెరమీఁదఁ జంద్రుఁ డున్నట్టు
యెక్కడి కెక్కడి పొందు లేమి గడించేవె
పక్కన పతికడకె పదరాదా ॥ ఇంత ॥

వున్నతిఁ గుచాలమీఁద ముసురనే విది యేమె
సన్నపుగాలి కొండల జడిసినట్టు
యెన్నటి కెన్నటి పొందు లిట్లైల సేసేవె
పన్ని నీ పతికడకె పదరాదా ॥ ఇంత ॥

చేరువఁ గాఁగిటిలోనఁ జెమరించే విది యేమె
చేరుముత్యా లిటునటుఁ జిందినట్టు
కోరి శ్రీవెంకటపతికూడి మేడ యెక్కెఁ గృపా
పారీణుఁ డాతనొద్దకుఁ బదరాదా. ॥ ఇంత ॥ 120

271-వ రేకు రామక్రియ

ఆడరాని చూడరాని యట్టి దొర వింతే కాక
యేడ నైనఁ జెలి నీకు నేమి సేసె నయ్యా ॥ పల్లవి ॥

కాంత నీకు సన్న సేసె కమ్మరఁ బూబంతి వేసె
సంతమై మరుకాఁకలఁ జలి గాసె
చెంత నీవు చూడఁగాను సిగ్గునఁ బయ్యద మూసె
యింతే కాక ఆకె నిన్ను నేమి సేసె నయ్యా ॥ ఆడ ॥

వలపు నీపై నించె వడిఁ బులకలు వెంచె
చెలప చెమట లవె చెక్కున ముంచె
నిలువు నీ చేఁతలకు నిట్టూర్పులఁ దలవంచె
యెలమి నిన్నాకె మరి యేమి సేసె నయ్యా ॥ ఆడ ॥

నీ యెదుటఁ దాఁ బొలసె నీటున నిన్ను సొలసె
కాయజకేలి నిన్నుఁ గదుఁ గలసె
పాయపు శ్రీవెంకటేశ పదఁతి నీతో వెలసె
యీయెడ నిందాఁక నాకె యేమి సేసె నయ్యా. ॥ ఆడ ॥ 121

కాంబోది

నేఁడుగా యివి తనకు నాఁడె పో నాకు
కూడిన మీరు సాకిరికొమ్మలాల ॥ పల్లవి ॥

తాలిమి లేక యిట్టె తనలోనె కోప ముంటె
నాలో నున్నవిగా నవ్వులు
సీలాన తనమాట చిరుచేఁదు లుంటేను
తేలెటి నా మోవిఁ గా తీపులు ॥ నేఁడు ॥

తెంపుల తనబొమ్మల తిట్ల సొలపు లుంటె
వంపు నా రెప్పలఁ గా వలపులు
యింపు లేక తనమతి నెగ్గులును తప్పు లుంటె
పెంపున నా కున్నవిగా పెను వేలిమొక్కులు. ॥ నేఁడు ॥

తమ్మి మరునేట్ల తనకు శమక ముంటె
చిమ్ముల నా కున్నవిగా సిగ్గులు
అమ్మరొ శ్రీవెంకటేశుఁ డన్నిటా నన్నుఁ గూడె
కుమ్మరించె నాపై కొనగోరిసొమ్ములు. ॥ నేఁడు ॥ 122

కాఁబోది

మున్నిటి తానెకాఁడా మోన మింకానా
కన్నులఁ జూచుట గాక ఘాత లింకానా ॥ పల్లవి ॥

మాయల వేరొకతెతో మాటలాడఁ గానె
చాయల నేఁ జేసే సన్న లింకానా
ఆయెడ నా రాక గని అటు తలవంచఁగాను
యేయెడ నే దూరి తిట్టే దిది యింకానా ॥ మున్ని ॥

విరహపు నన్నుఁ జూచి వికవిక నగఁగాను
సరస నా బొమ్మల జంకె లింకానా
సిరుల నాకె దన చెలియని బొంకఁగాను
నిరతి నిజము గొల్పే నీటు లింకానా ॥ మున్ని ॥

యెదుట నామోము చూచి యింటి కిట్టె రాఁగాను
కొదలు గొణఁగుల నా కోప మింకానా
అదన శ్రీ వెంకటేశుఁ డాదరించి కూడె నన్ను
కదిసి వుండుటె కాక కా దను టింకానా. ॥ మున్ను ॥ 123

వరాళి.

కంటి నే నంతలోఁ గడల మీ భావము
దంటలగు మీర లిద్దరు జాణలే ॥ పల్లవి ॥
పెడమరలి అటుచూచి పెదవులనె నినుఁ దిట్టి
పడఁతి మరలెను నీవు పై కొనినను
గొడఁగుచును బొమ్మలనె గొబ్బుననుఁ గోపించి
అడఁగి తలవంచె నీ వపు డేమి సేసితో ॥ కంటి ॥
తళుకునను నిన్నుఁ గనుఁదమ్ములనె జంకించి
బెళకి నిలిచెను నీవు పేరుకొనఁగ
వులికిపడి విన్ను నిట్టూర్పులనె కడుఁ గసరి
చెలుల మొరఁగెను నీవు చెనకఁగాను ॥ కంటి ॥
కొమ్మ కాఁగిటఁ గూడి కొనగోర నిను నడి(డి?)మి
వుమ్మడిఁ గమ్మరఁ దానె వూరకుండి
చిమ్ములఁ బూఁబొదరింట శ్రీ వెంకటేశ్వరుఁడ
నెమ్మది నుంటిరి కళలునిండె మోమునను. ॥ కంటి ॥ 124

సాళంగం

ఇందుకంటె నేమి సేతు నిదివో నేను
వొందిలిఁ దాఁ బిలిచితే నూఁకొననా నేను ॥ పల్లవి ॥
ఆనిపట్టి తనతో నలిగి వుందాననా
మోనానఁ దన కిప్పుడు మొక్కనా నేను
మానుపడి తనపొందు మానితినా తొల్లి టట్టె
కాను కియ్యనా నేఁడు కదనుండి నేను ॥ ఇందు ॥

గొంటుఁ దనమున నేఁ గోపగించు కుందాననా
వొంటిఁ దలవంచు కొద్ద నుండనా నేను
దంటనై నేఁ జలపట్టి దగ్గర కుందాననా
అంటు ముట్టు గలదాన నాద నుంటి నేను ॥ ఇందు ॥
కాంతుఁడు కొంగువట్టఁగాఁ గైకొన కుందాననా
అంతలోనె పరవశ మందనా నేను
చింత దీర నన్నుఁ గూడె శ్రీ వెంకటేశ్వరుఁడు
వింత సొబగుల విఱ్ఱవీఁగనా నేను. ॥ ఇందు ॥ 125

## సామంతం

విన్నవించనేల యిందు వేమారుఁ దనతో
యెన్నిక నేఁ జేసేదేమి యిఁకఁ దనచిత్తము ॥ పల్లవి ॥
చెప్పరాని చూపరాని చిత్తములో మర్మము
అప్పసము నాలోని అడియాస యిదిగో
కప్పియుఁ గప్పగరాని కన్నులలో మర్మము
దప్పి దేరిచే చక్కని తనరూపె పో ॥ విన్న ॥
పట్టియుఁ బట్టఁగరాని పాయములో మర్మము
ముట్టుపడ్డ పతిమీఁది మోహ మిదిగో
కుట్టియుఁ గుట్టఁగరాని కుచముల మర్మము
ఫొట్టఁ బొరుగున రేఁగే పులకలు వో ॥ విన్న ॥
అందియు నందఁగరాని ఆయముల మర్మము
సందడిఁ బరవశాల సంగతిదివో
కందువ శ్రీ వెంకటేశుఁ గలసిన మర్మము
గొందినె యీతని గోరిగురుతులె పో. ॥ విన్న ॥ 126

272-వ రేకు లలిత

చెల్లుఁ జెల్లు నీకు నాకు సిగ్గు మరఁగు
యెల్లభావము గంటి మిఁక నేల మరఁగు ॥ పల్లవి ॥

మోవిమీఁది కెంపులకు మోనమె మరఁగు
కావికన్నులకు నిద్ర కడు మరఁగు
తేవల నిట్టూర్పులకు తీగెనవ్వె మరఁగు
యీవిధాలు గంటి నాతో నిఁక నేల మరఁగు ॥ చెల్లు ॥

చెక్కులచెమటలకు చెంపచేయి మరఁగు
మిక్కిలిపులకలకు మెయిపూఁత మరఁగు
తక్కె మోము వాఁడుటకు తమ్ములము మరఁగు
యిక్కడ నిన్నుఁ గంటి నిఁక నేల మరఁగు ॥ చెల్లు ॥

కూడినకూటమునకు గుట్టు యిదె మరఁగు
జాడల నీ మేనికి నా చన్నుదోయి మరఁగు
వేడుకకు శ్రీ వెంకటేశ వేసాలు నీ మరఁగు
యీడ నిన్నుఁ బచ్చిదేరె నిఁక నేల మరఁగు. ॥ చెల్లు ॥ 127

## శుద్ధ వసంతం

ఎందు వోయీ నింతలోనే
యెందు నుప్పుచింది యినుమడీఁగాకా ॥ పల్లవి ॥

పంతమా నీతోఁ బలుమారును నీ
వెంత సేసినా నెరిఁగేము గాకా
వంతులా మారువడిఁ దిట్టను
అంతయు నొకపక్క నణఁగుండీఁ గాక ॥ ఎందు ॥

యెమ్మెలా నీతో నెదురాడను నీ
దిమ్ముఁ జేఁతలు దెలిసేము గాక
కమ్మరా నిన్నుఁ గాదనేమా
కిమ్ములా నిన్నుఁ గీర్తించేఁ గాకా ॥ ఎందు ॥

చలమా నిన్ను సాదించను నీవు
చెలిమిఁ గూడఁగాఁ జేకొంట గాకా
అలరు శ్రీ వెంకటాధీశుఁడా నీ
వలపుగాఁగిలె పైపాయఁ గాకా. ॥ ఎందు ॥ 128

కాంబోది

ఇంత చాలదా మాకు నిదినేఁడు
కంతునివోజల పెండ్లి గలిగెఁగా నేఁడు ॥ పల్లవి ॥

కాంతకును నీకును కనురెప్పలె తెర
దంతపు నవ్వులె మీకు తలఁబాలు
రంతుల పూరుపులె రవళి సోబనాలు
చెంతల మీకీ పెండ్లి చెల్లెఁగా నేఁడు ॥ ఇంత ॥

ముదితకు నీకును మోవులె బువ్వములు
కదియు సిగ్గులె మంచి కమ్మగందాలు
సదరపు సరసాలె చల్లు వెదపీదేలు
యెదురెదురనె పెండ్లి యెసగెఁగా నేఁడు ॥ ఇంత ॥

వుంచపు గోరితాఁకులె వుంకువ సొమ్ములు
ముంచిన పలు సోఁకులె ముఖికిముయి
యెంచఁగ శ్రీవెంకటేశ యిందిర నీకూటములు
కంచపుఁ బెండ్లి మీకుఁ గలిగెఁగా నేఁడు ॥ ఇంత ॥ 129

సామంతం

తగుమాట లేమిగల్లా దవ్వులఁ జెప్పుదుగాని
అగడయ్యీ నీవు నన్ను నంత దగ్గరకురా ॥ పల్లవి ॥

యెగరే జక్కవలు యిదివో నాకుచములు
గగనపు చకోరాలు కనుఁగవలు
తొగరుఁ దుమ్మిదలు నాతురు మిదివో నేఁడు
బెగడుఁ జేసు నన్ను బెట్టి పిలువకురా ॥ తగు ॥

కొండలసింహము నా కొనబైన నడుము
గండు మీరి నా పిరుఁదు కరికుంభాలు
నిండిన నా పాదములు నీటిలోని తాఁబేళ్ళు
చండిపడ నీవు నన్ను సారెఁ జెనకకురా ॥ తగు ॥

మించులమెఱుఁగు లివి మేఁటి నాతనువు
దించని తేనెల పెరతీపు నా మోవి
అంచల శ్రీ వెంకటేశ అంతలోనె కూడితివి
యెంచఁగ నిన్ను మరిగె నిన్నిటాఁ బాయకురా. ॥ తగు ॥ 130

ఆహిరి

అయ్యో తా నేమనీ నప్పటిఁ దాను
పయ్యదలో సిగ్గు దాఁచి బడలఁగాను ॥ పల్లవి ॥

చూపులనె గుండె వట్టి సుద్దులనె మిన్ను ముట్టి
దాపు సేసుకొని తన్నుఁ దలఁచఁగాను
తీపు మేలములఁ జిక్కి దిక్కులఁ దనకు మొక్కి
తోపు నూకుడు వయసు దొబ్బఁగాను ॥ అయ్యో ॥

ఆసఁ బులకలు వెంచి అంగము చెమట ముంచి
బాసలు తనవి నమ్మి బతుకఁ గాను
వాసికిఁ దనువు మోచి వంతుకుఁ బ్రాణముగాచి
వోసరించి వూరకె నే నుండఁగాను ॥ అయ్యో ॥

తానె నే నని యాడి దగ్గరి కాఁగిటఁ గూడి
నానిన నవ్వులు గుట్టునడపఁగాను
యీ నెపాన శ్రీ వెంకటేశుఁ డింతలో నన్ను
పూనుక మన్నించె నని పొగడఁగాను. ॥ అయ్యో ॥ 131

బౌళి

మేఁటులాల బోఁటులాల మీ రెఱఁగరా నన్ను
నీటునఁ దా నొద్ద నుండె నేర మెంతునా ॥ పల్లవి ॥

మోము చూడఁగా నేను మొఱఁగి నవ్వితిఁ గాక
తా ముందు వూరకుండెఁ దడవితినా
ప్రేమమునఁ బిలువఁగా బెట్టి వూఁకొంటిఁ గాక
దోమటిఁ దడవకుండె దొమ్మి సేతునా ॥ మేఁటు ॥

చెక్కు నొక్కఁగా నే జీర వారించితిఁ గాక
చక్క నుండెఁ దన్ను నే సాదింతునా
నిక్కి పూవుల వేయఁగా నీటునఁ దిట్టితిఁ గాక
మిక్కిలి గుట్టున నుండె మితిమీరుదునా ॥ మేఁటు ॥
బలిమిసేయఁగఁ దన్నుఁ బైకొని కూడితిఁ గాక
చలమునఁ బంత మండె సాగనిత్తునా
యెలమి శ్రీ వెంకటేశు నింపులఁ జొక్కితిఁ గాక
తలఁ పెరఁగక వుండె దగ్గరుదునా. ॥ మేఁటు ॥ 132

273-వ రేకు శుద్ధవసంతం

చాలుఁ జాలు నేతులు సటలు నీ రీతులు యీ
నీలిచేఁతపతిఁ గాక ని న్నేమనేదే ॥ పల్లవి ॥
వద్దేటె మాటలు వలవని నీటులు
వొద్దనె నే మింతలేసి కోపుదు మటే
యిద్దరిలో నినుఁ బెంచి యింత సేసె నాతఁడు
నిద్దమై యాతనిఁ గాక ని న్నేమనేదే ॥ చాలు ॥
ఔనె నీ సుద్దులు ఆడెటి బద్దులు
వూని యింతలేసికి నే నోపుదునటే
యీ నీకుఁ జన విచ్చి యింత సేసె నాతఁడు
నే నింకా నాతనిఁ గాక ని న్నేమనేదే ॥ చాలు ॥
పోపో నీ కతలు పోకుల నీ గతులు
వూఁపుల రాఁపుల నే నోపుదు నటే
యేపున శ్రీ వెంకటేశుఁ డింతలో నన్నుఁ గూడె
నీ పొందులాతనిఁ గాక ని న్నేమనేదే. ॥ చాలు ॥॥ 133

సామంతం

చాలుఁ జాలుఁ బొగడకు జాణకాఁడే
నాలి నేఁ దనిసితిఁబో నాఁడు నాఁడే ॥ పల్లవి ॥

తనకు వలచినట్టి తరుణి సూర్పనకను
  పెను ముక్కుగోసిన బీరగాఁడే
మునుపనె వుపకారమున నున్న జలి నట్టె
  పనివడి కట్టినట్టి పంతగాఁడే ॥ చాలు ॥

కోరి తన్నుఁ గూడినట్టి గొల్లల మానములు
  మేర మీరి చేకొనిన మేటివాఁడే
కౌరవులఁ బాండవులఁ గడుఁ జుట్టాల నెల్ల
  పోరువెట్టి యంపినట్టి పుణ్యపువాఁడే ॥ చాలు ॥

నిండు వురమున నింతి నిలిపి శ్రీ వెంకటాద్రి
  కొండమీఁద నెక్కుకొన్న కోడెకాఁడే
అండ నిట్టె నన్నుఁ గూడి ఆయము లంటి మెప్పించి
  దండియై మెరసినట్టి దైవపువాఁడే. ॥ చాలు ॥ 134

ముఖారి

పదిలమై వుండుగాని పదరకుమీ
  వెదకితేఁ జూపవలె వెసఁ జుమ్మీ విభుఁడ ॥ పల్లవి ॥

అందపు నీ మోవితేనె లాని యాని యెవ్వతో
  అందుపైఁ గెంపులు నించె నదె చూడుమా
పొందుల నదెవ్వరికి పొరసి నీ వియ్య కుండా
  కందువ మెత్తులు వేయు గతి సుమ్మీ విభుఁడ ॥ పది ॥

చక్కని నీ దేహమంటి సారె సారె నెవ్వతో
  అక్కడ రేకలు నించె నది యెవ్వతో
గక్కన వేరొకతెకుఁ గాఁగిలి నీ వియ్యకుండా
  లెక్కల లచ్చెనవెట్టే లీల సుమ్మీ విభుఁడ ॥ పది ॥

కూరిమి నీ రతిఁ గూడి గురుతుగాఁ గుచముల
  కోరి ముద్ర లురమునఁ గుంకుమ నొత్తె
ఆరీతి శ్రీ వెంకటేశ అరమరపించినది
  నేరుపరెవ్వరుఁ గాదు నేఁ జుమ్మీ విభుఁడ. ॥ పది ॥ 135

ముఖారి

ఇంత సేసినట్టి పతి నే మందమే
మంతుకు నెక్కించినట్టి మనసు నే మందమే ॥ పల్లవి ॥

చెక్కునఁ బెట్టెను చేయి చిత్తములోపలి నూయి
యిక్కడ నీసతి భావ మేమందమే
ముక్కునఁ గీలించె వేలు మొనగోర నదె వ్రాలు
మక్కువ యింతసేసిన మరుని నే మందమే ॥ ఇంత ॥

కన్నుల నించెను నీరు కలిగెఁ బయ్యదజారు
యెన్నఁగ నీ యింతిమోహ మే మందమే
పన్నుకొనె నిట్టూర్పు పారదోసె తన నేర్పు
యిన్నిటాను నోముఫల మిఁక నే మందమే ॥ ఇంత ॥

చెలిపై వేసెను మేను సిగ్గుల మునిఁగెఁ దాను
యెలమి నీ చెలి మర పేమందమే
అలరి శ్రీ వెంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
తలఁపు ప్రేరేఁచినట్టి దైవము నే మందమే. ॥ ఇంత ॥ 136

శంకరాభరణం

ఏమి నెరఁగని బాల నేమి సేసితివో
ఆమని కాలములోనె అది యేమి సేసితో ॥ పల్లవి ॥

కన్నుఁ దెల్లఁ దెల్లనాయ కాయ మెల్లఁ జల్లనాయ
కన్నె నేమి సేసితివో కట్టా కట్టా
వన్నె మేనఁ జంజురేఁగె వాడుమోవి గడు మాఁగె
ఇన్నాళ్లవలెఁగాదు యేమి సేసితివో ॥ ఏమి ॥

కొప్పు గడుఁ జిక్కువడె కుచములు తొక్కువడె
అప్పటి నేమిసేసితి వయ్యో అయ్యో
చిప్పిలె నిట్టూరుపులు సిగ్గులివె గొరుపులు
యిప్పు డిట్టె యీ సతి నేమి సేసితో ॥ ఏమి ॥

చెక్కు లెల్లఁ జెమరించె సెలవుల నవ్వు ముంచె
 వొక్కమాటె యింత సేసి తోహో వోహో
 నిక్కి శ్రీ వెంకటపతి నీవు గూడఁ దోలుదువు
 యెక్కువ మేనిగుతురు లేమి సేసితో. ॥ ఏమి ॥ 137

కాంబోది

అంత నింత నుండి ఆనవెట్టీ రమణుఁడు
 అంత లేదుగా నాకు నాయము సోఁకీని ॥ పల్లవి ॥

బొనె తనకు నాకు నంత పొందా తొలినాఁడు
 నానిన వలపులతో నవ్వ వచ్చీని
 పోని పోని వుప్పువేసి పొత్తు గలయ వచ్చీని
 నే నోపఁగా యింతేసికి నిద్దుర వచ్చీని ॥ అంత ॥

లేలె తనగుఱుతు చెప్పగా నెఱుఁగుదునా
 వేళ గాదన్నా బందెలు వేయ వచ్చీని
 చాలుఁ జాలు వెలువెట్టి సారె నిమ్ము గొనవచ్చీ
 తాలిమి లేదుగా నన్నుఁ దల్లి విలిచీని ॥ అంత ॥

నావె తాసూ నేను రతి నే పూరు కేపూరు
 కోవరము నిన్నుఁ బెట్టి కొంగు వట్టీని
 శ్రీ వెంకటేశ్వరుఁడు చెక్కు నొక్కి నన్నుఁ గూడె
 వావులఁ దోదుగా నాకు వాసులు వుట్టీని. ॥ అంత ॥ 138

274-వ రేకు సామంతం

ఊరకె తా నుండ దట్టె నుండుఁగాక
 లారుకాణ లైనమీఁదఁ దగవుఁగొంతా ॥ పల్లవి ॥

తనకేమె నాలోనఁ దల వంచు కొంచేను
 నమపులేని చోట నవ్వఁ బొయ్యేదా
 అననేలె నన్ను సారె నవ్వలిమో మైతి నంటా
 చనవులేని చోట సలిగెఁగొంతా ॥ ఊర ॥

చింత యాలె తనకు నేఁ జెక్కిటఁ జే యిడు కొంటే
సంతముగానిచోట సరసములా
యింత యాలె యడమాట లేకతాన నే నుంటే
పంతగాఁడు తాను నేఁ బచరించఁ గలనా ॥ ఊర ॥

వలపు చల్లఁగ నేలె వంతుకు నే నలిగితే
చలము సాధించఁగాను జాణతనాలా
యెలమి శ్రీ వెంకటేశుఁ డింత చేసి నన్నుఁ గూడె
కలసిన మీఁద నింక కపటములా. ॥ ఊర ॥ 139

## కాంభోది

చూచితిఁ దనసరిత సుద్దు లేఁటి కో యమ్మ
చేచేత నిఁక బొంకఁ జెల్ల దో యమ్మా ॥ పల్లవి ॥

జడిసి లోఁతుమాటల జాణతనా లాడీ నన్ను
తడవితేఁ దలదీసి తక్కించీ నమ్మ
చిడుముడి చుల్లరపు నేఁతల మమ్ముఁ జెనకీ
పడుచుమాటలవాని పస యేఁటిదమ్మా ॥ చూచి ॥

ఆరీతి నాఅడిఁబెట్టి యంతటో నదుగుకొనీ
గోరఁ బొయ్యేదాని కింత గొద్ద లేలమ్మ
సారెకు మాటపట్లు సాదించి నడచీని
తీరకుండా జగడాలు తిద్దఁబొయ్యీ నమ్మా ॥ చూచి ॥

పొందుగానిమతకాల బోదించ వచ్చీని
యింవరిలో నెక్కుడాయ నిఁక నేలమ్మా
అందపు శ్రీ వెంకటేశుఁ డాదరించి కూడె నన్ను
నింద లెల్లఁ బాసె నింక నెమ్మదినే యమ్మా. ॥ చూచి ॥ 140

## వరాళి

నేఁడు రేపుఁ జూతు గాని నిలరా నీవు
వాఁడి వాఁడి నా గోరు వద్దురా నీవు ॥ పల్లవి ॥

చేసన్న సేమి గల్లాఁ జెప్పి చూపుదువు గాని
మాసిన చెరఁ గంటక మానరా నీవు
మూసి మరఁగుల కెల్లా ముందట మొక్కుదు గాని
దోసముబంట ననక తొలరా నీవు ॥ నేఁడు ॥

యేమి పని గలిగినా నింతుల నంపుదు గాని
రామలకుఁ గల దింతె రాకురా నీవు
నామీఁద మోహము గత్తె నవ్వులు నవ్వుదు గాని
మోముచూడ సిగ్గయ్యీని మొనసేవు నీవు ॥ నేఁడు ॥

కూట మిది యంత గల్లా గుట్టున నుందువు గాని
పోటిఁ గోల నాడితేనె పోకురా నీవు
మేటివై శ్రీ వెంకటేశ మెచ్చుగాఁ గూడితి విట్టె
గాఁటాన నే నంటి నింతె కల్ల సుమ్మీ నీవు. ॥ నేఁడు ॥ 141

సాళంగం.

నవ్వవొద్దా యిందుకుఁగా నాకు నాకె నిన్నుఁ జూచి
యివ్వలనెయింత సేసే వేలయ్య నాయకుఁడ ॥ పల్లవి ॥

చూడవొద్దా ఆకె నిన్నుఁ జూచి సారె మొక్కఁగాను
యేడ నన్నా సిగ్గువడే వింత దగునా
ఆడవొద్దా మారుమాట ఆకె నిన్నుఁ బిలువఁగా
యేడో పరాకయ్య(య్యే?) వేలయ్య నాయకుఁడ ॥ నవ్వ ॥

చేరవొద్దా మగువను చెనకి సరసమాడ
కూరిమి దెలిసేరంటా గుట్టు సేసేవు
మేరమీరవొద్దా ఆకె మెచ్చి చెయి వేయఁగాను
యీరీతి వొలసీ నొల్లా లేలయ్య నాయకుఁడ ॥ నవ్వ ॥

కప్పవొద్దా పచ్చడము కాఁగిలించి కూడఁగాను
దప్పి దేరె మోవితేనె దగ దొట్టేవు
వొప్పుగా శ్రీ వెంకటేశ వుండవొద్దా రాజసాన
యిప్పుడే పెండ్లాడి తింత యేలయ్య నాయకుఁడ. ॥ నవ్వ ॥ 142

ఆహిరి

నేతునో నీ మేన నెల్ల జీరలుగాను
ఆతల సూడువట్టే దదె చూచేఁ గాని ॥ పల్లవి ॥

తెప్ప లెత్తి చూచితేనె తేసు పుట్టె నిదె నీకు
దుప్పటి కొంగు వట్టితే దూర కుండేవా
చొప్పుగానా యించుకంతఁ జూతమువో యిఁక నేల
కప్పిన నీ బింక మెల్లఁ గనుఁగొనేఁ గాని ॥ నేతు ॥

కవ కవ నవ్వితేనె కాఁగిపదే విప్పు దిట్టె
తివిరి కాలు దాఁకితే తిట్ట కుండేవా
వివరించి అది వెల్లవిరి నేతునో వోరి
అవల నీతో జగడమైన నయ్యీఁ గాని ॥ నేతు ॥

ఆయము లంటఁగఁ బోతే ననుమానించే వందుకు
చేయి వేసి కూడితేను చిక్క కుండేవా
చాయల శ్రీ వెంకటేశ సమ్మతించి కూడితివి
నేయఁగలవి నేతునో చేరి మొక్కేఁ గాని. ॥ నేతు ॥ 143

ముఖారి

దొర వైతె నింతలోనె దోసమా యేమి
గరిమ మా వినయాలు కానివా యేమి ॥ పల్లవి ॥

మలసి యీడా నాద మాట లాడకున్న నేమి
తొలుతె యింటికిరాను దోసమా యేమి
తలఁపిట్టె వుండిన దగ్గరక మానేవా
కలపుకోలుఁదనము కానిదా యేమి ॥ దొర ॥

వడిఁ జుట్టాలముగాచూ వావి చెడ మందు గద్దా
కడు మమ్ము మన్నించితే కానిదా యేమి
కడకన్నులఁ దేలించి కాఁక రేఁచకున్న నేమి
తొడఁగి విడె మందితే దోసమా యేమి ॥ దొర ॥

చేరి చేరి బుజముపైఁ జెయి వేయకున్న నేమి
దూరక కాఁగిలించితే దోసమా యేమి
యీరీతి శ్రీ వెంకటేశ యిక్కువ నుండి కూడి
గారవించితివి యిది కానిదా యేమి. ॥ దూర ॥ 144

275-వ రేకు పాడి

చుట్టపువరుసఁ గొంత చూచిఁ గాక
అట్టె యే మన్నా నెదురాడేవా నీవు ॥ పల్లవి ॥

అలిగి రాకుండఁగాను అనలె పెట్టెఁ గాక
చెలి నిన్నుఁ దిట్టితేను చెల్లదా నేఁడు
వులివచ్చి సిగ్గుతోడ నూరకున్న నుండెఁ గాక
చలివాయఁ జెనకితే జంకించేవా నీవు ॥ చుట్ట ॥

పంతము నీ వాడఁగాను పాడియె నడపెఁ గాక
కాంత యేది దలఁచినాఁ గాక మానీనా
జంతతనమేలంటాఁ జక్కనుంటె నుండెఁ గాక
చొంతిగాఁ బై నొరగితే దూరేవా నీవు ॥ చుట్ట ॥

చెక్కు నొక్కి కూడఁగాను నెలవినె నవ్వెఁ గాక
చుక్కలు మోవి నించితే సూడు వట్టేవా
యెక్కువ శ్రీ వెంకటేశ యింతి నీతో నొక్కటాయ
మక్కువ నీ మేలింకా మరచేవా నీవు. ॥ చుట్ట ॥ 145

దేసాళం

మంచివానివలెనె మాట లాడీనె
యించుకంతా నెరఁగఁడు యేడవాఁడే తాను ॥ పల్లవి ॥

తీపులపెదవి వంచి తిట్టినా మానఁడు నేఁ
గోపగించు కొనఁగానె కొల్లున నవ్వీనే
రాపుగా నానలు వెట్టి రాకు మన్నా మానఁడే
వోపనని రాఁగా నా వొద్దికి వచ్చీనే ॥ మంచి ॥

గొణఁగి గొణఁగి లోలో గుంపించినా మానఁడే
అణఁగి నిద్దిరించఁగా నాయ మంటె(టీ?)నే
వొణికెవేసుక నే నూరకున్నా మానఁడే
సణఁగు లాడఁగ వేరె సాకిరి వెట్టీనే ॥ మంచి ॥

వెఱతు మనుచు మొక్కి వేసరినా మానఁడే
కలకు లాడేవేళ కాఁగిలించీనే
వులక శ్రీ వెంకటాద్రినుండి వచ్చి నన్నుఁగూడె
మొఱఁగి వావిలిపాటి ముద్దురామచంద్రుఁడే. ॥ మంచి ॥ 146

ముఖారి

ఎంత మొగమాయకాఁచో యేమో కాని
యింతులార వెర గైతి మీఁక నేమో కాని ॥ పల్లవి ॥

మొదల నేమైనఁ జేసి ముందట నీవుండితేను
యెదురు మాటాడఁజాల నేమో కాని
పెదవి కెంపులు రేఁగబెట్టి నాతో నవ్వితేను
యిదివో నే భ్రమసితి నిఁక నేమో కాని ॥ ఎంత ॥

కొయ్యతనా లెల్ల నాడి కొంగువట్టి తీసితేను
యియ్యకొంటిఁ బనులకు నేమోకాని
పయ్యదపైఁ జెయి వేసి పచ్చితిట్టు దిట్టి తేను
నెయ్యమునఁ గరఁగితి నే నిదేమో కాని ॥ ఎంత ॥

పంతము లిన్నియు నాడి బలిమిసేసి కూడితి(తే?)
నింతలోఁ బంత మిచ్చితి నేమో కాని
వంతుకు శ్రీ వెంకటేశ వలపించి నందు కెల్ల
మంతనాన లోనైతి మరి యేమో కాని. ॥ ఎంత ॥ 147

వరాళి

మేలుగలవారి కెల్ల మీఁద మీఁద నాస లిట్టె
చాలుకొనుఁ గాని మరి చాలించ దెంతైనా ॥ పల్లవి ॥

గక్కనఁ జూచిన చూపు కాంక్ష దీర దెంతైనా
కిక్కిరించి మఱియు మగిడి చూడకా
చొక్కుచు రెప్పవేయక చూచినాఁ దనివోదు
తక్కక ఆరూపె మతిఁ దలపోయకుండినా ॥ మేలు ॥

అంది వొకమా టాడితే నంతటఁ దీరదు తమి
మందలించి అట్టె మారు మాటాడకా
పొంది ముచ్చటాడినాఁ బోవు కోరిక లన్నియు
కందువఁ జెలులతో కతలు తాఁ జెప్పకా ॥ మేలు ॥

కన్నప్పుడె వొకమాటు కలసినా సొంపులేదు
యెన్నికఁ బెక్కుగతుల నెనయకా
యిన్నిటా శ్రీవెంకటేశుఁ డెరిఁగిన జాణ గాన
నన్నుఁ గూడె నివి నాలో ననుపు గాకుండదు. ॥ మేలు ॥ 148

ముఖారి

ఒయ్యనె విన్నవించరె వొద్దనున్న పతిఁ జూపి
నెయ్యపునివ్వెరగుతో నిలుచున్నాఁ డితఁడు ॥ పల్లవి ॥

తలపోఁత చింత యెంతో తరుణివిరహ మెంతో
చెలువుఁడె వచ్చి పిలిచినా నెరఁగదు
తొలుతె వియోగముతోనె అలసెఁ గాన
నెలువంక నిజ మాడినా నమ్మదు ॥ ఒయ్య ॥

నిట్టూర్పుగములతో నెరుల చెదరుతోడ
పట్టి కళ లంటినాఁ బతికడ చూడదు
యిట్టె యెదుట చూచి యిందాఁక వేసారెఁగా
గట్టిగా నెదుర నున్నాఁ గల్ల లంటా నున్నది ॥ ఒయ్య ॥

విపులపానుపుమీఁద వెడఁజారుఁ బయ్యదతో
సరుసఁ బండిన పతిచందము దెలియదు
శిర సెత్తి యిదె కూడె శ్రీవెంకటేశ్వరుఁ
డరుదైన కల గంటి నంటా నాడీని. ॥ ఒయ్య ॥ 149

మధ్యమావతి

ఆమాట మీ రెఱఁగ రాతఁడె కాని
తామసించి నాడనుండె తన కేలె వెఱవు ॥ పల్లవి ॥

విచ్చేయు మనవె విభుని నిక్కడికె
యిచ్చటనె విన్నవించే నేమి గల్లాను
ముచ్చట దీరదు తనమొగము చూచినదాఁకా
తచ్చివేసి నేనుండఁగ తన కేలె వెఱవు ॥ ఆమా ॥

తప్పక చూడు మనవె తా నిట్టె నాదిక్కు
యిప్పుడె మంచిది సేసే నేమి గల్లాను
దప్పివోదు నేఁడు నాకు తనతో మాటాడుదాఁకా
తప్పు లెల్ల వొప్పు లయ్యీ తన కేలె వెఱవు ॥ ఆమా ॥

తలఁచుకొమ్మనవె తనపొందు నాపొందు
యెలమిఁ గాఁగిటఁ దీర్చే నేమి గల్లాను
అలమె శ్రీవెంకటేశుఁ డందుకే మెచ్చినదాఁకా
తలవంచుకున్నాఁడు తన కేలె వెఱవు. ॥ ఆమా ॥ 150

276-వ రేకు ముఖారి

ఎవ్వరికిఁ గలదురా యిటువంటి యనుభవత.
యివ్వల నీ వాకెవలె నిటు నోమవలదా ॥ పల్లవి ॥

కంకణాలచేత నీ కరమప్పళించి చెలి
అంకెలఁ గుచాలమీఁద నది మదిమీ
తెంకిఁ గూచుండి కన్నులు తేలవేసి నిన్నుఁ జూచి
కొంకక నీ చెవిలోనఁ గూరి మేమో చెప్పెరా ॥ ఎవ్వ ॥

వుంగరపువేళ్ల నిన్ను నువిదచెక్కులు నొక్కి
యెంగిలిపొత్తాకు మడి చిచ్చి యిచ్చి
పొంగెటి పులకలతో పొందు చూపి మాటాడి
సంగతిగాఁ గాఁగిలించెఁ జాలదా యీ భాగ్యము ॥ ఎవ్వ ॥

విలువుఁ బయ్యదవేసి నీపైఁ బాదము చాఁచి
నలువంకఁ దొడలఁ బెనచి పెనచి
మెలమి శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ దెత్తవేసి
కలసె నిన్నాకె అంతకంటెరా నేను. ॥ ఎవ్వ ॥ 151

శంకరాభరణం

నీవు చల్లఁగాబదుకు నీకేల యీగొడవ
నీవలపులకు నెల్ల నేనే గురి ॥ పల్లవి ॥

చెక్కునొక్కకురా నాచెమట నీచేతనంటీ
గక్కన నీకుఁగాసైన కరఁగులివి
యెక్కువ నాతాపము నీవేల కట్టుకొనేవు నేఁ
బుక్కట నాలో నేపైపైఁ బొరలేఁగాని ॥ నీవు ॥

కాఁగిలించకురా నాకాఁకల నీమేనువాఁడీ
తీఁగెల నీవల్లనైన తేజమ్ములివి
నీఁగని నాఘర్ములిదె నీవు ముట్టుకొననేల
ఆఁగి నేనె పొట్టువోరలయ్యేఁగాని ॥ నీవు ॥

నామోవి యడుగకురా నానలేదు కడునెండె
వేమరు నీవల్లనైన వెట్టలివి
ఆముకొని శ్రీవేంకటాధిప కూడితి వింక
సోమరినై నాలోనె చొక్కేఁగాని. ॥ నీవు ॥ 152

దేసాళం

కాంత నీవు గూడఁగా నేఁగంటి నేలలోఁగేవు
వింతగాఁ గంటికిఁ జూపు వేరయ్యీనా ॥ పల్లవి ॥

నీవు నాకుఁ జుట్టమవై నిలిచినాఁడవుగాన
నీవద్దియింతులు నాకు నెమ్మిఁ జుట్టాలె
పూవులుముడిచితేను పూవులలోవాసనలు
వేవేలుచెప్పినాను వేరయ్యీనా ॥ కాంత ॥

నీమనసు నామనసు నిక్కమూ నొక్కటె కాన
కామించిన నీపనులు కాదన నేను
దీమసాన సొమ్ము లెల్ల దేహమున నించుకొంటె
వేమరు వానికాంతులు వేరె వుండీనా ॥ కాంత ॥

యెప్పుడూ నీ నా ప్రాణా లేకమయ్యేవుండుఁగాన
యిప్పటి నీజాడలెల్లా నితవె నాకు
అప్పటి శ్రీవెంకటేశ ఆయమంటి కూడితివి
విప్పరాని చనవులు వేరయ్యీనా. ॥ కాంత ॥ 153

కేదారగౌళ

ఆసుద్దులేల తడవే వాయలేవయ్య
నేసితిని చెప్పినట్టె చేకొనవయ్యా ॥ పల్లవి ॥

వున్నతి నీవద్దఁ బాయకుండినదె నేరుపు
నిన్నుఁబాసి వుండినదె నేరమి
అన్నియు నిన్ను వెనక ననఁగానేమి
చెన్నుమీరె గతజలసేతుబంధాలు ॥ ఆసు ॥

సరి నిన్నుఁ బొగడేదె జాణతనము
కరి కరిఁబెట్టేదె గబ్బితనము
యెరవెల్లఁ బాసె దిఁకనేమి
మరలి వెదకు టెండమావులనీళ్లు ॥ ఆసు ॥

చక్క నీమోము చూచుటె సరసము
వెక్కసపు మారుమోమె విరసము
గక్కన శ్రీవెంకటేశ కలసితివి
యిక్కువ లన్నియు నింక నింటిలోనిధానము. ॥ ఆసు ॥ 154

సాళంగనాట

ఆసోదకాఁడవో అన్నిటా జాణవో
వాసితో నే నుండితేను వలచి వచ్చేవూ ॥ పల్లవి ॥

సీతోడి చలమా నిన్ను దూరఁగలమా
చేతులెత్తి మొక్కిన దించిక వెంగెమా(?)
కాతరించ నిన్న మొన్న కాఁగిలించఁగలమా
యీతల నే రానంటె యింతలోనె కడమా ॥ ఆసో ॥

దండినేఁ జైతరవా తగునె నీకెరవా
నిండుకొనె వుండితేనె నీకు నగవా
పెండెమిచ్చి నన్నిందాఁకాఁ బిలిపించుకొనవా
వుండినట్టె వుండితేను వొళ్లిగర్వమనవా ॥ ఆసో ॥

కూటమి నేఁడరుదా కొసరితే బిరుదా
యీటున మనలో నేఁడింత గలదా
గాఁటపు శ్రీవెంకటేశ కలసితి మిట్టెకాదా
నాఁటిసుద్ది దడవితే నను మెచ్చవలదా. ॥ ఆసో ॥ 155

మంగళ కౌశిక

నేమెంతేసివారమైనా నిన్ను మీరఁగలమా
కామించి నీవు వచ్చితేఁ గైకొనేముగాకా ॥ పల్లవి ॥

నేరుపులు చరించ నీతోడఁ జెల్లునా
వూరెల్లాఁ జుట్టాలఁ జేసుకుండఁగాను
భారపు పైఁడికొండలో బచ్చుబేరా లమరునా
వూరకె నీమేలు గోరుకుండు టింతెకాకా ॥ నేమె ॥

తమిరేఁచేమని నిన్ను దగ్గరఁగఁ జెల్లునా
గములైన సతులతోఁ గరఁగఁగాను
భ్రమసి రేపల్లెవాడఁ బాలమ్మితే సరకౌనా
ప్రమదాన నీకు మొక్కి బ్రదుకుటగాకా ॥ నేమె ॥

ఆవటించి నీకు నేఁ బ్రియాలు చెప్పఁ జెల్లునా
వేవేలురతుల నీవె వేఁడుకోఁగాను
వావిరిఁ బువ్వులకును వాసనలు గట్టుదురా
శ్రీవెంకటేశ కూడితి చెక్కునొక్కేఁగాకా. ॥ నేమె ॥ 156

277-వ రేకు మధ్యమావతి

సారెకు వలవఁ బోతే చప్పనేకాదా
వూరకుండేవారిఁగంటే వొత్తరాదా నీకు ॥ పల్లవి ॥

మొగము నేఁ జూచితేను ముంచి నీవు నవ్వితివి
యెగసక్యానకో కాక యేపనికో
తెగి అంతేసి లోఁతులు తెలుసుకొ నెరఁగవు
పగటున నేము నగుఁబాటుగాదా నీకు ॥ సారె ॥

పొంత నేఁ గూచుండితేను పొనిగి చోటిచ్చితివి
యెంత వొల్లఁబె(బా?)ట్లోకాక యేమిటికో
వింతగా నంతేసి వెల్లవిరిసేయ నెరఁగవు
యింత దగ్గరితే యెడమియ్యవొద్దా నీకు ॥ సారె ॥

సరసము నే నాడితే సరుగఁ గాఁగిలించితి
విరవుగా నెరిఁగితి వేమిటికో
గరిమ శ్రీ వెంకటేశ కలసితి విదెరఁగ
సరుసకు వచ్చితేనె సందుగాదా నీకు. ॥ సారె ॥ 157

దేసాక్షి

ఒక్కరి కొకరు లోనై వుండుటగాక
చక్కట్లు చెప్పఁబోతే సమ్మతౌనా సుద్దులు ॥ పల్లవి ॥

మచ్చర మేమిటికమ్మ మగవాఁడు నీతోద
తచ్చనలు నెరపితే తరిఁ జెల్లదా
ముచ్చటలు మీరాడరా ముందరను వెనకకు
యెచ్చుకుందులు వట్టితే నెనసీనా పొందులు ॥ ఒక్క ॥

చలము లేమిటికమ్మ సరసుఁడు నీతోను
సొలయుచు నవ్వితేను సొంపుదప్పునా
కలయరా యిఁక మీరు కలనైన వెలినైన
కలఁగి తేరఁగఁబోతే గట్టియవునా పనులు ॥ ఒక్క ॥

యెగ్గు లింకేమిటికమ్మ యిదె శ్రీవెంకటేశుఁడు
వెగ్గళించి నిన్నుఁ గూడె వేసటలౌనా
నిగ్గులు చనవు లీరా నేఁడైన నాఁడైన
సిగ్గులు నెరపఁబోతే చెందునా కోరికలు. ॥ ఒక్క ॥ 158

పాడి

అన్నిటాను జాణఁడు అప్పటి నెరఁగఁడు
చిన్నదాన మీకు(రు?) బుద్ధిచెప్పరె యీతనికె (కి?) ॥ పల్లవి ॥
ముల్లుచూప తొలుతేల మొక్కి తలవంచనేల
వొల్లనె యప్పటి జాడ నుండరాదా
చుల్లరపు సేఁతలేల సుదతికిఁ జిక్కనేల
జెల్లుబడిగా బుద్ధులుచెప్పరె యీతనికి ॥ అన్ని ॥
వట్టి కపటములేల వాకిలి గావఁగనేల
చుట్టరిక మట్లానె చూపరాదా
మట్టులే కలుగనేల మరి వెదకఁగనేల
చిట్టకముదీర బుద్ధిచెప్పరె యీతనికి ॥ అన్ని ॥
మానినుల పొందులేల మాకుపడివుండనేల
కానీపె బుద్దెరఁగఁడా కలికిగాఁడా
ఆనుక శ్రీవెంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
సేనలుగా యిఁక బుద్ధిచెప్పరె యీతనికి. ॥ అన్ని ॥ 159

దేసాళం

ఎక్కడఁ జూచినఁ దానై యీతఁడున్నాఁడు
వెక్కసపు మనపాలి విష్ణుదేవుఁడు ॥ పల్లవి ॥
చూడరె పదారువేలు సొరిది యిండ్లలోన
వేడుక నన్నిరూపులై విఱ్ఱవీఁగీని
జాడతో దేవతలకు జలనిధి దచ్చి తచ్చి
పాడితోడ నమృతము పంచిపెట్టీని ॥ ఎక్క ॥

మొక్కరె రేపల్లెలోన ముంచి యాలమందలలో
నక్కడ గోపాలులతో నాటలాడీని
దిక్కులు సాధించి తనదేవుల నండఁ బెట్టుక
రెక్కల గుఱ్ఱముపై పేరెముదోలీని ॥ ఎక్క ॥
సేవలెల్లాఁ జేయరె శ్రీవెంకటాద్రిమీఁద
వావిరి నందరికిని వరాలిచ్చీని
ఆవల నీవలఁ దానె అంతరాత్మ యిందరికి
భావాలలోన విశ్వరూపముచూపీని. ॥ ఎక్క ॥ 160

సామంతం

నీకేల వెరపు నీవూ నేనూ నొక్కటే
కోకొమ్మని విడెమిచ్చీఁ గొంకకువయ్యా ॥ పల్లవి ॥
ముందరనె నిలుచుండి ముసిముసి నవ్వునవ్వి
కందువలు నీకుఁ జూపీఁ గలికి యదే
అందుకు నీవెఱఁగక అంకెలకు రాకుండితే
విందులు చెప్పి పిలిచీ వినవయ్యా ॥ నీకే ॥
చాయలకు మాటలాడి సరసముఁ గొంతచూపి
చేయి నీపై వేసీని చెలియ యిదే
నీయంత సన్నెరఁగక నిండుకొని వుండితేను
ఆయములు గోరనొత్తీ నదె కదవయ్యా ॥ నీకే ॥
కన్నులఁ దప్పకచూచి కరఁగుచు నట్టె మెచ్చి
కన్నె నిన్నుఁ గూడె శ్రీవెంకటవిభుఁడా
యెన్నికై కడపలోన నిట్టె నన్నుఁ గూడితివి
విన్నపము నీకుఁ జేసీ వింటి వటవయ్యా. ॥ నీకే ॥ 161

శంకరాభరణం

ఎందుకై నావచ్చు నీతో యేలాటాలు
నిందలాడ మాకేల నీచిత్త మిఁకను ॥ పల్లవి ॥

నగినగి నీతోను నవుపు నటించితేను
యెగసక్కెలివియంటా నేల దూరేవు
పగటున నే నీతో పలుకకవుండితేను
అగడుసేసి యిట్టె అలిగితివనవా ॥ ఎందు ॥

యెప్పటివలె నే నీతొ యెదురుమాటాడితేను
తప్పులువట్టితినంటాఁ దలవంచేవు
ముప్పిరి నీతోఁ గనక మోనాననేవుండితేను
కుప్పలూఁ దెప్పలునైన కోపములివె(వ?)నవా ॥ ఎందు ॥

నిలిపి కాఁగిట నిన్ను నిబ్బరానఁ గూడితేను
అలయించితినంటా నట్టె చూచేవు
చెలఁగి శ్రీవెంకటేశ సిగ్గున నే నుండితేను
వలవంతలోడి గర్వములివియనవా. ॥ ఎందు ॥ 162

278-వ రేకు ఆహిరి

నిలుచున్నాఁ డాతఁడు నివ్వెరగంది నీవు
సళుపుఁజూపుల నేల సాదించేవే ॥ పల్లవి ॥

చనవుసేసుక నీవు సణఁగులు చల్లితేను
నినుపుసేసు కతఁడు నవ్వు నవ్వెను
పెనచి సరికిసరె బేసిగాదు నీవేల
వెనకటి నేరాలెంచి విడనాడేవే ॥ నిలు ॥

నిందలువేసి నీవు నేరము లెంచితేను
కందువలంటి యతఁడు కళరేఁచెను
యిందుకు నందుకు నీదె యీఁతకంటె లోఁతులేదు
మందెమేళాన నింకేల మచ్చరించేవే ॥ నిలు ॥

వావులుచూపి నీవు వలపించి కూడితేను
మోవులుచూపి యితఁడు మోహింపించెను
నీవు నాతఁడు నొక్కటే నేమె మీఁదమిక్కిలి
శ్రీవెంకటేశుఁడె తాను చిమ్ముlలురేఁచకువే. ॥ నిలు ॥ 163

శ్రీరాగం

వరుసతోనె వచ్చితే వలపులు చవులౌను
అరమరచి విభుఁడు అందేమి సేసీనె ॥ పల్లవి ॥

మనసులో కాంక్షకు మాటాడితేఁ గొంతాస
ననిచినమీఁద మరి నవ్వులింపౌను
చనవుగలిగితేను సరసమాడఁ జెల్లును
పెనఁగేపాటిచేఁతల ప్రియము లీడేరును ॥ వరు ॥

కాయముమీఁది తమికి కనుచూపు గొంతాస
చేయి చేయిఁ గదిసితే సిగ్గులొంటును
ఆయములు గరఁగితే నందిపొందికలు దగు
తోయరాని మొగమోట తుదలుమీరించును ॥ వరు ॥

అట్టె పాయపుమదాల కందనుంటాఁ గొంతాస
జట్టిగొన్నయందుమీఁద సన్నలుమేలు
అట్టె శ్రీవెంకటేశుండు అలమేల్మంగను నేఁ
బట్టితి ననుచుఁ గూడెఁ బనులెల్లా దక్కఁను. ॥ వరు ॥ 164

సామంతం

నీవే యిన్నిట నిజమరివి
వావిదెలుప యిఁక వద్దయ్యా ॥ పల్లవి ॥

వచ్చినపుడె నీవలపులు దక్కెను
యెచ్చు కుందు లిఁక నేమిటికి
కుచ్చెను కాఁగిట గుటిగా నిన్నిదె
రచ్చలఁ బెట్టక రావయ్యా ॥ నీవే ॥

పలికినపుడె నీపంతము చెల్లెను
యెలయింపుల పనులేమిటికి
పిలిచీ రతులకుఁ బేరుకొనుచునిను
కొలఁదితోనె వూఁకొనవయ్యా ॥ నీవే ॥

కూడినపుడె నీగుణములు దెలిసెను
యేడసుద్దు లిఁకనేలయ్యా
యీడనె శ్రీవెంకటేశ యెనసితిమి
మేదెపు రతులివి మెచ్చవయ్యా. ॥ నీవే ॥ 165

భైరవి

నాకుఁజూడ నిదె నీవు నావాఁడవు
లోకులమాటలకెల్ల లోనై వున్నాఁడవు ॥ పల్లవి ॥
హత్తి నాకాత్మవుగాన అన్నియు విన్నవించితి
చిత్త మెట్టున్నదో చెప్పఁగరాదా
పొత్తులమగఁడవట పొరచి కాఁపురమట
యిత్తల నాపై భక్తి యింకా నీకుఁ గలదా ॥ నాకు ॥
అట్టె మన్నింతువుగన ఆనవెట్టి యడిగితి
జట్టిగా మోహము నీ కేసతిపైనయ్యా
చుట్టమ వందరికట చొల్లు నీకిన్నినట
ముట్టేవు నాచన్నులిఁక మోహమిందు గలదా ॥ నాకు ॥
నీవు నే నొక్కటిగాఁగ నిజము విన్నాడించితి
దేవుళ్లు నీకెందరు తెలుపవయ్య
శ్రీవెంకటేశ నేను జిగి నలమేల్మంగను
తావుగాను రమించితి తగులింత గలదా. ॥ నాకు ॥ 166

దేసాళం

ఆపె నిన్ను దిద్దుకొన నయఁగారుగా
మాపుదాఁకా నూరకున్న మత్తుడవై వుందుగా ॥ పల్లవి ॥
యింతి నీకు మోహించి యింటికి విచ్చేయఁగాఁగా
రంతుల నీవలపెల్లా రచ్చకెక్కెను
కాంతుఁడ యిటుగాకున్న కన్నవారివెంటనెల్లా
పంతపు నీమనసిది పరచై తిరుగుఁగా ॥ ఆపె ॥

చెలి నిన్ను బుజ్జగించి చెనకి నవ్వఁగాఁగా
యిలపై నీవిటతన మెన్నికకెక్కె
లలియింశరేఁఖకున్న లాగుల నీవయసెల్లా
పలచనై లోలోనె పండి తాఁ గైవాలుఁగా ॥ ఆపె ॥
నిండుఁగాఁగిటనె యాపె నేరుపరిఁ జేయఁగాఁగా
దుండగపు నీచేఁతలు తుదకెక్కెను
అండనె శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
రండూ నింతగాఁకున్న రతి చవిగాదుగా. ॥ ఆపె ॥ 167

వరాళి

అప్పటి కప్పటి మాట లంటే మింతే
వు ప్పొలి కినుమడాయ నూరకేవుండవయ్యా ॥ పల్లవి ॥
కంగులేక నీవాళ్లఁ గపటము చేదందువు
అంగము పై పెంజెమట లవిగోవయ్యా
వెంగలితనాన నిన్ను వెల్లవిరి సేయరాదు
అంగడిఁబెట్టకు పను లట్టెవుండనీవయ్యా ॥ అప్ప ॥
వొద్దనున్నవారితోడ వొట్టులు వెట్టుకొందువు
అద్దము చూచుకో నీ మోమదిగోవయ్యా
గద్దించిందరిలోఁ దాచుకొణలఁ బెట్టఁగరాదు
యిద్దర మే మెరుఁగుదు మిఁక నంతయేలయ్యా ॥ అప్ప ॥
పలుమారు మాముందర పంతాలు నెరపుదువు
అలవిమీరే గురుతు లవిగోవయ్యా
యెలమి శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తొలఁకీని మేలు పొత్తున నుండనీవయ్యా. ॥ అప్ప ॥ 168

279-వ రేకు నాదరామక్రియ

ఒలసితే నొకమాట వొల్లకుంటే నొకమాట
బలిమి వలపులకు పాటియేది యిందుకు ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి వేఁడుకో నీచే సూటికి రాకున్న
కక్కసించి యేరా నీవు కడుఁ దిట్టేవు
యెక్కువ నీ వొక్క నోరె యెందుకై నావచ్చు నిఁక
నిక్కమేది కల్లయేది నేనెట్టు నమ్మేను ॥ ఒల ॥

నవ్వు నవ్వి చేయి వేసి నయ మింతలేకున్న
పవ్వళించి యేరా నీవు పగచాటేవు
రవ్వగా నీగుణమిదె రండూ నడపఁజొచ్చె
యివ్వల నీయెదమాట లేమివినే మిఁకను ॥ ఒల ॥

అట్టె నన్నుఁ గాఁగిలించి అన్నిటాఁ గిందుపడితే
జట్టిగొని తొల్లిటివోజకు వచ్చేవు
నెట్టన శ్రీవెంకటేశ నీవు నేను నొక్కటే
యిట్టు నట్టు నందాలకు నిన్ని నేరుతువు. ॥ ఒల ॥ 169

## సామంతం

నీతలనె వేఁగెనా నిండు భోగాలు
కాతరపుఁ దమకము కాదనఁగఁ గలవా ॥ పల్లవి ॥

దగ్గరి వున్నాఁ డతఁడు తలవంచనేలే
సిగ్గువడఁ బొద్దులేదా చెల్లఁబో నీకు
అగ్గమై చిన్నదానవు అయితే నౌదువుగాక
అగ్గలపు జవ్వనము ఆఁప నింకఁ గలవా ॥ నీత ॥

మాటలాడీ నాతఁడు మౌనము నీకేలే
గాఁటపు నివ్వెరగుకుఁ గాలములేదా
నేఁటనె కొత్తరికము నీకు నై తేనాయఁగాక
వాఁటపు మరుబాణాల వాఁడిచూపఁ గలవా ॥ నీత ॥

కాఁగిలించీ నాతఁడు కళవళమేలే
వీఁగి పరవశాలకు వేళలేదా
చేఁగదేరఁ గూడె నిన్ను శ్రీవెంకటేశుఁ డతఁడు
నాఁగువారె సరసాలు నవ్వకుండఁ గలవా. ॥ నీత ॥ 170

### కాంబోది

చాలుఁ జాలు నేల మాతో జాణతనాలు నాకు
కోలుముంచై నీపొందు జిగురువంటిదయ్యా ॥ పల్లవి ॥

చెచ్చెర నీమాఁటలు చెవియొగ్గి వినఁబోతే
మచ్చిక నల్లాపె నీకె మరులాయను
హెచ్చుగాఁ బదారువేల నీరీతిగడించుకొంటి
తెచ్చి నీకు నెవ్వ రుపదేశమిచ్చిరయ్యా ॥ చాలు ॥

ముందరనుండఁగ నీమొగము చూడఁగఁబోతే
అందరిలోపల నాపె ఆలాయను
యిందువంకనె రేపల్లెయింతుల భ్రమించితివి
సందడి నెవ్వరు నిన్నుఁ జదివించిరయ్యా ॥ చాలు ॥

చేరువ నీవుండఁగా నీసేవలు సేయఁగఁబోతే
సారె నీవురాన నాపె సతమాయను
యీరీతి శ్రీవెంకటేశ యిల్లాండ్లఁ దెచ్చుకొంటే
నేరిపి యెవ్వ రింతేని నిన్ను దిద్దిరయ్యా. ॥ చాలు ॥ 171

### పాడి

ఆపెకు నీకుఁ దెలుసు నటమీఁది పనులెల్లా
చేపట్టి నే మింతకంటెఁ జెప్పఁగఁ జోటేది ॥ పల్లవి ॥

లోకములో నెవ్వతెైనా లోఁచి మాటలాడఁగాను
పైకొనని వానికిఁ బంతమేది
రాకలఁ బోకల నప్పె రాయడించి కొసరఁగ
మైకొని లోఁగాకున్న మగతనమేది ॥ ఆపె ॥

నంటున నెవ్వతెయైనా నవ్వులు సారె నవ్వఁగా
యింటికి రాకున్నవాని యెరుకేది
జంటలఁ దనమొకము సారె సారెఁ జూడఁగాను
వెంటఁ దగులకున్నను విటతనమేది ॥ ఆపె ॥

యెమ్మెచూపి యెవ్వతైనా యెదుటనే నిలుచుంటే
నెమ్మిఁ గలయనివాని నేరుపేది
కొమ్మను శ్రీవెంకటేశ కూడి నన్నుఁ గూడితివి
సమ్మతి నిటుగాకున్న జాణతనమేది. ॥ ఆపె ॥ 172

దేసాక్షి

వినవమ్మ యశోద గోవింద కృష్ణుఁడు
చెనకి యెన్నిపనులు చేసెనమ్మ కృష్ణుఁడు ॥ పల్లవి ॥

వుట్టులు దాఁగొట్టఁగాను వువిదలు దిట్టఁగాను
అట్టాయ వీధులలో నుఱక కృష్ణుఁడు
పట్టినకోలల గొల్లపౌఁజు లిరువంకరాఁగ
పట్టుకొన్న గొల్లెతల భ్రమయించీఁ గృష్ణుఁడు ॥ విన ॥

పాలు దనపైఁ గారఁగా పడఁతులు నవ్వఁగాను
గేలికి లోనాయను జంగిలి కృష్ణుఁడు
ఆలరి యెలుఁగులతో నడ్డమువచ్చినవారి
మేలపు చేఁతలు చేసి మెప్పించీఁ గృష్ణుఁడు ॥ విన ॥

యిండులు దాఁజొరఁగాను యింతులు పైకొనఁగాను
బందుకు లోనాయను గోపాలకృష్ణుఁడు
అందనె శ్రీవెంకటాద్రి నలమేలుమంగఁ గూడి
దుండగపుఁ జేఁతలనె దొరాయఁ గృష్ణుఁడు. ॥ విన ॥ 173

బౌళి

కన్నులఁ జూచేవు మాతో కందువ మాటలాడేవు
కొన్నదికోలు నీకిఁక గోవిందరాజా ॥ పల్లవి ॥

పవ్వళించేయప్పుడూను పాదాలొత్తే వారిద్దరు
యివ్వల నే నీతో నవ్వ నేకతమేది
దవ్వుల నుండే మమ్ముఁ దడవేవు నీవాళ్ల
కువ్వలాయ వలపులు గోవిందరాజా ॥ కన్ను ॥

యిద్దరి చే నిమ్మపం డ(డ్ల?) వేమిసేయవచ్చు నిన్ను
అద్ది నీతో మాటలాడ ననువయ్యీనా
చద్దికి వేఁడి కప్పటి జాణతనా లాడేవు
కొద్దిఁబడవు పనులు గోవిందరాజా ॥ కన్ను ॥

యిరుమొనసూదివి యెవ్వరివాఁడ వందుము
దొరవై నన్నుఁ గూడితి తొల్లె నీవు
తరవాతి చేఁతలెల్ల దక్కె నీకు నిందరిలో
గొరబై శ్రీవెంకటాద్రి గోవిందరాజా. ॥ కన్ను ॥ 174

280-వ రేకు హిజ్జిజి

ఎఱిఁగినపనులకు నిఁకనేఁటికి నీకుఁ
దఱితో నవ్వేవారె తగు నింతేకాకా ॥ పల్లవి ॥

మగువలు వద్దనుంటె మఱతు వన్నిపనులు
తగిలి వెనకముందు తలపోసేవా
వెగటుగ నేముసేసే విన్నప మెందుకెక్కను
బగివాయకుండేవారి భాగ్య మింతేకాక ॥ ఎఱి ॥

కొంగువట్టి తీసితేనె గొబ్బున లోనౌదువు
పంగించిచెప్ప నీ కొక్కపాటి వున్నదా
పొంగి నీబాసలు నేఁడు పొగడఁగ నేమున్నది
వుంగరపువేలివారి వోపి కింతేకాక ॥ ఎఱి ॥

కాఁగిలించి కూడితేనె కరఁగుదు వంతలోనె
దాఁగి పెనఁగఁగ నీకు తగవున్నదా
చేఁగదేరఁ గలసితి శ్రీవెంకటేశ నన్ను
వీఁగక నిలుచువారి వెర వింతేకాకా. ॥ ఎఱి ॥ 175

కేదారగౌళ

అందుమీఁద మేలుదాన వాతనికి నీవు దొల్లె
కరదువె చూతువుగాక గరిసించ నేఁటికే ॥ పల్లవి ॥

చిక్కని వెన్నెలతేట చెలియ నీ మొగమోట
అక్కజపు పతి నింకే మనఁగలవే
నిక్కి యాతఁడన్నీఁజేసె నీపై వలపువేసె
మక్కువ నాడ సుద్దులు మమ్మేమడిగేవే ॥ అందు ॥

పచ్చితేనె కులుకులు పడఁతి నీపలుకులు
యిచ్చట నాతని నింకా నేమనేవే
రచ్చలకు నాఁడెయెక్కె రాతిరి నీకు మొక్కె
ముచ్చట కిందేమి మామోములు చూచేవే ॥ అందు ॥

చెప్పరాని విందులు సేసెటి నీపొందులు
యిప్పుడు శ్రీవెంకటేశు నేమి సేసేవే
తప్ప కితఁడె కలసె తమకములు వలసె
వొప్పుగా మమ్ము మెచ్చితి(తెః-తీః)వొరయ నేమిటికే. ॥అందు॥

దేసాళం

ముగురము జాణలమే మోహమెవ్వరి దనేది
నిగిడి నామోము చూచి నీవేల లోఁగేవు ॥ పల్లవి ॥

యింతి తెంకాయ కానుక యిచ్చె నీవు గైకొంటివి
యింతలేసి యాపె కుచా లివి యంటాను
సంతమై యిద్దరి సన్న సరికి బేసికి వచ్చె
అంతటి మీ నేరుపుల కట్టె నేను మెచ్చితి ॥ ముగు ॥

దొండపండు కానుకిచ్చె తోడ నీ వందుకొంటివి
దండ నిటువంటిదె యధరమనుచు
దండి మీపొదరులవి తాసుగట్లెయు (ట్లాయః) నాయ
అంద నుందానఁ గాన అట్టె నేమెచ్చితి ॥ ముగు ॥

పువ్వుగుత్తి కానుకిచ్చెఁ బుచ్చుకొని కూడితివి
జవ్వనము ఆపెకు యీజాద దంటాను
అవ్వలి మోమైవుండి అప్పుడె శ్రీవెంకటేశ
యివ్వలఁ గాఁగిలించి మీయిద్దరి మెచ్చితిని. ॥ ముగు ॥ 177

హిందోళవసంతం

ఇంతవాఁడు చెనకీ నెక్కడ చూచేవె నీవు
యింతలో గోడచిత్తరు వేమి వ్రాసేవే ॥ పల్లవి ॥

ఆతల నీరమణుఁడు అట్టె నిలుచుకుండఁగా
యేతుల మాతో మాటాడే విది యేఁటిదే
బూతులఁ దిట్టీ నతఁడు పూని నీగర్వము చూచి
యీతల నేఁటి నవ్వులు యిటు నవ్వేవే ॥ ఇంత ॥

రతికి నాతఁడు నిన్ను రమ్మని పిలువఁగాను
కత లడిగేవు మమ్మిక్కడ నేఁటిదే
చతురుఁడు సురటి నిచ్చట నిన్నుఁ దాఁకవేసె
వెతదీరఁ బుచ్చుకొని విసరుకొనే వేమే ॥ ఇంత ॥

శ్రీవెంకటేశుఁడు నిన్ను చేరి కాఁగిలించఁగాను
వోవరిలో నన్ను నేల వుండు మనేవే
దేవుఁ డాతఁ డంతలోనె తెరవేసి నిన్నుఁ గూడె
చేవదేరె నాతో నేల సిగ్గు వడేవే. ॥ ఇంత ॥ 178

దేవగాంధారి

పొద్దుగూఁకె తెల్లవారె పొంతనె యాతఁడున్నాఁడు
గద్దరితన మింతేసి కలదటవే ॥ పల్లవి ॥

చిత్త మెడసివున్నది చెప్పుడుమాటలవల్ల
వొత్తి యాతఁ డేమనిన వూఁకొనవు
అత్తివున్న చెలుల మమ్మడుగవేసుద్దులును
యిత్తలఁ దేరేదివర మెటువలెనే ॥ పొద్దు ॥

పట్టిన చలమున్నది పాసిన కాఁకలవల్ల
జట్టిగొని వేఁడుకొన్నా సమ్మతించవు
అట్టె యాతనిచే నొక్క ఆనైనఁ బెట్టించుకోవు
గుట్టుతో నుండఁగాను కూడు టెన్నఁడే ॥ పొద్దు ॥

పంత మెక్కుడై వున్నది బలు రారాఁపులవల్ల
కొంత గొంత సమ్మతించి కొంకు దేరవు
యింతలో శ్రీవెంకటేశుఁ డిదెరిఁగి నిన్నుఁ గూడె
వింత రతులనుచు నివ్వెరగు లేలే. ॥ పొద్దు ॥ 179

పాడి

అన్నియు నందె అమరె నదె
పన్నుపునవ్వులు చల్లే నిపుడు ॥ పల్లవి ॥
చెక్కు నొక్కి నను సేదదేర్చి యిటు
దిక్కునఁ గోపము దీర్చితివి
యెక్కువ నిమఁ దొలు తేమని యంటినో
చిక్కి కాఁగిలించెద నే నిపుడు ॥ అన్ని ॥
చనవులిచ్చి నను సమతుసేసి యిటు
పెనఁగి మంకు విడిపించితివి
యెనయ నపుడు నిను నెంత సేసితినో
చెనకి యధర మిచ్చెద నే నిపుడు ॥ అన్ని ॥
సరసమాడి కడుఁ జవులుచూపి యిటు
గరిమతోడ ననుఁ గలసితివి
సరవి శ్రీవెంకటేశ్వర యే మెరఁగనో
అరసి తనిసి కొనియాడెద నిపుడు. ॥ అన్ని ॥ 180

281-వ రేకు నాదరామక్రియ

మనసుమెత్తనిదాన మరి నీకు మోహింతు
పనుపడి నీవెట్టు పాలార్చేవయ్యా ॥ పల్లవి ॥
సరసపు నీమాటకు జంకించితి నీవంతలో
వొరసి చిన్నఁబోయి వూరకుంటివి
కరఁగితి నదిచూచి కరుణ మిక్కిలిఁబుట్టి
తిరుగ నామన సెట్టు తేరిచేవయ్యా ॥ మన ॥

చేయి నామీఁద వేయఁగా నెలసి విదలించితి
చాయనేసుకో లోఁగి జడిసితివి
ఆయా లంటి చింతించితి అంతనేసితి నే నని
కాయ మంటి నన్ను నెట్టు గారవించేవయ్యా ॥ మన ॥
నీవు నన్నుఁ గూడఁగాను నివ్వెరగుతోఁ జొక్కితి
నీవె తప్పు లెంచుకొని నేర నంటివి
శ్రీవెంకటేశ యిందుకే సిబ్బితి యింతయుఁ బాసె
చేవగా నా చన వెట్టు చెల్లించేవయ్యా. ॥ మన ॥ 181

## సామంతం

ఎగ్గో తప్పో యెఱఁగ నిది
నిగ్గులు దేరఁగ నినుఁ బైకొందు ॥ పల్లవి ॥
పలుమరు నీతోఁ బంతము లాడను
అలసి సొలసి మాటాడుదును
కులికి కులికి నినుఁ గోపించి చూడను
నలుగడఁ గూరిమిఁనాఁటఁగ జూతు ॥ ఎగ్గో ॥
కమ్మర నీపై కాఁకలు చల్లను
సమ్మతి వలపులు చల్లుదును
దిమ్మరేఁచి తరితీఁపులఁ బెట్టను
•కొమ్మని మేకులు కొనఁ బెట్టుదును ॥ ఎగ్గో ॥
పాసివుంటి వని బడలిక నేయను
ఆసల రతులనె అలయింతు
నేసలఁ గూడితి శ్రీవెంకటేశ్వర
వేసరించ నిను విడువ నెప్పుడును. ॥ ఎగ్గో ॥ 182

## సాళంగనాట

ఎంతటివాఁడవు నిన్ను నేమందును
కాంతలకు మాకుఁ దొల్లి కారణము గలదా ॥ పల్లవి ॥

ఆపె నీకె మొక్కనీ ఆపెకు నీవైనా మొక్కు
కేపున మాకేఁటికి మొక్కించేవయ్యా
యేపున నే నేమంటి యీయింతి నన్నేమనె
చేపట్టి నీకొరర కింత సేసేవు గాకా ॥ ఎంత ॥

ఆవిడెము నీ వందుకో నీవిడె మట్టె పెట్టు
యీవల నెవ్వరి విడే లేమి సేసేము
యేవూరి యక్కను నేను యేవూరి చెల్లె లాపె
వావులు నీవల్ల నింతవచ్చె నింతె కాకా ॥ ఎంత ॥

చేయివట్టి తియ్యనీ చేసన్న నీవు సేయి
బాయిట మమ్మెపుడూనుఁ బట్టవద్దు
పాయ వలమేల్మంగను పైకొంటి శ్రీవెంకటేశ
కాయకపువారి నీవే కట్టుకొందు గాకా. ॥ ఎంత ॥ 183

బైరవి

ఏల సిగ్గు వడే వానతియ్యరాదా
మేలిమిచెలుల మిదె మీవారమె ॥ పల్లవి ॥

తురుము నీవియు జార తొయ్యలి యెదురుకొనె
యిరవగు పతివి నీ వింటికి రాఁగా
పరగఁ జూచితి మాపె పట్టరాని సంతోసము
సరవి నీ మనసు యే చందమో యిపుడు ॥ ఏల ॥

కన్నులా నోరా వినెను కాంత నీవు మాటాడఁగా
సన్నపుఁ జిరునవ్వులు జాలు వారఁగా
మున్నె యెరిఁగితి మాపె మోహ మింత గలదని
పన్నిన నీగుట్టు యేరుపడ దింతే కాని ॥ ఏల ॥

చేతులాఁ జన్నుల నిండాఁ జెలి యప్పళించుకొనె
ఘాతల శ్రీవెంకటేశ కాఁగిలియ్యఁగా
యీతలఁ దెలిసుకొంటి మీ యలమేల్మంగయాస
యేతుల నీయా(యే?)కతము లెట్టు(ం)డెనో. ॥ ఏల ॥ 184

శ్రీరాగం

ఎవ్వరిపై మోహ మెట్టు దెలుసు మరి
    యివ్వల నాతో నెనసితివి ॥ పల్లవి ॥

మందపు నడపుల మగువ రాకలకు(ను?)
    పొందుగ రమణుఁడ పొగడేవు
    కందువ వేరొక కాంత చూడఁగా
    చిందేటి చెమటలఁ జెలఁగేవు ॥ ఎవ్వ ॥

చతురత నొకసతి సరసము లాడఁగ
    మితిమీరఁగ నిటు మెచ్చేవు
    తతిగొని వేరొక తరుణి నవ్వఁగా
    యితవులాడి చన విచ్చేవు ॥ ఎవ్వ ॥

వంతుకు నొకచెలి వలపులు చల్లఁగ
    చెంతల సన్నలు సేసేవు
    యింతలో శ్రీవెంకటేశ నేఁ గూడఁగ
    సంతమై నాకె సత మయితివి. ॥ ఎవ్వ ॥ 185

దేసాళం

ఎవ్వరి నేమనఁ జాల విది యేఁటిదో
    అవ్వలి యివ్వలి భావ మది యేఁటిదో ॥ పల్లవి ॥

కందువ నీ కాపె చూపి కాఁకలు నీ మీఁదఁ జల్లి
    అందపు ముసుఁగు వెట్టె నది యేఁటిదో
    యింద మని విడె మిచ్చి యియ్యకోలు మాట లాడి
    యిందె నిలుచుకున్నది యిది యేఁటిదో ॥ ఎవ్వ ॥

నెలవు నీ కాపె సేసి చేతులు నీ మీఁదఁ జాఁపి
    అలసి పండున్న దాపె అది యేఁటిదో
    మలఁగు నీకు వేసి మరి తానూ నం దొరగి
    యెలమి నూరకేవున్న దిది యేఁటిదో ॥ ఎవ్వ ॥

చక్కని భూకాంత యాపె చనవు నీ మీఁదఁ జూఁపి
అక్కర నీ పీఁపెక్కె నది యేఁటిదో
గక్కన శ్రీవెంకటేశ కైకొని నీ వురమెక్కె
యిక్కువ నలమేల్మంగ యిది యేఁటిదో. ॥ ఎవ్వ ॥ 186

282-వ రేకు సాళంగం

ఇదివో వలపు చింది యినుమ డాయను
యెదుట నీభాగ్య మాయ నిఁక నేఁటిదయ్యా ॥ పల్లవి ॥

చెలియ నీ వింటికి విచ్చేసిన పరాకున
మలసి పయ్యద వెట్ట మరచె నదే
వెలయ నీ వింతలో నవ్విన నవ్వులకు నిట్టె
చలివాసి తన కొప్పు జారుటా నెరఁగదు ॥ ఇది ॥

పడఁతి నీ చూపులు పైఁ బారిన సంభ్రమమున
బడినె పాయపు సిగ్గుపడ మరచె
జడియక నీ వంతలో సరసము లాడితేను
వొడలఁ జెమట నిండి వొలుకుట చూడదు ॥ ఇది ॥

వేవేగ నీవు గూడిన వేడుక నలమేల్మంగ
శ్రీవెంకటేశుఁడు తనచేఁత మఱచె
భావించి నీవంతలోనె పైపై నెచ్చరించఁగాను
ఆవటించి తన మేని అలయికఁ గానదు. ॥ ఇది ॥ 187

శ్రీరాగం

తరుణి యిందుకే తలవంచె
సరసము లెటువలె జరపితివో ॥ పల్లవి ॥

పంతము లాడుచుఁ బరతెంచిన చెలి
చెంతల నినుఁ గని సిగ్గువడె
మంతు కెక్కె కనుమరఁగులలోనె
యెంత నేసితివో యే మంటివో ॥ తరు ॥

జంకెల బొమ్మల జరసే నని సతి
అంకెల నినుఁ గని అరమఱచె
సంకెలేని నీ చాయలలోనె
వుంకువ నీ వెట్లుండితివో ॥ తరు ॥
అటు నినుఁ గలయుచు నలమేలుమంగ
నటనల నినుఁ గని నవ్వే నదే
చిటిపొటి రతులను శ్రీవెంకటేశ్వర
యెటువలె నొకటయి యెనసితివో. ॥తరు॥ 188

శంకరాభరణం

తనివారఁ దిరువనందలము సేవ నేఁడు
అనువుగా సేవించరో అమరులు ఋషులు ॥ పల్లవి ॥
యెదురుగాఁ గూచుండి యిద్దరు నందల మెక్కి
కదిసి మీఁదఁ బన్నాగము గట్టించి
ముదమున నొండొరులు మోములు చూచుకొంటా
యిదివో దేవులు దేవుఁ డేఁగేరు వీధులా ॥ తని ॥
చదురులమాఁటలు సతు లాడఁగా వింటా
వుదుటునఁ దమ యంగా లొరయఁగను
అద నెరిఁగి మోవుల నంతలో నవ్వులు నవ్వి
మెదు రెదుర దంపతు లేఁగేరు వీధులా ॥ తని ॥
పొదిగి యలమేల్మంగ పూఁచి కాఁగిలించఁగాను
కదలక కూడీ శ్రీవెంకటేశ్వరుఁడు
అదివో యాతఁడు మెచ్చె నాతని నాపె మెచ్చె
యెదిగి నగరిలోనె యేఁగేరు వీధులా. ॥ తని ॥ 189

నాట

పై పై నిన్నుఁ గొసరితే పసురే కాదా
వైపులు సేసుక నే నే వద్దనుండేఁ గాకా ॥ పల్లవి ॥

యిచ్చకము లాడఁగానె యిటు రమ్మనేవు గాక
చెచ్చెర నిజ మాడితే చేర నిచ్చేవా
పచ్చిగాఁగ నీగుణము పచరించ నేమున్నది
కొచ్చి నా నేరుపుననె గుట్టుసేసేఁ గాకా ॥ పైపై ॥

చాయచేసు కుండఁగానె చవులై వుందానఁగాక
నాయము నడపు మంటే నన్ను మెచ్చేవా
సోయగాన నిన్నంత సోదించ నేమున్నది
తీయని మాటాడి నిన్ను తిద్దుకొనేఁ గాక ॥ పైపై ॥

కదిసి నేఁ గూడఁగానె కరఁగి చొక్కేవు గాక
వదరి నే నూరకున్న వస మయ్యేవా
అదె శ్రీవెంకటేశుఁడ అలమేలుమంగ నేను
పొదిగి నే నుండఁగానె భోగించేవు గాకా. ॥ పైపై ॥ 190

లలిత

నాటి సుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి
పాటింప నావేడుకలు ప్రత్యక్షమైవున్నవి ॥ పల్లవి ॥

ఆ(అ?)పనఁ గోనేటిదండ హరి గూచుండి చూడఁగ
యెదుటనె జలకేలి నింతు లుండఁగా
కదిసి యమునలోన కందువైన గోపికలు
పొదిగి వలపుచల్లే పోలికయై వున్నది ॥ నాటి ॥

అంతలోనె వలువలు అందరుఁ గట్టుక వచ్చి
చెంత నితని కొలువు సేయఁగాను
చింతదీరఁ దొల్లి అందె చీర లిన్ని నిప్పించుక
సంతసాన నిట్లుండే సరవినే వున్నది ॥ నాటి ॥

అట్టె శ్రీవెంకటేశుఁ డలమేల్మంగనుఁ గూడి
నెట్టన పైఁడిమేడలో నిండు కుండఁగా
అట్టుగా వీ రిందరు నాఅడిసేసి నవ్వఁగాను
తెట్టెలై నాటి పొందులు తెలిపినట్టున్నది. ॥ నాటి ॥ 191

శుద్ధవసంతం

ఎంతమాట కెంత సేసే వేమీ నీవు
పంతాలు నెరపఁ బోతే పసచూప నున్నదా ॥ పల్లవి ॥

చేసుకొన్న చెలిగాన చేకొని కొసరితే
యీసులు రేఁచుకొనే వేమీ నీవు
ఆసగలవాఁడ వైతె నన్నిటి కోరుతు గాక
వేసరుకొనేవు నీకు విన్నవించ నున్నదా ॥ ఎంత ॥

వొరసి సతి నీతోడ నూరకే అటుండితేను
యెరవులు సేసుకొనే వేమీ నీవు
కరఁగ నేరిచితేను కైవసమై వుందు గాక
పొరలఁ జూచేవు యిఁక పొందు సేయ నున్నదా ॥ ఎంత ॥

తగవులకాంత నీతో తచ్చనలు నెరపితే
నెగసక్కె లంటా నవ్వే వేమీ నీవు
నిగిడి శ్రీవెంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
మొగము చూచేవు నీతో మూసి దాఁచ నున్నదా. ॥ ఎంత ॥ 192

283-వ రేకు భూపాలం

రమణుని చిత్త మింతే రాఁపులు మాతో నేల
సమముగాఁ జూడు మని చండిసేయవచ్చునా ॥ పల్లవి ॥

పంతపు నీమాటలకు పనిలేదు మాతోను
చెంతలఁ బతికె బుద్ధి చెప్పరాదా
యెంతలేదు నీసణఁగు యేల వాదుకు వచ్చేవు
బంతిఁబెట్టి వలపులు పంచిపెట్ట వచ్చునా ॥ రమ ॥

జంకెన బొమ్మల మమ్ము సాదించఁ బనిలేదు
వంకల నీనేరుపుల వంచుకోరాదా
మంకుల నీగుణములు మాకుఁ గొత్తలా నేఁడు
అంకెలుగా నీమనసు అంటించవచ్చునా ॥ రమ ॥

యీడుకుఁగా మాతోను యింతసేయఁ బనిలేదు
ఆడుకోలు గలిగితే ననరాదా
యీడనె శ్రీవెంకటేశుఁ డిరవై నన్నుఁ గూడె
వేడుకకూటములకు వెలవెట్టవచ్చునా. ॥ రమ ॥ 193

పాడి

ఎప్పటివాఁడవె కావా యెరఁగఁ గాకా
చిప్పిల నేనే మరచితిఁ గాని ॥ పల్లవి ॥
యింగితము చూచి నీవిటువంటివాఁడ వని
అంగనలు నాతోఁ జెప్పి రల్లనాఁడె
సంగడి నేనే నిన్ను సాదించనేరక
వుంగిటి మొగమోటాన నుండితిఁ గాని ॥ ఎప్ప ॥
దట్టమై నీ వింతేసి తలఁచే తలఁపులకు
అట్టె సగినాలు చెప్పి రల్లనాఁడె
వట్టి ఆసలను నేనే వాదువెట్టనేరక
గుట్టు నేసుకొని యింత కొంకితిఁ గాని ॥ ఎప్ప ॥
గుమితాన నింతనేసి కూడుదువు నన్ను నని
అమరఁ గలలు గని రల్లనాఁడె
తమితో శ్రీవెంకటేశ తగ నట్టె కూడితివి
సమరతి నేనే నిన్ను జట్టిగొంటిఁ గాని. ॥ ఎప్ప ॥ 194

ముఖారి

మేలు నీతోడిపొందులు మేకు లాయను
వేళ వేళ నీ సతికి వింత లాయను ॥ పల్లవి ॥
చిల్లరగా చెలి నీతో సెలవుల నవ్వఁబోతే
వెల్లవిరులై పెద్ద వెన్నె లాయను
చల్లని నీ సరసాలు జాలువారి జాలువారి
యిల్లిదివో వలపుల యేరు లాయను ॥ మేలు ॥

మంతనాన నీతోను మాటలాడఁ బోతేను
చింతదీర నీపె కవె సిగ్గు లాయను
చెంత నీతో సంగాతాలు చిమ్మిరేఁగి చిమ్మిరేఁగి
కాంతుల మరుబాణాల గను లాయను ॥ మేలు ॥

సమ్మతించి యింతి నిన్నుఁ జక్కఁ జూడఁ బోతేను
కుమ్మరింపుఁ దమకపు గురు లాయను
కొమ్మకు శ్రీవెంకటేశ కూడిన నీ కూటములు
దొమ్ము లాసల రతుల దొంతు లాయను. ॥ మేలు ॥ 195

మధ్యమావతి

అన్నిటా భాగ్యవంతుఁడ వాయమెరిఁగి కూడితి
యెన్నికలు మీరితేను యెట్టుండునో సుద్దులు ॥ పల్లవి ॥

చింతలనె కొంతపొద్దు చెక్కిటిచేఁ గొంతవొద్దు
కాంతలతోఁ గొంతవొద్దు గడపెఁ జెలి
యింతలో నీవు విచ్చేసి తిన్నియును లెస్సలాయ
యెంతలేసి పను లౌనో యించు కూరకుండినా ॥ అన్ని ॥

యెదురుచూచేయాస నిల్లుసింగారించే యాస
వెదకేటియాసఁ గొంత వెలసెఁ జెలి
అద నెరిఁగి దగ్గరి అంతలో నీవు నవ్వితి
.యెదుగా సరసమైతే నెన్నేసివిధులో ॥ అన్ని ॥

చూపులనె కొంతరతి సుద్దులనె కొంతరతి
యేపులనె కొంతరతి నెనసెఁ జెలి
పైపై శ్రీవెంకటేశ భామ నిట్టె కూడితివి
యీపొద్దు లివిదక్కె నింకా నెంతదక్కునో. ॥ అన్ని ॥ 196

ఆహిరి

ఇంతకంటె వలపు నేనేమి చెప్పేను
కాంతుఁడవు నీవె యింకాఁ గనుకోవోయీ ॥ పల్లవి ॥

అంతరంగములోనను ఆయము నీచింత నాకు
బంతి నీమాటలె చెవులపండుగ నాకు
సంతమైన సరసాలె జగమెల్లా నేలుట
వింత వింత చనవులె వేవేలు విధులు ॥ ఇంత ॥

కన్నులకు నీరూపు కామనిధానము నాకు
పన్నిన నీ చనవులె పంటలు నాకు
మన్ననల నగవులె మంచి కప్పురవిడేలు
మున్నిటి పొందుల సిగ్గు ముత్యాలసేస ॥ ఇంత ॥

మేనికి నీకాఁగిలి మెత్తని పరపు నాకు
తానకపు నీరతులె తగుభోగాలు
మానక శ్రీవెంకటేశ మరిగి నన్నుఁ గూడితి
నానెటి చెమట లివె నవరసాలు. ॥ ఇంత ॥ 197

## సౌరాష్ట్రం

ఇద్దరిఁ గూర్చినవారు యిప్పుడు మీరెకారా
వొద్దిక్క(క్క?) నప్పటి నేల వొరపులాడేరే ॥ పల్లవి ॥

కచ్చుపెట్టి నే నతనిఁ గన్నులఁ బిలిచితేను
యిచ్చటఁ జెలులు మీరు యేల నవ్వేరే
ముచ్చటమాటలఁ గడు మోహముపైఁ జల్లితేను
పచ్చారుచుఁ జెలు లేల పచ్చిసేసేరే ॥ ఇద్ద ॥

పాయక నే నాతనిపయిఁ జెయివేసితేను
చాయల మీలో నేల సన్నలాడేరే
ఆయము లెరిఁగి నే నాకు మడిచియ్యఁగాను
వేయేసిలాగుల నేల వెంగేలాడేరే ॥ ఇద్ద ॥

భావించి శ్రీవెంకటేశుపాదాలు నే నొత్తితేను
వేవేగ సిగ్గున నేల వెలి నుండేరే
ఆవటించి కూడితిమి అప్పుడే మీరు లోనికి
యీవేళ వచ్చితి రింక నిట్టెవుండరే. ॥ ఇద్ద ॥ 198

284-వ రేకు రామక్రియ

తొలుతె మీతమకము దోసిటిపాలు
అలరి యింకాఁ బెండ్లి ఆడవయ్య యిపుడు ॥ పల్లవి ॥

సతికి నీకుఁ జూపుల సరిపొంతనాలుగూడె
చతురత మాట లనె సందివిడేలు
మతకరినవ్వు లనె మంచి పాశాల విందులు
అతిశయమగుఁ బెండ్లిఆడవయ్య యిపుడు ॥ తొలు ॥

యింతికి నీకు వయసు లిరువంకఁ గంకణాలు
పంతపుఁ దమకములె బాసికములు
కొంతఁ గొంత లేఁతసిగ్గు కొంగులువేసినముడి
అంతలో వేడుకపెండ్లి ఆడవయ్య యిపుడు ॥ తొలు ॥

నంటుతోడి సరసాలు నాగవల్లి సోబనాలు
పెంటలైన సమరతి పెట్టిన పేఁ(పీ?)ట
యింటిలో శ్రీవెంకటేశ యీయలమేల్మంగను
అంటి ముట్టి మంచిపెండ్లి ఆడవయ్య యిపుడు.॥ తొలు ॥ 199

బౌళి

నివ్వెరగై వున్నాఁడవు నే నెంత పిలిచినా
మువ్వంకవలపులు ముంచకుండీనా ॥ పల్లవి ॥

సొలసి సొలసి నిన్నుఁ జూచిన యీ చెలిచూపు
నలిరేఁగి నీ మతిలో నాటకుండీనా
మలసి మలసి యిట్టె మాటలాడిన మాట
కలసి నీ మర్మాలు కలఁచకుండీనా ॥ నివ్వె ॥

చిమ్ముచుఁ జిమ్ముచు నింతి చెనకిన చెనకులు
కిమ్ముల నిన్నిట్టె గిలిగించకుండీనా
కమ్మరఁ గమ్మర నీతో కందువ నవ్విన నవ్వు
దిమ్మరేఁచి నీగుణము తేలించకుండీనా ॥ నివ్వె ॥

కరఁగి కరఁగి కాంత కాఁగిలించిన కాఁగిలి
అరమరపించి ఆయా లంటకుండీనా
యిరవై శ్రీవెంకటేశ యిద్దరి మమ్ముఁ గూడితి
గరిమ నీకిట్టె తారుకాణగాకుండీనా. ॥ నివ్వె ॥ 200

పాడి

ఇట్టినీకు వలచిన యింతిదె జన్మముగాదా
వట్టి మోహించినవారి భాగ్యమవె కావా ॥ పల్లవి ॥
నీవు మన్నించేటి యట్టి నెలఁతల కెల్లాను
తావుల లీలారవిందమవె కావా
భావింప నీచూపులు వారినవారికెల్లా
ఆవటించి మెడకంఠహారమవె కావా (?) ॥ ఇట్టి ॥
కప్పురపుఁ బళ్లందిన కాంతలకెల్లాను (?)
కప్పిన శిరోమాణికమవె కావా
చొప్పుగా నీపాదాలు సోఁకినవారికెల్లా
కప్పమైన ముంజేతికంకణమవె కావా ॥ ఇట్టి ॥
కోరి నీవు కాఁగిటిలోఁ గూడుండె సతుల కెల్లా
నారుకొన్నయట్టి నిధానమవె కావా
యీరీతి శ్రీ వెంకటేశ యెనసి నన్నేలితివి
తేరకొన నాపాలి దేవుఁడవె కావా. ॥ ఇట్టి ॥ 201

శ్రీరాగం

ఇటువంటి నీ భాగ్య మేమని చెప్పుదుమమ్మ
తటుకనను నీపతితపము లీదేరె ॥ పల్లవి ॥
చెక్కు-ల మకరాంకము జిగిఁగన్నుల మచ్చములును
మిక్కి-లి శంఖము మెడను మీఁగాళ్లఁ గచ్చపములు
చిక్క-ని నీరూపఁపు సింగారజలనిధికిని
నెక్కొ-ని తామొనరి నవనిధులాయఁ గదవే ॥ ఇటు ॥

వదనమునఁ బద్మంబు వరమై కుచగిరులకును
అదె దంతములఁ గుందము లలకము లనిలములు
అద నెరిఁగి నిలిచి నీయవ్వనపు జలనిధికి
పొదిగి నవనిధులగుచుఁ బొడమె నదె కదవే ॥ ఇటు ॥

కాఁగిటను శ్రీవెంకటగిరి ముకుందంబు
మూఁగిన వరము లెల్ల ముంగిటుందు
చేఁగమీరిన రతులచెమట లను జలనిధికి
ఆఁగి యిటు నవనిధులు నాయఁ గదవే. ॥ ఇటు ॥ 202

సామంతం

నేనే యెరుఁగుదును నీవూ నెరుఁగుదువు
పూనిన రు(రి?)త్తమాటలు భూమి నెన్నిలేవురా ॥ పల్లవి ॥

తలఁచినట్టె నీవు దగ్గరి వచ్చేసితివి
వలపు లంటె నిటువలె నుండురా
సొలసి నేఁ జూడఁగానె చూచితివి నీవు నట్టె
యెలమి లోలోని యాస కిది దిష్టాంతమురా ॥ నేనే ॥

ననిచి నానవ్వులు నీనవ్వులు నొక్కటాయ
యెనసిన యింపులకు నీగురుతేరా
వొనర నిద్దరికిని వొక్కమాటే పులకించె
తనువు లొక్కటౌటకు తారుకాణ లివిరా ॥ నేనే ॥

రాణించి నేఁ గోరినట్టే రతి నీవు నేసితివి
ప్రాణము లెరవుగాని భావ మిదిరా
జాణవు శ్రీవెంకటేశ జంటవాయ మిద్దరము
నాణెపు వేడుకలెల్ల నాకు నీకె తగురా. ॥ నేనే ॥ 203

బౌళి

ఎవ్వరితోనైనాఁ జేయుమీ మాయలు
రవ్వలఁ బెట్టఁగ నేము రాఁపువారమా ॥ పల్లవి ॥

తక్కక నీవు మాపై తలఁపు గలితేఁ జాలు
అక్కడ యిక్కడె కాదా అందు కేమీ
వొక్కలఁ బెట్టుచు మాతో చుట్టరికము నెరప
వెక్కసాన నేఁడు నీకు వింతవారమా ॥ ఎవ్వ ॥

పొద్దు పొద్దు మా ముంగిటఁ బొలసి వుండితేఁ జాలు
యిద్దర మొక్కటె కాదా యిందు కేమీ
కొద్దిమీర నీవు మమ్ముఁ గొంగువట్టి తీసేవు
గద్దించి నీతోఁ బెనఁగ కడవారమా ॥ ఎవ్వ ॥

సమరతిఁ గూడితివి సారెకుఁ బొగడవద్దు
తమక మొక్కటె కాదా దాని కేమీ
అమరె శ్రీవెంకటేశ అన్నియుఁ గడపలోన
జమళిబాస లియ్య మెచ్చనివారమా. ॥ ఎవ్వ ॥ 204

285-వ రేకు సామంతం

నిందలేని పతి విదె నీవు నాసొమ్ము
కంచువ సొమ్ములమీఁదఁ గలిగెను సొమ్ము ॥ పల్లవి ॥

సూటిగా నీవు చూచేటిచూపు నాసొమ్ము
పాటించి నీవు పలికేపలుకు నాసొమ్ము
కూటమిరతుల కొనగోరు నాసొమ్ము
యీటున నీమేనిసొమ్ము లిచ్చేవు నాకు ॥ నింద ॥

చవిగా నాడే నీసరసము నాసొమ్ము
జవకట్టక యిచ్చే నీచనవు నాసొమ్ము
నవకమయిన నీనవ్వు నాసొమ్ము
యివల నింకా సొమ్ము లిచ్చేవు నాకు ॥ నింద ॥

కింకలేని దిదే నీకాఁగిలి నాసొమ్ము
లంకెలైన నీమతివలపు నాసొమ్ము
అంకెల శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యింకా సొమ్ము లిచ్చేవు యెన్నైనా నీవు. ॥ నింద ॥ 205

ముఖారి

ఏమిటికి వేఁడుకొనే వింతలోఁ దమకించేవు
కామించి నీ వాడినట్టు కాదంటినా ॥ పల్లవి ॥

మచ్చరములెల్లఁ దీరె మంతనాన నీవు నాతో
యిచ్చకము లాడితేనె యియ్యకొంటిని
కుచ్చి కాఁగిలించి నాచెక్కులు నొక్క వేమిటికి
నిచ్చలు నీచెప్పినట్టు నేఁ జేయనంటినా ॥ ఏమి ॥

ఆనలెల్ల విడిచితి నంటఁబట్టి నీవు నాకు
తేనెమోవి యిచ్చితేనె తిరమైతిని
పూనిక నాకొంగువట్టి పొంచి యాలపెనఁగేవు
వూని నీతో పొందులు నే నొల్లనంటినా ॥ ఏమి ॥

మంకు లన్నియుఁ దొలఁగె మనసుమర్మములంటి
సంకెలు దీరిచితేనె సమ్మతించితి
కొంకక శ్రీవెంకటేశ కూడి యింకాఁ బొదిగేవు
పొంకమైన మీఁదాఁ దప్పులు వట్టేనా. ॥ ఏమి ॥ 206

సాళంగనాట

పిలువవచ్చిన నేను పెం(పీఁ?)ట పెట్టుకొన్నదాన
తలఁపు నీ కెట్టున్నదో దంటఁగాను నేను ॥ పల్లవి ॥

కామినులతోడి మాట కలది కలట్టేకాని
కోమలపు కల్లలైతె కోపగింతురు
జామాయ నీవద్దనుండి సరినాపెతో నేమందు
నీమతకము లేఁటివో నే మెరఁగ మిఁకను ॥ పిలు ॥

వలచినవారిపొందు వచ్చినట్టె వచ్చుఁగాని
కొలఁదికి రాకున్న కొసరుదురు
నెలకొంటి నిక్కడ నేనె నాపె నెట్టు నమ్మింతు
యెలమి మీ కిద్దరికి నెదురాడ నోపను ॥ పిలు ॥

యిల్లాండ్ల కన్నియును యియ్యకోలై వుండుఁగాని
  జల్లించి సందుగలితే సాధించరు
  యిల్లిదె నన్నుఁ గూడి యింట నాపెఁ గూడితివి
  వొల్లనె శ్రీవెంకటేశ వూరకుండే నిపుడు. ॥ పిలు ॥ 207

## శ్రీరాగం

ముట్టితేనె ముయిముచ్చటలూ
  అట్టుసేయ నాఅడిదానవా ॥ పల్లవి ॥
గక్కన నీతనిఁ గన్నులఁ జూచిన
  పిక్కటిల్లె నిదె పెంజెమట
  చెక్కడచితేను చేటఁడు వలపులు
  వొక్కమాటె నే నోపుదునా ॥ ముట్టి ॥
నవ్వి యితనితో నసుపులు సేసిన
  పువ్వకపూచెను పులక లివి
  రవ్వగాఁ బెనఁగితే రానేఁడు తమకము
  జవ్వనము మోవఁ జాలుదునా ॥ ముట్టి ॥
కాఁగిట నితనిఁ గలసితి నిందుకు
  చేఁగలు దేరెను చిత్త మిది
  వీఁగఁ డితఁడు శ్రీవెంకటేశ్వరుఁడు
  నీఁగని చలములు నేరుతునా. ॥ ముట్టి ॥ 208

## ఆహిరి

ఇద్దరుఁ గూడినమీఁద నిఁక నేఁటి సుద్దులే
  పొద్దు వొద్దు కాతఁడు బుజ్జగించఁగాను ॥ పల్లవి ॥
తమకించే వేఁటికె తా నిన్న రానియందుకు
  అమర నాతఁడు నీతో నానతీఁగాను
  చెమరించే వేఁటికె చెక్కు నొక్కి యాతఁడు
  జమళి వేఁడుకొని యిచ్చకము సేయఁగాను ॥ ఇద్ద ॥

పచ్చిసేయ నేఁటికె పరాకై తా రున్నందుకు
చెచ్చెర నాతఁడు నిన్నె చెనకఁగాను
మెచ్చ వింకానేఁటికె మేకుల నిన్నుఁ బొగడి
వొచ్చముదీర నాతఁడు వుపచరించఁగను ॥ ఇద్ద ॥

ఆరీతి యింకేఁటికే అన్ని చేఁతలకు నిన్నుఁ
గోరి శ్రీవెంకటేశుఁడు కూడఁగాను
బీరములు మానవె పెనఁగి నిన్నుఁ గలసి
అరసి యీతఁడె నీకు నందాలు చెప్పఁగనూ. ॥ ఇద్ద ॥ 209

మాళవిగౌళ

ఈతఁడు వద్దనుండఁగ యేల యెమ్మెలు చెప్పేరే
గాతల మగలవద్ద గర్వములు గలవా ॥ పల్లవి ॥

చెంగట మామొగమున చేరఁదేసి కన్నులంటా
అంగన లందరు నన్ను నాడుకొనేరే
పంగించి మానెరులివి బారెఁదేసి ఆయనంటా
వుంగిటిగా సారె నేల వుప్పతించేరే ॥ ఈత ॥

పంతాన నాకుచములు బంగారుకుండలంటా
బంతినుండి చెలులేల పచ్చారే(దే?)రే
యింతలో నాపిరుఁదులు యిసుక దిబ్బెములంటా
• రంతులుగాఁ గడు నేల రాఁపు సేసేరే ॥ ఈత ॥

పొంచి నా రూపమిది పుత్తడిఁ బోలునంటా
యెంచి యెంచి మమ్ముఁ నేల యింత సేసేరే
అంచల శ్రీవెంకటేశుఁ డన్నిటా నన్నుఁ గలసె
మించుగాఁగ మమ్ము నేల మెరయించేరే. ॥ ఈత ॥ 210

286-వ రేకు శ్రీరాగం

వలపులా గటువంటివిదివో
పిలిచేటి ప్రియమున బీరము మఱచె ॥ పల్లవి ॥

వెలఁది నిన్నుఁ గని వేడుకతోడను
అలుక లన్నియును నటు మఱచె
నలుగడ నీతో నవ్వేటి సందడి
చలములు లోలో సాదించ మఱచె ॥ వల ॥

యింతి విడె మిదె యిచ్చె పరాకున
పంతపు టొట్లపని మఱచె
చెంతల నినుఁ గడు చెనకే సొబగున
కొంతయినఁ దొల్లిటి కోపము మఱచె ॥ వల ॥

కొమ్మ కాఁగిటను కూడే తమకమున
సమ్మతి జంకించఁగ మఱచె
యిమ్మల శ్రీవెంకటేశ కలసితివి
చిమ్ముల యెరవులు సేయఁగ మఱచె. ॥ వల ॥ 211

రామక్రియ

ఎటువంటి చుట్టరిక మెటువంటి పొందులు
సటవటలకు నేల సాదించేవే ॥ పల్లవి ॥

అప్పటనుండియు నీ అండ నిట్టె వుండఁగాను
రెప్పలెత్తి చూచి చూచి రేసు లాదేవు
చెప్పినవారిమాటకు చెవియొగ్గి విని విని
తప్పుఁదారుల నేల తమకించేవే ॥ ఎటు ॥

మనసిచ్చి నే నీతో మాట లిట్టె ఆడఁగాను
వెనకసుద్దుల కేల వెంగె మాడేవే
తనిసి వొకటొకటె తలఁచుక తలఁచుక
పెనఁగి నేఁ బిలువఁగ బిగిసే వేలే ॥ ఎటు ॥

కందువ లంటి నేను కాఁగిలించి కూడఁగాను
చందపు బొమ్మల నేల జంకించేవే
చెందితి నిదివో నిన్ను శ్రీవెంకటేశుఁడ నేను
అందిన రతుల నేల అలయించేవే. ॥ ఎటు ॥ 212

దేసాక్షి

తా నదివో నే నిదివో తాయకాణ లైతిమి
మోనముతోడ నవ్వరే మోవులనవ్వూ ॥ పల్లవి ॥

ఆడ నీడ నుండి వచ్చీ అలసి సొలసి మెచ్చీ
వేడుకకాని కియ్యావే విడె మిదిగో
నీడనుండె అలసీని నిలుచుండె కలసీని
పాడితోడనె మొక్కరే పండుగమొక్కు ॥ తాన ॥

చేయఁగలవెల్లాఁ జేసీ చేరి నాపైఁ జెయి వేసీ
పాయపువాని కియ్యరే బలు కట్నాలు
చాయలకె మాటలాడీ సన్నలకె పాట పాడీ
దాయముగాఁ జూడరే సంతసపుఁ జూపు ॥ తాన ॥

కాంతలలోన వెలసీ కాఁగిట నన్నుఁ గలసీ
పంతగానిపైఁ జల్లరే బలు నేసలు
యింతలో శ్రీవెంకటేశుఁ డితఁ డిదె నన్నుఁ గూడె
వింతగా వింధు చెప్పరే వియ్యపు విందు. ॥ తాన ॥ 213

లలిత

ఎవ్వరి బుద్ధులు యెక్కుడి కెక్కును
నవ్వులె జాణల నను పయ్యెడివి ॥ పల్లవి ॥

పంతము లాడరు బలుములు చూపరు
వంతు లెంచ రటు వలపులకు
సంతసంబులునుఁ జవు లగు సరసము
లెంతైన లోలో నెర వయ్యెడివి ॥ ఎవ్వ ॥

వేసట చూపరు వింతలు సేయరు
వాసులు నెరపరు వలపులకు
ఆసల తమకము అంగపుఁ గరఁగులు
తాసులవలెనే తగు లయ్యెడివి ॥ ఎవ్వ ॥

గుట్టున జడియరు కొంకుచు మొరయరు
వట్టువోరు తమ వలపులకు
యిట్టె శ్రీవెంకటేశ మీకూటమి
నెట్టన రతులివె నిలిచినవి. ॥ ఎవ్వ ॥ 214

ముఖారి

ఎఱఁగని యాఁటదయితే యిది నిజమంటా నమ్ము
నెఱయ మాతో నిజమే నెరపవలయురా ॥ పల్లవి ॥

యెదుటనె వలపు యింటికాడ బులుపు
వదల కేడ నేరిచి వచ్చితివిరా
పెదవులపై మాట బిగువులలో తేట
సదరమై నీకెపుడు సాజమే కదరా ॥ ఎఱ ॥

చెనకితే సిగ్గులు చేఁతలనే యెగ్గులు
ననుపున రెండూ నెట్టు నడపేవురా
మునుపనె మొక్కులు మోచి వచ్చితె తెక్కులు
పొనిగి నీవు పుట్టఁగఁ బుట్టినవే కదరా ॥ ఎఱ ॥

మెచ్చితేనె మేకులు మీరితేనె కూకులు
యిచ్చకొలఁది నడతు వేమందురా
ముచ్చట శ్రీవెంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
చెచ్చెరఁ బరులకైతె నేతువు మాయలురా. ॥ ఎఱ ॥ 215

మంగళకౌశిక

సవతుల కెల్ల నీవు చాటి చెప్పింతువు గాక
నవకాన మూలనుంటె నమ్మేరా దేవులని ॥ పల్లవి ॥

ఆతనివద్ద నుంటె నీ వాల పని యందుఁ గాక
యీతల నీ వెట్టుండినా నెవ్వ రందుము
యేతులకు నీవు మాతో నెరుకలు నేసుకొని
బూతులఁ దిట్టితేనె నీ పొందు గానవచ్చునా ॥ సవ ॥

ముచ్చట మీ రాడుకొంటే మోహాలు గందుము గాక
పచ్చి గుట్టున నుంటె నీ భావ మెందుంతు
మచ్చిక నీ చనవులు మా ముందర మెరయించి
కొచ్చి యాతనిఁ జూచితే గుట్టు గానవచ్చునా ॥ సవ ॥
కాఁగిట శ్రీవెంకటేశుఁ గాఁగిలించుకొంటెఁ గాక
ఆఁగి నీవూర కుండితే నందములౌనా
చేఁగదేర నన్నుఁ గూడె చేరి యాతఁడని నీవె
రాఁగి నీలోనె నవ్వితే రచ్చలకు నెక్కునా. ॥ సవ ॥ 216

287-వ రేకు నాదరామక్రియ

ఎటువంటి మోహమో యీపెకు నాతని మీఁద
ఘటియించె నిద్దరికి కందువ వేడుకలు ॥ పల్లవి ॥
సంగడిఁ గూచున్నది చనవు చేకొన్నది
అంగపుఁ జెమట నోల లాడినది
యెంగిలిపొత్తున విడే లిచ్చినది మెచ్చినది
పంగించీ నిందిరాదేవి ప్రహ్లాదవరదుని ॥ ఎటు ॥
మొక్కుచు నవ్వినది ముచ్చట లాడినది
యిక్కువ లంటుచు లోలో నెన సున్నది
చెక్కుఁ జెక్కుఁ గదియించి జిగిఁ బులకించినది
చిక్కించీఁ గమలాదేవి శ్రీనరసింహునిని ॥ ఎటు ॥
కనుసన్న చేసినది కాఁగిట నించినది
తనివార రతులను దక్కఁ గొన్నది
చెనకి యహోబలాన శ్రీవెంకటాద్రి మీఁద
ననిచె శ్రీ మహాలక్ష్మి నరమృగదేవుని. ॥ ఎటు ॥ 217

దేసాళం

అప్పటి నమ్మఁడు తన్ను నటు వెంగి(గే?) లాడే నంటా
యిప్పుడూ నానవెట్టెను యింకనేలె నవ్వులు ॥ పల్లవి ॥

బాగాలు వెట్టరె పైకొని విభునికి
వాగమై యింతుల కెల్లా వలవు మని
యీగతి మూసి మంతనా లిన్నాళ్లుఁ దనకు
వేగమె యప్పణిచ్చితి వెరపేలె యిఁకను ॥ అప్ప ॥

వుపమ లెత్తియ్యరె వొకటొకటె పతికి
నెపాన సతులఁ బొంద నేరుపు మని
కపటాన దాఁ గొంత కనియుఁ గానము లేల
యెపుడూఁ దనకు లోనె యిఁక నేలె కొంకను ॥ అప్ప ॥

చేయెత్తి మీరు మొక్కరె శ్రీవెంకటేశ్వరునికి
పాయపువారి మనసు పట్టుమని
యీయెడఁ దా నన్నుఁ గూడె యిచ్చకము సేసుకొని
నాయము నేనె చెప్పేను నను పాయ నిఁకను. ॥ అప్ప ॥ 218

## రామక్రియ

ఏల నీవు చిన్నఁబొయ్యే వేఁటి కానలు వెట్టేవు
జాలిఁ బెట్టి బొమ్మలను జంకించేనా ॥ పల్లవి ॥

అలిగి నీతో మాటలాడ కెంతవుండినాను
చలములు గడు నేము సాదించేమా
నిలిచి నేఁ గడు నిన్ను నేరము లెన్నించినాను
బలుములు చూపి యిట్టె భ్రమయించేమా ॥ ఏల ॥

యెనయక కోపాన నే యింటిలోనె వుండినాను
వెనక నీ చేఁతలు నేవెళ్ల వేసేనా
మనసునఁ గాఁతాళించి మంకులు నే నెరపిన
పెనఁగి పిలిచి నీతో బీరము లాడేనా ॥ ఏల ॥

పదరి నీతో నెంత పంతము నే నాడినాను
అదన నిన్నుఁ గూడక అలయించేనా
యెదుట శ్రీ వెంకటేశ యిటు నన్నుఁ గలసితి
వుదుటున నే నీతో నోప ననేనా. ॥ ఏల ॥ 219

భైరవి

ఆఁటదానికి పతితో నంతచెల్లునా
  చీటికి మాటికి యంత సేసేవె నీవు ॥ పల్లవి ॥

పట్టినదె చల మని పంతములె నెరపేవు
  అట్టె యాతని ప్రియము లంగవించవు
  చిట్టకాలు వద్దనిన చెలులమాటలు చెవిఁ
  బెట్టవు నీకుఁ దగిన బీరములె కాని ॥ ఆఁట ॥

ఆడినదె మాటసేసి యట్టె నిలువఁ బెట్టేవు
  జోడుగా నాతని మాట చొరనియ్యవు
  తోడనె నే మిద్దరి చేతులుఁ బట్టి కూరిచిన
  కూడియుఁ గూడవు నీ గుణములె కాని ॥ ఆఁట ॥

మొదలివొట్టుకు నీ మొనలు చూపేవు గాని
  అదనైన మీఁద నింక నటు మెచ్చవు
  యిదివో శ్రీ వెంకటేశుఁ డిదె నిన్నుఁ గూడినాఁడు
  చదురు లింకా నీవు సాదించేవు గాని. ॥ ఆఁట ॥ 220

మంగళకౌశిక

దయఁదలఁచుక నేనె తగిలి కూడితి నిన్ను
  క్రియ చూపక నే నుంటె గెంటించఁ గలవా ॥ పల్లవి ॥

నంటున నీతో నేను నగఁగానె సందుకొని
  అంటు ముట్టి సరసము లాడేవు గాక
  జంటమాటలాడక చలపట్టి నే నుండితే
  వొంటినే సాదించి నన్ను వొరయఁగఁ గలవా ॥ దయ ॥

పొత్తుకుఁ బిలిచి నేనె పొదుగఁగానె నీవు
  హత్తుక నీ వింతేసి పొందైతివి గాక
  గుత్తపు నాగుణముతో గుట్టుసేసుక వుండితె
  చిత్తగించి నీ చలము చెల్లించుకోఁ గలవా ॥ దయ ॥

చేయి చాఁచి నే నిన్ను చెనకి కాఁగిలించఁగా
    యీాయడ నన్ను నేఁడె యేలితి గాక
చాయల శ్రీవెంకటేశ సరికి బేసికి నీతో
    మాయలు నేఁ జేసితేను మారు కొనఁగలవా. ॥ దయ ॥ 221

పాడి

ఇంతిమాటలకు నేల యెగ్గు పట్టేవు
    చెంతల నాపె చనవు చెల్లించరాదా ॥ పల్లవి ॥
అగపడి లోనైతె అన్ని నవ్వులె కాక
    యెగసక్కెలాడే నంటే యెంతలేదు
చిగిరించినట్టి వేళ జిగిఁ బండినట్టి వేళ
    వొగరుఁ దీపునుఁ దోఁచు నొక్కటందే కాదా ॥ ఇంతి ॥
సరిఁ జుట్టరికానకు సరసాలె అన్నియును
    యెరవులు సేసుకొంటే నెంతలేదు
తొరలఁ గాఁచినప్పుడు తోడంటు వెట్టినప్పుడు
    పెరుగుఁ బాలును నొక్కపేరుపునే కాదా ॥ ఇంతి ॥
కొయ్యవై శ్రీవెంకటేశ కూడుకొంటి వాపె నిట్టె
    యియ్యకోలు సేసుకొంటే నెంతలేదు
చయ్యన దంచినచోట చవిగా వండినచోట
    బియ్యము వంటకమై బెరసేదే కాదా. ॥ ఇంతి ॥ 222

288-వ రేకు సామంతం

అప్పటినన్నె కొసరీ నదివో ఆపె
    నెప్పున నన్నిపనులు నీకె తెలుసును ॥ పల్లవి ॥
తెగరానిచోట వాదుదీసి యెంతమాటాడిన
    పగలేదు చనవుల బలిమె కాని
మగవాఁడ వందుమీఁద మట్టుపడనోపుదువు
    తగవులు మమ్మేల యిత్తరి నడిగేవు ॥ అప్ప ॥

వలచినవారు పైపై వాసులెంత నెరపిన
చలములుగావు రతిచవులె కాని
బలువుఁడ వందు మీఁద పనిగొన నోపుదువు
చలివాసి మమ్మేల సాకిరివెట్టేవు ॥ అప్ప ॥
ఆరితేరిన దంపతు లాయము లెం తంటినాను
నేరుపులేకాని అందు నెగులులేదు
కూరిమి శ్రీవెంకటేశ కూడితి వందుమీఁదను
నాఁకొన మాతో నేల నవ్వులు నవ్వేవు. ॥ అప్ప ॥ 223

## లలిత

ఎక్కడి సుద్దు లేరె యిది గొంతా
చిక్కితి నీపాలను విచ్చేయవయ్య లోనికి ॥ పల్లవి ॥
చింతలేక నీకు నీవె సేసిన సేఁతలకును
యెంత నేము దూరినా నీకేఁటి వెరపు
చింతించ నీ కేఁటికి చెక్కుచేయి యేఁటికి
వింతవార లిదిగంటే వేసా లనరా ॥ ఎక్క ॥
దెప్పరాన నీవు లోలోఁ దిరిగే తిమ్మటలకు
యిప్పటి మా యలుకలు యేడ కెక్కును
రెప్ప లెత్తి చూచేవు రేసువటి యున్నాఁడవు
యిప్పటి నీజాడలెల్లా యెగసక్కె లనరా ॥ ఎక్క ॥
కదిసి నీ మేనను కల్ల లెన్ని దోఁచినాను
యెదుట నున్నాఁడవు నిన్నే మనేము
అదన శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
చదురుఁడ విన్నిటి(టా?)ను జాణవు నీ వనరా. ॥ ఎక్క ॥ 224

## హిందోళం

అందాఁకా వేగిరమా ఆఱడికాఁడ
చిందేవు మాటలఁదేసె చెల్లు నీకు నయ్యా ॥ పల్లవి ॥

నవ్వుతా నేనుండఁగానె నంటున గిలిగించేవు
అవ్వల నీ కింకా నెంత ఆసోద మోయి
పువ్వువంటి నావయసు పూఁచి నీపైఁ జల్లఁగానె
తవ్వేవు జాణతనాలు తమకి వాదువు ॥ అందా ॥

దగ్గరి నే నుండఁగానె దండకు నొత్తుకొనేవు
వెగ్గళించి నీ కెంత వేగిరమోయి
సిగ్గుదేరి నీ మీఁద చేతులు నేఁ జాఁచఁగానె
వొగ్గి కాఁగిట బిగించేవు వుబ్బుకాఁడ వాదువు ॥ అందా ॥

కలసి నే నుండఁగానె కమ్మి రతికిఁ దీసేవు
లలి శ్రీవెంకటేశుఁడ లావరి వోయి
యెలమి నన్నేలితివి యియ్యకొంటి నే నట్టె
పలుకుఁ బంతము చెల్లె పనివాఁడ వాదువు. ॥ అందా ॥ 225

ధన్నాసి

కోరి చేకొనఁగరాదు కోపగించు కొనరాదు
యీరీతి విచ్చేసితివి యేడనుండో యీడకు ॥ పల్లవి ॥

పొదిగేవు వొకవేళ పొరలేవు వొకవేళ
అదిబిదుకు వలపు లవియాల
వెదకితి మాపునంత వేగించితి వేగునంత
యిదిగో విచ్చేసితివి యేడనుండో యీడకు ॥ కోరి ॥

మనసువచ్చొకమాట మనసురాకొక మాట
అనుమానపు చెనకు లవియాల
చనవు చల్లితిగొంత సరస మాడితిగొంత
యెనయ విచ్చేసితివి యేడనుండో యీడకు ॥ కోరి ॥

చేయిచాఁచే వప్పటిని సిగ్గువడేవు కమ్మటి
ఆయ మెరఁగని రతు లవియాల
పాయక శ్రీవెంకటేశ పైకొని కూడితి విట్టె
యీయెడ మేలుకొంటివి యేడనుండో యీడకు. ॥ కోరి ॥ 226

## ముఖారి

కూరిమిఁ గొసర నేల కొంక నేల
బీరముతో నుండుఁగాక పెనఁగంగ నోపమే ॥ పల్లవి ॥

సంగడిఁ గూచుండనేల జగడ మాడఁగనేల
వుంగిటి నివ్వలిమోమై వుండేమె నేము
ముంగిటఁ దా రమణుఁడు ముసి ముసి నవ్వులతో
రంగుమీరి వుండుఁగాక రవ్వసేయ నోపమే ॥ కూరి ॥

యింటికిని రానేల యెగసక్కె మాడనేల
వొంటినైనాఁ బానుపుపై నుండేమె నేము
జంటలై తా నందరితో సరసము లాడుకొంటా
వెంట వెంట రా నీవె వేసరించ నోపము ॥ కూరి ॥

తప్పక చూడఁగనేల తమకించ నింతయేల
వొప్పగు నివ్వెరగుతో నుండేమె నేము
అప్పటి శ్రీవెంకటేశుఁ డాతఁ డిట్టె నన్నుఁ గూడె
వుప్పటించి పూరడించి వొద్దఁ బాయ నోపము. ॥ కూరి ॥ 227

## పాడి

ఎవ్వరి బలువెక్కుడో యిద్దరిలోన
రవ్వగా నానతీవయ్య రామచంద్ర మాకు ॥ పల్లవి ॥

చెక్కుటఁ బెట్టిన చేయి సేతువుగట్టినకట్ట
చక్కని సీతాచింతాజలధికిని
పెక్కుకొండలచే నీవు పెనచి కట్టించితివి
వొక్కమాటె ఆపె అయితె నుండుమంటె నుండెను ॥ ఎవ్వ ॥

మించి చెలి పులకింపు మోహవనవాసము
మించిన విరహముల మితిమేరకు
సంచరించి నీవైతె జగమెల్ల నిండితివి
యించుకంటిలోన నాపె యీడనుండె నిండెను ॥ ఎవ్వ ॥

వొట్టిన నీ కాఁగి లయోధ్యలోనిపట్టము
నెట్టన శ్రీవెంకటేశ నీ దేవికి
అట్టుగా నీ వింతలో నాఁడి రాజ్య మేలితివి
యిట్టె మరురాజ్యమేలె యీ యింతి రతులను. ॥ ఎవ్వ ॥ 228

289-వ రేకు ముఖారి

ఎంతలేదు మాటలు యేడ కేడ సుద్దులు
యింతవాఁడ వౌత నిన్ను నెరఁగనా నేను ॥ పల్లవి ॥

యెక్కడనుండోవచ్చి యిచ్చకము సేసి నా
చెక్కులు నొక్కినదె సెలవా నాకు
వొక్కమాటె నవ్వు నవ్వి వొడివట్టి తీసి నన్ను
తక్కులఁ బెట్టినదె తనివారెనా ॥ ఎంత ॥

నిద్దుర గంటికిరాఁగా నీ చేఁతలు దాఁచుకొంటా
వద్దఁ గూచుండినదె వరుసా నాకు
సుద్దులెల్లఁ జెప్పి చెప్పి చొక్కులఁ బెట్టుచు నాతో
పొద్దున మంచ మెక్కితె పొందికాయనా ॥ ఎంత ॥

పేడుకలు దైవార వేసాలకుఁ బొగడుతా
యీడ నన్నుఁ జెనకేదె యీడె నాకు
కూడితి శ్రీ వెంకటేశ గుణ మెరిఁగి నన్నిట్టె
జోడువాయ కుండితేనె సోద్యమాయనా. ॥ ఎంత ॥ 229

నాదరామక్రియ

విన్నప మేఁటికి వేమారు
పన్నిన కరఁగులఁ బదరీఁ జెలియా ॥ పల్లవి ॥

ముసి ముసి నవ్వుల ముంగారు ముంపులు
వసివాడుఁ జెమట వానలు
ముసుఁగుల సిగ్గుల మూడామంచులు
కుసుమై వలపులె కురిసీఁ జెలియా ॥ విన్న ॥

కన్నుల తేటల కప్పుర మాకుల
సన్నపు నిట్టూర్పు సంపెంగల
చిన్ని నెరిఁ గురుల చీఁకటి మాకుల
వన్నె మదరసము వడిసీఁ జెలియా ॥ విన్న ॥
సరి మోవులనె వసంతపు చిగురుల
పరగుఁ గుచము లను ఫలములను
యిరవై శ్రీ వెంకటేశ నినుఁ గలసి
పొరిఁ బొరి విందుల పూచీఁ జెలియా. ॥ విన్న ॥ 230

## సాళంగనాట

చేతికి లో నైనప్పుడు చెప్పేఁగాని
యేతుల సెలవి నవ్వు లీడ నేలా ॥ పల్లవి ॥
ముంగిట నే నుండఁగాను మోహించి చెనకేవు
అంగడిచుట్టరికాలు అవియాల
రంగుగా నీవున్నచోటు రాతిరే వింటిమి నేము
యెంగిలి పొత్తుల మాట లీడ నేలా ॥ చేతి ॥
వొంటి నే నుండఁగాను వొడివట్టి పెనఁగేవు
కంటిఁ గంటి గురుమ కత లేల
వుంటిమి నీవన్నిటాను వొరపరి వొదువు
వెంటపట్టుసరసాలఁ బెనఁగ నేలా ॥ చేతి ॥
కదిసి నే నుండఁగాని కాఁగిటఁ గూడితివి
పొదుగుడువలపుల పొదు లేల
అదివో శ్రీవెంకటేశ అన్నిటాఁ జొక్కితి నేను
అదనైనప్పుడె జోహా రన నేలా. ॥ చేతి ॥ 231

## వరాళి

మీరు మీరు నొక్కటే మీఁద నన్నీ మంచివే
ఆరితేరె మీ వంక నలయించకువమ్మా ॥ పల్లవి ॥

వెంతల నాతఁడు నీ చెక్కు నొక్కి వేఁడుకొనీ
పంతము దప్పదు నేఁడు పలుకవమ్మా
యంతలే దీ యలుకలు యెవ్వరికి సతమాయ
వింతదానఁ గాను సిగ్గు విడువవమ్మా ॥ మీరు ॥

పక్కన నీరమణుఁడు పచ్చడము గప్పె నదే
వెక్కసపు చలములు విడువవమ్మా
కక్కసపు సాదనలఁ గట్టుకొనే దేమున్నది
యిక్కడ ననుమానించే వెవ్వ రున్నారమ్మా ॥ మీరు ॥

శ్రీ వెంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడె నిదె
చేవదేరెఁ గెమ్మోవి చెలఁగవమ్మా
వేవేలు చెప్పినాను వేడుకకు వెలలేదు
మోవులనె నవ్వేవు మెరఁగ నే లమ్మా. ॥ మీరు ॥ 232

గౌళ

ఏఁటికయ్య మాఁటలు యింకా తాటతూఁటలు
యీటువెట్టుకొని నిన్ను నే మనేము నేము ॥ పల్లవి ॥

వెంగట నీవు సేసిన చేఁతలు లే వనఁగాను
అంగమెల్లఁ జెమరించె నందుకుఁగానె
సింగారపు నీ మేని చిందువందు లెల్లఁ జూచి
యింగితానఁ బులకించె నిందుకుఁగానె ॥ ఏఁటి ॥

నెట్టనఁ గొత్తలుగొన్ని నేరుచుక వుండఁగానె
అట్టె వుసురంటి నే నందుకుఁగానె
వొట్టువెట్టుక నిన్ను వొడివట్టి తియ్యఁగాను
యెట్టకేల కియ్యకొంటి నిందుకుఁగానె ॥ ఏఁటి ॥

గక్కనఁ గాఁగిట నన్నుఁ గాఁగిలించి కూడఁగానె
అక్కరతో నియ్యకొంటి నందుకుఁగానె
మక్కువ శ్రీ వెంకటేశ మంచితనాలు సేయఁగ
యిక్కువలంటి మొక్కితి నిందుకుఁగానె. ॥ ఏఁటి ॥ 233

దేసాళం

నిన్నటి మొన్నటికాఁక నేఁ డేఁటికే
 యెన్నికెతో రమణుఁడ యియ్యకోలైతివి ॥ పల్లవి ॥

మక్కువ నాపైఁ జల్లి మన్ననలు నించితివి
 యెక్కుడి సుద్దులు నీకు నేమి చెప్పేము
 చెక్కులూనుఁ బులకించె చేతు లిట్టె చెమరించె
 వెక్కసాననె నిన్ను వెంగెమాడ నేఁటికే ॥ నిన్న ॥

మెచ్చి నన్నుఁ బొగడుచు మీఁదఁ జేయి వేసితివి
 మచ్చరాలుఁ గపటాలు మానితి మిఁక
 పచ్చడము గప్పఁగాను భావ మెల్లఁ గరఁగితి
 కొచ్చి కొచ్చి యిఁక నిన్నుఁ గొసర నేమిటికే ॥ నిన్న ॥

కన్నుఁగొనలనె నవ్వి కాఁగిట నన్నుఁ గూడితి
 వె న్నె(న్న?)ని సంతోసాలు యిఁక నెంచేము
 వున్నతి శ్రీవెంకటేశ వొద్దికైతి మిద్దరము
 పన్నుకొని వాసిరేఁచే పంతము లేమిటికే. ॥ నిన్న ॥ 234

290-వ రేకు మెంచబౌళి

బొదువుజాణవు నీవు అన్నీ నెరుంగుదుము
 నీ దొరతనము లెల్ల నెలఁతపయినా ॥ పల్లవి ॥

చెనకీ ఆపె నీకుఁ జేసిన మేలుకును
 ననిచి నీ కన్నులను నాటఁ జూచేదా
 చనవిచ్చి కమ్మటిని చన్నుల నొత్తినందుకు
 పనిలేని బీరాలతో పంతమాడేదా ॥ బొదు ॥

లలన నిన్నుఁ దిట్టి లాలించిన లాలనకు
 చలపట్టి బొమ్మలను జంకించేదా
 నెలవుగ నీ మేను నిమిరినందుకు నీవు
 కొలఁదిలేని తిట్లఁ గోపగించేదా ॥ బొదు ॥

కందువ నీ దేవి నిన్నుఁ గాఁగిట నించినందుకు
చందముసేసుక నీవు సారె నవ్వేదా
యిందునె శ్రీవెంకటేశ యిద్దరూ నొక్కటైతిరి
యిందరిలోపల నీవు యెమ్మెలాడేదా. ॥ ౙాదు ॥ 235

భైరవి

వాకిట నే లున్నాఁడవు వనితమాటలె యివి
లోకులు మెత్తురు నిన్ను లోనికిరావయ్యా ॥ పల్లవి ॥
అంగనపాదంబుల అందెలు మెట్టెలునె
సంగతి విన్నుఁ బిలిచీఁ జాలదా యిది
యెంగిలినోటఁ బిలిచే దెగ్గనివుంటే నీవు
అంగవించి లోనికిరా వదియేమయ్యా ॥ వాకిట ॥
కంకణసూడిగములె కడు నీతో మాఁటలాడీ
యింక ననుమానము నీ కేఁటికి నేఁడు
పొంకపు మొనదంతాలు పూఁచి ప్రియము చెప్పదు
అంకెలఁ బానుపుమీఁద నట్టె కూచుండవయ్యా ॥ వాకిట ॥
మొలనూలిగంటలనె ముచ్చట నీతో నాడీ
యెలమి శ్రీవెంకటేశ యియ్యకోరాదా
మెలఁగి పెదవితేనె మీఁదు నీ కెత్తుకున్నది
కలసితి నాపె నిట్టె కంటివిగదయ్యా. ॥ వాకిట ॥ 236

ముఖారి

కదిసితి రిద్దరూను కడమ లేలా
పొదిగి చెలులుచెప్పే బుద్ధులెల్లా వినవే ॥ పల్లవి ॥
వద్దెలెకోపము వలవని తాపము
సుద్దులు విన్నందుకె సూడువట్టేవా
చద్దులాయను వొట్లు చలము సాధించనేల
గద్దించినందు కతనిఁ గాఁగిలించుకొనవే ॥ కది ॥

యేమిటికే బిగువు యింకానా తగవు
మోము చూచి నవ్వితేనె మోపుగట్టేవా
నాములెక్కెఁ బంతములు నాలిసేయ నీకనేల
కైమీరినందు కతనిఁ గాఁగిలించుకొనవే ॥ కది ॥
అలయకువే నీవు అప్పటి సొలయకువే
తలఁపులో రతులు పాఁతరఁ బెట్టేవా
యెలమి శ్రీవెంకటేశుఁ డింపునేసి నిన్నుఁ గూడె
కలఁక లన్నియుఁ బాసె కాఁగిలించుకొనవే. ॥ కది ॥ 237

## రామక్రియ

ఎంతటి వేగిరకాఁడు యేమే తాను
చెంతల నిచ్చుచుంటేనె చెరఁగువట్టీనా ॥ పల్లవి ॥
కోపగించ వద్దు గాక కొసరవద్దంటినా
తీపులువెట్టుక యాలో తిట్టీఁ గాకా
యీపనికి నే నవ్వి యిందరివలెనె కొంత
చూపులు పైమోపితేనె సుంకముగొసీనా ॥ ఎంత ॥
బీర మాడవద్దు గాక పెనఁగవద్దంటినా
కేరడాన నేఁటికో జంకించీఁ గాక
గోరగీరిని చెమటకుమ్మరించఁ జోటులేక
జోరునఁ బైఁజిమ్మితేనె సూళ్లువట్టీనా ॥ ఎంత ॥
కాఁక రేఁచవద్దు గాక కలయవద్దంటినా
వేఁకపుఁ దావులు యాలో వేసీఁ గాక
యేఁకటతో శ్రీవెంకటేశుఁడె తా నన్నుఁ గూడె
సోఁకె చన్నుమొనలకు జోడుదొడిగీనా. ॥ ఎంత ॥ 238

## సామంతం

నీ వెఱఁగవా నిందుఁ దగవు లివి
కావరంపుఁబని కాంతకుఁ దగునా ॥ పల్లవి ॥

నిగ్గుల పతి వట నెలఁతను నే నట
సిగ్గువడక నినుఁ జెనకుదునా
యెగ్గులు వట్టితి వెదురురానను చు
బగ్గన నాఁటది బలిమిసేయునా ॥ నీవె ॥

చదురుల దొర వట జవ్వని నే నట
అదనెఱఁగక నిను నలముదునా
కదిమి కొసరితివి గర్వినైతి నని
గుదిగొని కామిని గొరబుసేతునా ॥ నీవె ॥

శ్రీవెంకటేశ్వర శ్రీసతి నే నట
సోవగా నవ్వక సొలయుదునా
యీవలఁ గూడితి వియ్యకొంటి నని
కైవసమగు సతి కాదనునా. ॥ నీవె ॥ 239

శంకరాభరణం

దొడ్డవాఁడ వవుదువు దొరవూను నవుదువు
జిడ్డులేక వుండేది నీ చిత్త మింతేకాని ॥ పల్లవి ॥

తప్పక చూడఁగవచ్చు తలవంచుకొనవచ్చు
అప్పుడు గాతి కోరి చే దరుదుగాని
తిప్పుచుండవచ్చు మోము తేరకొన నవ్వవచ్చు
యిప్పటివలె నడపే దెక్కు డింతేకాని ॥ దొడ్డ ॥

వొగ్గి చేయి చాఁచవచ్చు నుద్దండాలు సేయవచ్చు
కగ్గులేక వలచేది ఘనముగాని
నిగ్గుబాస గొనవచ్చు నెలఁతలఁ బొందవచ్చు
యెగ్గులేక మెలఁగేదె యెన్నికింతేకాని ॥ దొడ్డ ॥

మాటలు బోదించవచ్చు మట్టుమీరి దాఁటవచ్చు
పాటించి రతి కెక్కేది భాగ్యముగాని
నీటున శ్రీవెంకటేశ నేఁడు నన్ను నేలితివి
వాటమై యిట్టె వుండేదె వన్నెమించుఁగాని. ॥ దొడ్డ ॥ 240

291-వ రేకు శంకరాభరణం

బాపు బాపు మేలు మేలు పంతగత్తె వౌదువే
నీ పంతములెల్లదక్కె నేర మేమిగంటివే ॥ పల్లవి ॥

చలము మానినఁ గాక సమ్మతింపించవచ్చునా
పెలుచుఁదనపు నీతోఁ బెనఁగెఁ గాక
నిలుచున్నాఁ వాతఁ డదె నే నిన్ను వేఁడుకొనేను
పలుకవు నీవైతే ఫల మేమిగంటివే ॥ బాపు ॥

మాటలాడేనంటేఁ గాక మంకు దెలుపవచ్చునా
సాటికి బేటికి నిన్ను సాదించెఁగాక
గీటీ గోర నతఁడు కేలుచాఁచి తీసే నేను
నీటువెట్టుకుందానవు నీ వేమిగంటివే ॥ బాపు ॥

నయముగలితేఁ గాక నాయము చెప్పవచ్చునా
దయవుట్టి నేనె నిన్నుఁ దగిలెఁగాక
క్రియఁగూడె శ్రీవెంకటగిరిపతి నే మెచ్చితి
ప్రియపడే విదె నీవు భేద మేమిగంటివే. ॥ బాపు ॥ 241

గౌళ

అతఁడు నీవు నొక్కటె అందరు నెఱుఁగుదురు
మాతోనె యింతేసి మతకమేలె నీవు ॥ పల్లవి ॥

తప్పక వొట్లువెట్టి దగ్గరి రమ్మనే వేమె
చెప్పరాదా నీ మాట సేసేఁ గాని
నెప్పున నాతఁడున్నాఁడు నే నెరఁగనా నీవొద్ద
చెప్పక నాతో మాయలు సేయనేలె నీవు ॥ అతఁడు ॥

వట్టి యాకతాలు చెప్పి వద్దికి దగ్గరే విదె
అట్టె వుండరాదా అన్నినయ్యీఁ గాని
తట్టి ఆతని ముదుల తచ్చనగాఁబోలు నిది
నట్టనడుమనె యేఁటి నాటకమె నీవు ॥ అతఁడు ॥

యిచ్చకము నేసి నన్ను యెలయించే విన్నిటాను
పచ్చిదేరెఁ జనులెల్ల పదవె యింక
చెచ్చెర నన్ను నలమి శ్రీవెంకటేశుఁడు గూడె
వచ్చె నీ పంతములు నవ్వఁగదె నీవు. ॥ ఆతఁడు ॥ 242

శ్రీరాగం

మాటలు యింకానా మానరు మీరు
నాటికి నేటికి మేలు నయమాయనే ॥ పల్లవి ॥

తెల్లనాయఁ గన్నులు తేనెగారెఁ గెమ్మోవి
వల్లెవాటుతోనున్నాఁడు వాఁడె చూడరే
పొల్లవద్దనుంటిరి పూనుక వచ్చితిరి
కల్లలు నిజము నందె కానవచ్చెనే ॥ మాట ॥

వింతవాసనలు నించె వెల్లులాయఁ జెమటలు
పంతముతోనున్నవాఁ డప్పటిఁ జూడరే
యింతులెల్లఁ గూడితిరి యియ్యకోలు నేసితిరి
యింతలోనె పాడిఁబంతా తెన్నికాయనే ॥ మాట ॥

చెక్కులెల్లఁ బులకించె చెలికిఁ జెయిలోనాయ
వెక్కసాన దగ్గరీని వీఁడె చూడరే
యిక్కడ శ్రీవెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెక్కువ తక్కువ లెల్లా నెంచనేఁటికే. ॥ మాట ॥ 243

కొండమలహరి

అన్నిటా నేఁ దనిసితి అందరును మెచ్చిరి
మన్ననలు తుదకెక్కె మాట లింకేలయ్యా ॥ పల్లవి ॥

యెప్పుడు వత్తువో యని యెదురు చూచినందుకు
చొప్పుతో నీ వున్నందుకు జోకలాయను
రెప్పలెత్తి చూచితేనె రేసువడె నామనసు
కప్పిన వేడుకలకు కడమలేదయ్యా ॥ అన్ని ॥

బత్తిగలవని నేను భామలతో నన్నందుకు
తత్తరపు నీ చేఁతకు తగవాయను
మెత్తనైతి నీయడకు మేలములు నమరెను
యెత్తి నీతో నున్నసుద్దు లేలచెప్పేనయ్యా ॥ అన్ని ॥
పొదిగి నే నీతోను పొందులు సేసినందుకు
యిదె నీవు గూడినందు కితవాయను
యెదిగి శ్రీవెంకటేశ యిరవైతిఁ దరవైతి
కదిసి నీరతులకుఁ గడమయేదయ్యా. ॥ అన్ని ॥ 244

సామంతం

నన్నుఁ జూచి నీవేల నవ్వే విఁక
యిన్ని సుద్దులకు నెల్లా యియ్యకొందువు గాక ॥ పల్లవి ॥
కన్నుల మొక్కినది కందువ చూపినది
యెన్నేసి చేఁతలు చేసీ నీపిన్నది
సన్నలు చేసినది చనవు మెరసినది
పన్నుగడలాఁ దొల్లె పనిగొందువు గాకా ॥ నన్ను ॥
ఆయాలు మోపినది ఆసలు రేఁచినది
యేయెడఁ జూచిన నీతో నీపిన్నది
చాయకుఁ దెచ్చినది సరస మాడినది
కాయముల కళలెక్కఁ గైకొందువు గాకా ॥ నన్ను ॥
చేతులు చాఁచినది సేసలు వెట్టినది
యేతుల శ్రీవెంకటేశ యీపిన్నది
నాతోఁ గూడించినది నలి నిన్నుఁ గడపలో
రాతిరిఁ బగలు నిట్టె రమింతువు గాకా. ॥ నన్ను ॥ 245

శుద్ధవసంతం

ఇచ్చగించుకొంట గాక యింపులే కలిగితేను
అచ్చలానఁ బెనఁగితే నది జాణతనమా ॥ పల్లవి ॥

తగులనాడినప్పుడు తమకించి నప్పుడును
జగడాలకుఁ బెనఁగ జాణతనమా
నగఁ దలఁచి నప్పుడు నాఁటఁ జూచినప్పుడును
అగడుసేయఁ బూనితే నది జాణతనమా ॥ ఇచ్చ ॥

కూరిమి చల్లినప్పుడు కొంగు వట్టినప్పుడును
సారె నూరకె వుండేది జాణతనమా
మేర మీరినప్పుడును మిక్కిలి లోనైనప్పుడు
ఆరీతి మాటలాడే దది జాణతనమా ॥ ఇచ్చ ॥

కందువ లంటినప్పుడు కాఁగిలించి నప్పుడును
చందము నేసుకోకున్న జాణతనమా
యిందులోనె శ్రీవెంకటేశుఁడు ని న్నిదెకూడె
అందుకేలె వెరగందే వది జాణతనమా. ॥ ఇచ్చ ॥ 246

292-వ రేకు మంగళకౌశిక

ఏల రట్టు సేసే వేమీ నేఁడు
చాలుఁ జాలు మాయెడను సటసేయవలదు ॥ పల్లవి ॥

పెదవుల మమ్మింతేసి పేరఁ బిలువకు మని
మొదల నిందుకుఁగానె మొక్కనా నీకు
అదనఁ గోపమున నీ యంకెకు రాకుండుదుము
యెదుట నప్పుడు నీవు యెగ్గు లెంచవలదు ॥ ఏల ॥

కన్నుల నవ్వకు మని కాఁకలు సేయకు మని
నున్నని చెక్కులు చేతనొక్కనా నేను
పన్నిన పంతములను పరాకున నుండుదుము
వన్నెల నీ వంతేసి వాసు లెంచవలదు ॥ ఏల ॥

పచ్చిసేసి నీవు మమ్మ బలిమిఁ బట్టకు మని
చెచ్చెర నీకుఁ బ్రియము చెప్పనా తొల్లె
యిచ్చల శ్రీవెంకటేశ యిటు నిన్నుఁ గూడితిమి
తచ్చనలుగావు యిఁకఁ దమకించవలదు. ॥ ఏల ॥ 247

పాడి

ఎఱిఁగివుందువుగాని యిందరివలెఁ జూడక
మఱవరానియట్టి మానాపతిసుమ్మీ ॥ పల్లవి ॥
చెలిచేత మాటాడించి సిగ్గువడి నీతోను
తలుపుమాఁటుననుండె తరుణి యదె
బలిమి నీ వంతలోనె పైకొనఁగా లోనాయ
యిలువెల్లరానియట్టి యిల్లాలుసుమ్మీ ॥ ఎఱిఁగి ॥
వొడికాన విడెమిచ్చి వున్నతిఁ జేతులుచాఁచి
కడపలోననెవుండి కాంత యదె
చిడుముడి నీ వంతలో చేవట్టఁగా లోనాయ
కడుముద్దరాలైన ఘనురాలుసుమ్మీ ॥ ఎఱిఁగి ॥
చేవదేర నిన్ను నదె చిలుకచేఁ బిలిపించి
వోవరిలోఁ బానుపుపైనుండి మగువ
నీ వంతలో లోనికేఁగి నెమ్మిఁ గూడఁగా లోనాయ
శ్రీవెంకటేశుఁడ యీపె చిన్నికన్నెసుమ్మీ. ॥ ఎఱిఁగి ॥ 248

గౌళ

పచ్చిదేరెఁ బసులు పమ్మఁజూపు మొనలు
హెచ్చె నిదె నామాట లియ్యకొనరాదా ॥ పల్లవి ॥
చెక్కుల నీ మెరుఁగు చిత్తజుని కరఁగు
యెక్కువ సిగ్గులఁ దల యేలవంచేవే
తక్కులేలె యింకను తగులాయ బొంకను
చక్కని నీ కెమ్మోవి చవిచూపరాదా ॥ పచ్చి ॥
మొలక నీ నగవు మోహముల తగవు
చెలఁగి నీ వది యేల చేతఁ గప్పేవే
పిలువవే యింటికి ప్రియమాయఁ గంటికి
తలఁచుక నీమాటకు దయఁజూడరాదా ॥ పచ్చి ॥

జంటల నీ చన్నులు జవ్వనపు టెన్నులు
అంటఁగాఁ బయ్యద నేల అట్టె మూసేవే
వెంటనే కూడితిని శ్రీవెంకటేశుఁడను నేను
పెంటలుగ నిట్లానె పెనఁగఁగరాదా. ॥ పచ్చి ॥ 249

శ్రీరాగం

విన్నవించ నేఁటికి విచారము లేఁటికి
నిన్నటనుండియు నాస నీకంటె గనము ॥ పల్లవి ॥

సిగ్గువడ్డ చెలిగాన చెనక కున్నదిగాని
అగ్గలము నీమీఁద నడియాస
దగ్గరె మొగమోటానఁ దలవంచుకుందిగాని
తగ్గని మోహము నీ చిత్తముకంటె గనము ॥ విన్న ॥

కొత్తగాఁ బెండ్లాడెఁగాన గుట్టున నున్నదిగాని
తత్తరించీ లోలోని తమకమైతె
హత్తి నీవు నవ్వేవని అంపకవున్నదిగాని
చిత్తిణి కోరికల నీజిగికంటెగనము ॥ విన్న ॥

రతికిదగ్గరెఁగాన రవ్వసేయకుందిఁగాని
చతురతలను నిన్ను జట్టిగొనును
యిత వెరిఁగి శ్రీవెంకటేశ యిట్టె కూడితివి
మితిమీరె యందుల నీమేలుకంటె గనము. ॥ విన్న ॥ 250

ముఖారి

కోపగించుకోఁగ నన్ను కొంగు వట్టే వింతెకాక
నావొందు వలసితేను నవ్వక నేనుందునా ॥ పల్లవి ॥

పంతములే యాడేవు బలిమిఁ జెయివట్టేవు
చెంతల నీచెప్పినట్టు సేయనాతొల్లి
యింత వేగిరకాఁడవు యెందువోతివి నిన్న నేఁ
జింతించేయప్పుడు రాఁగఁ జేకొననైతినా ॥ కోప ॥

సరసానకు వచ్చేవు సాదించఁ జూచేవు
గరిమ నీ వేమనినఁ గాదనేనా
నిరతి నే బాఁతైతే నీటుతో నేలవుంటివి
తరితీపై చెనకితే తనుపకమానేనా ॥ కోప ॥
యిచ్చకము లాదేవు యిట్టె కాఁగిలించేవు
గచ్చుల నలమేల్మంగఁగానా నేను
అచ్చపు శ్రీవెంకటేశ ఆయ మెరిఁగికూడితి
వెచ్చరికెతో నుండఁగ యిట్టె మెచ్చనైతినా. ॥ కోప ॥ 251

కాంభోది

కైవసపుదానఁగాని కపటిఁగాను
చేవదేర వలచితిఁ జిత్తగించవయ్యా ॥ పల్లవి ॥
కాయపు కాఁకలచేతఁ గసరుదు నొకవేళ
పాయపు మదము చేతఁ బదరుదును
చాయల సన్నల నిన్ను సాదింతు నొకవేళ
చేయెత్తి మొక్కే నిందుకే చిత్తగించవయ్యా ॥ కైవ ॥
యిచ్చిన చనవునను యీసడింతు నొకవేళ
గచ్చుల నీ వద్ద నుండి గర్వింతును
ముచ్చటలాడుచు గోరుమోపుదు నే నొకవేళ
చెచ్చెరఁ బంతమిచ్చేను చిత్తగించవయ్యా ॥ కైవ ॥
పాదములొత్తుచు నిన్ను భ్రమయింతు నొకవేళ
సోదించి శ్రీవెంకటేశ సొలయుదును
ఆదిగొని కూడితి నిన్నలమేల్మంగ నవుదును
సేదదేర మన్నించి చిత్తగించవయ్యా. ॥ కైవ ॥ 252

293-వ రేకు శంకరాభరణం

ఏల వేగిరించేవు యిట్టె నిన్నుఁ బంగించి
మేలిమి చేఁతలుచూపి మెప్పించేఁ జుమ్మీ ॥ పల్లవి ॥

నయగారి మాటలాడి నవ్వులు మాతో నవ్వేది
నియతము నీకుఁ దొల్లె నేఁడు గొత్తలా
ప్రియము నిన్నుఁ జేయించి బిగుసుకుండేవారు
కయివసముగ నీపైఁ గలిగేరు సుమ్మీ ॥ ఏల ॥

చాయల వలపుచల్లి సరస మాడేది నాతో
నీయందు గలిగినవే నేఁడు గొత్తలా
మాయలు నీతో నడపి మరులు గొలిపేవారు
కాయపుఁజుట్టాలే నీకుఁ గలిగేరు సుమ్మీ ॥ ఏల ॥

అడరి శ్రీవెంకటేశ అన్నిటా గెలుతువు యీ
నిడుదమొక్కులు దొల్లె నేఁడు గొత్తలా
యెడయక నన్నుఁ గూడి తిది చూచి సిగ్గువడి
కడకుఁ దొలఁగేవారు గలిగేరు సుమ్మీ. ॥ ఏల ॥ 253

ముఖారి

నలుగడ నిందరు నవ్వేరు
పెలుచై తానేల బెదరీనే ॥ పల్లవి ॥

నెయ్యపు మాటలు నీతోఁ జెప్పఁగ
వొయ్యనె తానేల వొరసీనే
అయ్యెడ నిజమరి అట్టెవుండక
కయ్యానఁ దానేల కలఁగీనే ॥ నలు ॥

తగవుకు నే నినుఁ దప్పక చూచిన
అగడుగఁ దానేల అడిగీనే
మొగమోటకాఁడు మోనాన నుండక
బెగడి అనేఁటికిఁ బెట్టెనే ॥ నలు ॥

లోఁగుచు నే నిను లోనికిఁ బిలువఁగ
కాఁగిట తానేల కదిమీనే
వీఁగక కూడె శ్రీవెంకటేశ్వరుఁడు
పొఁగి తానేఁటికి భ్రమసీనే. ॥ నలు ॥ 254

మంగళకౌశిక

ఇందాఁకా మాపని యిఁక నీపని
కందువాయ వలపుఁ కపట మే మున్నది ॥ పల్లవి ॥

చేతులనె మొక్కు మొక్కి సెలవుల నవ్వు నవ్వి
ఆతలనె నిలుచున్న దదివో చెలి
కాతరాన యిఁకమీఁదఁ గలిగిన పనులు నీ
చేతి విఁంతె యిఁక నీతో చెప్ప నేమివున్నది ॥ ఇందా ॥

కన్నులనె నిన్నుఁ జూచి కానుక నీ కంది యిచ్చి
అన్నిటా గుట్టున నున్న దదివో చెలి
సన్నలూను మీలోని సరసాలు నిటమీఁద
పన్నుకో నీవె నేర్తువు పలుక నే మున్నది ॥ ఇందా ॥

మచ్చిక నీకుఁ జేసి మనసు నీపైఁ బెట్టి
యిచ్చటఁ గాఁగిలించె నిదివో చెలి
అచ్చపు శ్రీవెంకటేశ అట్టె నీవు గూడితివి
యిచ్చకము లిటమీఁద నిన్ని నెఱుఁగుదువు. ॥ ఇందా ॥ 255

రామక్రియ

మించిన నాపంతములు మీ రెరఁగరా
నించిన కూరిములతో నెరవేరెఁ బనులు ॥ పల్లవి ॥

మనసిచ్చి తా నాతోను మాటలాడితేఁ జాలు
యెనయక వలవక యెందువోయీనే
పెనఁగక మీ రాతనిఁ బిలుచుకరారే యిందు
తనుఁదానె అన్ని నయ్యీఁ దరవాతిపనులు ॥ మించి ॥

దంటతనమున కటు తగులఁ జూచితేఁ జాలు
యింటికిరాక డాయక యెందువోయీనే
గొంటుపరచక వద్దఁ గూచుండఁ బెట్టితేఁ జాలు
నంటుతోన మంచి వయ్యీ నడుమనే పనులు ॥ మించి ॥

పట్టి శ్రీవెంకటేశుఁడు బలువుఁడు నన్నుఁ గూడె
యిట్టెవుండక యిఁక నెందువొయ్యీనే
గట్టినేసితిరి మీరు గలిగివుండితేఁ జాలు
నెట్టన రతికెనెక్కె నేరుపైన పనులు. ॥ మించి ॥ 256

సామంతం

కోడెకాఁడు వీఁడె వీఁడె గోవిందుఁడు
కూడె నిద్దరుసతుల గోవిందుఁడు ॥ పల్లవి ॥
గొల్లెతల వలపించె గోవిందుఁడు
కొల్లలాడె వెన్నలు గోవిందుఁడు
గుల్ల సంకుఁజక్రముల గోవిందుఁడు
గొల్లవారంటఁ బెరిగె గోవిందుఁడు ॥ కోడె ॥
కోలచేఁ బసులగాచె గోవిందుఁడు
కూలఁగుమ్మెఁ గంసుని గోవిందుఁడు
గోలయై వేలఁ గొండెత్తె గోవిందుఁడు
గూళెపుసతులఁ దెచ్చె గోవిందుఁడు ॥ కోడె ॥
కుందనపు చేలతోడి గోవిందుఁడు
గొందులు సందులు దూరె గోవిందుఁడు
కుందని శ్రీవెంకటాద్రి గోవిందుఁడు
గొందిఁ దోసె నసురల గోవిందుఁడు. ॥ కోడె ॥ 257

శంకరాభరణం

వద్దెలె బలిమి వసముగాఁ డిఁక
బుద్దెరిఁగి తానె పొదిగీఁ గాకా ॥ పల్లవి ॥
వలవనివారిని వలపించఁబోతే
వెలికి లోనికె వేసటలే
ములిగేటివారి మోపుమోవుమంటే
కొలఁదిమీరిన కోపమురాదా ॥ వద్దె ॥

మాటాడనివారి మాటాడించఁబోతే
తాటించి యెగ్గులుఁ దప్పులునే
పోటిదొరలతోఁ బొందులు సేసితే
సాటికిఁ బేటికి జంపులెకావా ॥ వద్దే ॥

వూరకున్నవారి నొడివట్టితేను
బీరాలతో వట్టిపెనఁగులే
యీరీతి శ్రీవెంకటేశుఁడు గూడెను
నేరుపులకెల్ల నేగురిగాదా. ॥ వద్దే ॥ 258

294-వ రేకు కన్నడగౌళ

ప్రియములెల్లా నీవి బిగువు నాది
దయలేనిదాన యేలో తగిలేవా కాని ॥ పల్లవి ॥

చెక్కులు నీవు నొక్కఁగ సిగ్గువడ్డదాన నేను
యెక్కడికెక్కిన మాట లేమాడేవు
మొక్కులు నీవు మొక్కఁగ మోనానసుందాన నేను
చొక్కుల నీ కేనాటి చుట్టమనొ నేను ॥ ప్రియ ॥

సరసము నీవాడఁగ జంకించినదాన నేను
యెరవులపొందు నాతో నేల సేసేవు
సిరసు నీవు ముట్టఁగ చెనకకుందాన నేను
నరిగా నీ కెటువలెఁ జవులైతి నేను ॥ ప్రియ ॥

నీవు గాఁగిలించుకోఁగ నివ్వెరగందితి నేను
చేవదేరెఁ బను లెంతసేసేవు నీవు
శ్రీవెంకటేశ్వర నన్నుఁ జేకొని కూడితి విట్టె
సేవగా నిచ్చక మెంతసేసితినొ నేను. ॥ ప్రియ ॥ 259

భైరవి

మామాటవినవెకొంత మన్నించి నీవు
నీమనసు కోరికల నేరుపులలోనా ॥ పల్లవి ॥

మొక్కకువె నిన్నతఁడు మొగము చూచినదాఁక
గుక్కచు నింతుల పెద్దకొలువులోన
పెక్కుమాట లాడకువె పేరఁ బిలిచినదాఁక
అక్కరైన సరసపుటాసలలోన ॥ మామా ॥

కేరి నవ్వకువె తానె కేలు పయిచాఁచినదాఁక
సారమైన వలపుల సందడిలోన
ఆరసి చూడకువె నిన్నాయము లంటినదాఁక
బీరపు తమకముల పెనఁగులలోన ॥ మామా ॥

కొసరకువె యాతఁడు గొబ్బునఁ గూడినదాఁక
ముసగసల యాకతముల మీలోన
యెసగి శ్రీవెంకటేశుఁ డిదివో నిన్నుఁ గలసె
అసురుసురుగాకు నెయ్యములలోన. ॥ మామా ॥ 260

బౌళి

తొల్లిటివంటిదానవా తొయ్యలినీవు నీ
వెల్లవారికంటె జాణ వెన్నికాయఁ జేఁతలు ॥ పల్లవి ॥

దగ్గరఁ బిలిచి నిన్ను తన్నుఁదానె మాటదీసి
సిగ్గు విడిపించెఁగదె చెలువుఁడు
వెగ్గళించి ఆతనిపై వేసితివి చేయి నీ
అగ్గలిక లెల్లఁ జెల్లె నాయఁగదె పనులు ॥ తొల్లి ॥

సరసపు మాటలాడి సన్నల నవ్వులు నవ్వి
వెరవు చూపీఁగదె విభుఁడు నీకు
దొరతనము నెరపి తొక్కితివి పాదము నీ
యిరవు చేకొంటివి యిఁక నేలె సుద్దులు ॥ తొల్లి ॥

అందాన నిన్నుఁ బొగడె నలమేలుమంగ వని
విందుగా నిన్నుఁ గూడె శ్రీవెంకటేశుఁడు
మందెమేళమున నీవు మర్మము లంటితి విట్టె
యిందరిలోపలఁ దుదకెక్కెఁ గదె కతలు. ॥ తొల్లి ॥ 261

శంకరాభరణం

నేనేల తనునాడె నేఁడుగొత్తలా నాకు
తేనెగారే తనమోవి దిష్టమున్న దనవే ॥ పల్లవి ॥

తెల్లని తనకన్నులు దిమ్మరి జాగరముల
నెల్లవారుఁ జూడఁజూడ నెఱ్ఱనాయను
యెల్లిదము లాడేనంటా నెవ్వరిఁ గోపగించీనె
చల్లని తనచేఁతే విచారించుకొమ్మనవే ॥ నేనే ॥

పాలుగారే తనమోము భామలతో సాములను
వాలాయముగా నిదివో వసివాడెను
గేలితో నేఁజూచేనంటా కేరడ మే లాడీనె
తేలింపుఁ దనగుణమే తెలుసుకొమ్మనవే ॥ నేనే ॥

జిగిగొన్న తనమేను చెప్పరాని చేఁతలను
వెగటుఁ జెమట లుబ్బి వింతలాయను
నగి శ్రీవెంకటేశుఁడు నన్నుఁ గూడె నింతలోనె
మగటిమి నింక నిట్టె మన్నించుమనవే. ॥ నేనే ॥ 262

మధ్యమావతి

అన్నిటా జాణవుగావా అంతేసి నీవెఱఁగవా
యెన్నికగా మన్నించక యేలమానేవూ ॥ పల్లవి ॥

వచ్చేదాఁకా వేగిరమై వడిఁ బిలువనంపుదు
యిచ్చల నీ విందురాక యేలమానేవు
పచ్చియైన నామనసు పట్టలే నింతెకాక
యిచ్చిన నీబాసలు నీ వేలతప్పేవు ॥ అన్ని ॥

నవ్వేదాఁకా వేగిరమై నలిఁ బదరుదుఁగాక
యివ్వల నన్నుఁ జెనక కేలమానేవు
రవ్వసేతు నింతెకాక రతి నాసవతులలో
నెవ్వరి మెచ్చక పొంద కేలవిడిచేవు ॥ అన్ని ॥

వెసఁ గాఁగిలించుదాఁకా వేగిరించి కొసరుదు
యెసగి నన్నుఁ గలయ కేలమానేవు
కొసరి శ్రీవెంకటేశ కూడితివి నన్ను నీవె
యిసుకమీఁదైన చేఁత లేలమరచేవు. ॥ అన్ని ॥ 263

కాంబోది

ఎఱఁగవుగాక నీవు యిందరివలెనా నేను
గుఱుతైన చేఁతచెప్పఁ గూళలున్నారా ॥ పల్లవి ॥

పచ్చిగా నిన్నుఁ గూడించి పంత మాడేదాననా
తచ్చి గుట్టుసేసి దాఁచేదాననఁగాకా
యిచ్చల సిగ్గువడి నాకేల వెరచేవు నీవు
ముచ్చట బాయిటవేసే మూఢులున్నారా ॥ ఎఱ ॥

మాటలు వెలుచుక ఆ మర్మా లెత్తేదాననా
తాటించి కప్పుకవచ్చేదాననఁగాకా
గాఁటాన నన్నుఁజూ చేల కడుఁ దలవంచేవు
కూటమి అట్టుసేయను గొల్లదాననా ॥ ఎఱ ॥

వెలి నిన్ను మరిగించి వెంటఁ దిప్పేదాననా
తలఁగక యెనసుండేదాననఁగాకా
యెలమి శ్రీవెంకటేశ యిట్టె పొం దేల లోఁగేవు
యెలయించి నిన్ను నవ్వేయెడ్డలున్నారా. ॥ ఎఱ ॥ 264

295-వ రేకు దేసాక్షి

ఏమినవ్వేవు మాతోను యెందాఁకా నీపంతము
మోముచూచి ఆపెచేత మొక్కించుకోవయ్యా ॥ పల్లవి ॥

చన్నులతోనె మొలచె సతికి నీపై వలపు
కన్నుల చూపుల నంటెఁ గడు నీరూపు
వున్నది నీరాకగోరి వోవరిలోపల నిట్టె
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా ॥ ఏమి ॥

కురులయన్నె కలవు కొమ్మకు నీపై చింతలు
తొరలెఁ జుట్టరికము దొమ్మిమేలాల
పరపుపై నదె నీపై పాటలువింటాఁ జొక్కి
యిరవిదె మన్ననకు యెఱఁగుకోవయ్యా ॥ ఏమి ॥

మాటలవెంటాఁ దగిలె మనసు యీకాంతకు
కూటము లన్నియునాయ కొనయాసల
యీటుతో శ్రీవెంకటేశ యెనసె నీవు రాఁగాను
తేటతెల్లమాయ మేలు తెలుసుకోవయ్యా. ॥ ఏమి ॥ 265

వరాళి

చూచితి నప్పుడే వాని సోరణగండ్ల నేను
యేచివేరె సింగారించి యిటుదోడితేరే ॥ పల్లవి ॥

గందవొడి చల్లరె కడుఁ జెమరించె మేను
ముందు ముందు విడెమీరె మోవివాడెను
చెంది నే నవిచూచితే సిగ్గువడీ నాతఁడు
మందలించి యలపార్చి మరితోడితేరే ॥ చూచి ॥

నిండఁ బన్నీరు చల్లరె నిట్టూర్పు నించీని
దండనె విసరరె దప్పిఁ బొందీని
వొం డుపచారాలు నే నొకటిసేసినా లోఁగీ
యెండలెల్లఁ బాపి తగ నిటుదోడితేరే ॥ చూచి ॥

విరులు పైఁజల్లరె వెట్టఁ బొరలున్నవాఁడు
తొరలఁ గప్పురమీరె తొట్టీఁ దగ
యిరవై శ్రీవెంకటేశుఁ డిట్టె నన్ను ముందుగూడె
సరినాపెఁ గూడివచ్చె చాలుఁ దోడితేరే. ॥ చూచి ॥ 266

శుద్ధవసంతం

వట్టిపెద్దరికా లీడ వడినేల చెప్పేవు
తిట్టినవెనక నాపె దీవించఁబోలు ॥పల్లవి ॥

వొకతెపైఁ బెట్టి మాట లొకలొకటెయాడి
యెకసక్కెలకుఁ గల్ల లేలయాడేవు
ప్రకటించి రమ్మనుచు పాదాలువట్టునా ఆపె
తకపికలుగను ముందల పట్టఁబోలు ॥ వట్టి ॥

వలచివచ్చె ననుచు వట్టిసాకిరులు వెట్టి
చలివాసి నీవేల దాసలు సేసేవు
పిలిచి నీయింటి కాపె ప్రియము చెప్పవచ్చెనా
వలవంత ని ల్లురికి వాదుకురాఁబోలు ॥ వట్టి ॥

యీవేళ విడెము లంచమిచ్చి యాకెగూడె నని
శ్రీవెంకటేశ్వర నీవె సిగ్గువడేవు
కావించి నన్నుఁగూడితి కప్పమువెట్టునా ఆపె
మోవని నోరినిండాఁ దమ్ములమిడఁబోలు. ॥ వట్టి ॥ 267

ఆహిరి

నీతోడివారమా నిను దూరేమా నీ
చేతిలోనివారము నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

బీరమాడి బెళకేవు పెనఁగి తలవంచేవు
ఔరా నీపొందు లెందుకైనావచ్చును
మారుమలసే వప్పటి మరి రండూ నడపేవు
నేరుతు వన్నిపనులు నేనెఱఁగఁగాని ॥ నీతో ॥

అడిగి పెచ్చువెరిగే వానించి పంత మాడేవు
యెదరు నీసుద్దు లేమ నెంచవచ్చును
బడి బడి నిలిచేవు పట్టేవు కొంకకొంగులు
గడుస వన్నిటా నీవు కడుముద్దరాలను ॥ నీతో ॥

బోదించి చిగిరించేవు పూఁచి కడలుదొక్కేవు
ఆదిగొని నిన్నెట్టు గాదనవచ్చును
యీదెస శ్రీవెంకటేశ యిచ్చె నన్నుఁ గూడితివి
పొదగు జాణవు నే నీ పలుకులోదానను. ॥ నీతో ॥ 268

దేసాళం

ఇంటిదాన నే నుండఁగా యెరవు సతమా నీకు
పెంటవెట్టుక నావద్దఁ బ్రియాలు చల్లేవు ॥ పల్లవి ॥

చొక్కుచు దయదలఁచి చూచేవు ఆపె నీకు
మొక్కిన మొక్కులె కడు మోపాయనా
చిక్కి నీకుఁ జేయఁగల సేవలెల్లా నేఁజేయఁగా
చెక్కులనొక్కులు మాకు సెలవు సేసేవు ॥ ఇంటి ॥

చెచ్చెర విన్నపాలకె చెవులొగ్గే వాపె నీకు
ముచ్చటాడిన మాఁటలే ముడుపాయనా
నిచ్చపెండ్లికూఁతురవై (నై ?) నేనె నీపై యుండఁగ
నచ్చుల నీమోవితమ్మే నావంతు సేసేవు ॥ ఇంటి ॥

గునిసి మ మ్మిద్దరినిఁ గూరిచితి వాపె నీపై
మొనగోరు మోపినదె మొదలాయనా
మొనసితిమి శ్రీవెంకటేశ నే నిన్ను మెచ్చితి
చనవి మనవి నాకె సతము సేసేవు. ॥ ఇంటి ॥ 269

నాదరామక్రియ

మగువలకొనపులు మగఁడె చేకొనవలె
నిగిడి బుద్ధులు నాకు నేరుపవయ్యా ॥ పల్లవి ॥

చేముట్టి నీవు నాతోచేరి సరసమాడఁగ
యేమంటినో నిన్ను యెరఁగ నేను
కామించిన నామొహమే కానుకవట్టితి నీకు
దీమసపు నాతప్పు దిద్దుకోవయ్యా ॥ మగు ॥

పంతమున నీవు నన్ను పచ్చిసేసి పెనఁగఁగ
యెంత సేసితినో నిన్ను యెరఁగ నేను
సంతతము నాపయసు జన్నెవట్టితి నీకు
యెంతైనా నావిన్నప మీడేరించవయ్యా ॥ మగు ॥

గట్టిగా నీరతులలోఁ గలసి భోగించఁగాను
 యెట్టుండెనో నీచిత్త మెరఁగ నేను
 యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
 మట్టులేని నాకోరిక మన్నించవయ్యా. ॥ మగు ॥ 270

296-వ రేకు కొండమలహరి

ఏమిసేతు నీసుద్దుల కేమందును
 దోమటిఁ గొంగువట్టఁగ తొలఁగి పోరాదు ॥ పల్లవి ॥

అత్తల నిత్తల నీకు ఆపె నేను నుండఁగాను
 వొత్తుల నవ్వునవ్వేవు పో పో నీవు
 చిత్తజమదమెకాని సిగ్గువడే దెరఁగవు
 కొత్తలుగా నీతో నేము కోపగించరాదు ॥ ఏమి ॥

తప్పక యిద్దరము పాదాలు నీకు నొత్తఁగాను
 చెప్పరాని మాటాడేవు చీ చీ నీవు
 కుప్పళించెజవ్వనాన కొంకుగొంకు లెరఁగవు
 యిప్పుడు నీతో మాకు నెదురాడరాదు ॥ ఏమి ॥

యిరుదెస నీతో నేము యేకతములాడఁగాను
 తొరలఁ గాఁగిలించేవు తో తో నీవు
 కెరలి శ్రీవేంకటేశ కిందుమీఁదు నెరఁగవు
 పరగ నీరతుల నే పచ్చిసేయరాదు. ॥ ఏమి ॥ 271

సాళంగనాట

మెచ్చితిరా నిన్ను నేను మేఁటి వాదువు
 యిచ్చకురాల నైతిని యిఁకనేఁటిమాటలూ ॥ పల్లవి ॥

మచ్చరముమాని నీతో మాటాడినది చాలక
 కొచ్చి యంతలోనె నన్నుఁ గొంగువట్టేవు
 మెచ్చి యెక్కినట్టివాని కేనుగ గుజ్జన్నమాఁట
 యిచ్చట నీవల్లఁగంటి మిఁకనేఁటిమాటలు ॥ మెచ్చి ॥

చేయిచాఁచి నీమీఁద సేసవెట్టుట చాలక
కాయ మంటి బలిమిని కాఁగిలించేవు
చాయసంద్రైతె చావడి చంకఁబెట్టుకొన్నమాట
యీయెడ నీయందె వున్న దిఁక నేఁటిమాటలు ॥ మెచ్చి ॥

కాఁకదీర నిన్ను నేను కదియుట చాలక
సోఁకనాఁడి నన్నుఁ గూడి సొక్కఁ జేసేవు
ఆఁక శ్రీవెంకటేశ పాలంటె గుటుకన్నమాట
యేఁకట నీజాడలాయ నిఁక నేఁటిమాటలు. ॥ మెచ్చి ॥ 272

పాడి

ఎందుకైనా వత్తువు నిన్నేమిసేతురా
యిందరిలోపల నిన్ను నేమిసేతురా ॥ పల్లవి ॥

చెక్కులూ నొక్కితి నీకు చేతులెత్తి మొక్కితిని
యెక్కడా నీవోజ మాన వేమిసేతురా
తక్కరివాఁడవుతొల్లె దగ్గరి నేనంటితేను
యిక్కువలూఁ గరఁగేవు యేమిసేతురా ॥ ఎందు ॥

కొచ్చి వెంగేలు నాడితి కొంగువట్టి తీసితిని
హెచ్చిన పరాకుమాన వేమి సేతురా
మెచ్చనివాఁడవు మున్నె మీరి నేఁ జెనకితేను
యిచ్చకములాడవచ్చే వేమిసేతురా ॥ ఎందు ॥

కన్నులాను జంకించితి కాఁగిటాఁ గూడితి నిన్ను
యెన్నేసి బాసలు సేసే వేమిసేతురా
మన్నించి కూడితి నాఁడె మక్కువ శ్రీవెంకటేశ
యిన్నిటా రతులఁజొక్కే వేమిసేతురా. ॥ ఎందు ॥ 273

సౌరాష్ట్రం

ఇంటిలోనున్నదానను యెప్పుడూఁ దనసొమ్మె
వెంటవచ్చినవారితో వేగఁ గూడుమనవే ॥ పల్లవి ॥

పలుకనివారి నేలపలికించీనె తాను
చలములు మాతోనె సాదించీనా
వలచివచ్చినవారు వాకిటఁ గాచుకున్నారు
అలరి ముచ్చట లందె యాడుమనవే ॥ ఇంటి ॥

దగ్గరనివారి నేల దండకుఁ దీసీనె తాను
నిగ్గుల మాతోనె యివి నేర్చుకొనీనా
సిగ్గువడనివా రదె చేసూటినెవున్నవారు
కగ్గులేక గొబ్బునను గాఁగిలించుమనవే ॥ ఇంటి ॥

నగనివారి నదేల నగుమనీనె తాను
పగటులు మాతోనె పచరించీనా
జిగి నన్నుఁ గలనెను శ్రీవెంకటేశుఁడు తాను
మొగముచూచేవారిని మొరఁగుకొమ్మనవే. ॥ ఇంటి ॥ 274

శ్రీరాగం

తనకే విన్నవించరె తరవాతి పనులెల్లా
చనవు లిచ్చినవాఁడు చక్కఁ బెట్టనేరఁడా ॥ పల్లవి ॥

పొసఁగని సవతులపోరు మాకు నేఁటికె
కొసరుల కెల్లాఁ దానె గురిగాకా
యెసఁగ రమణులను యేలేవాఁడు రమణుఁడే
దొసఁగువారికి బుద్ధులు చెప్పనేరఁడా ॥ తన ॥

వాదవనితలతోడి వంతులు మాకేఁటికె
యీడు వెట్టుకొని దూరే దితనిఁ గాకా
జాడతో నడపేవాఁడు సతులకు నాయకుఁడే
పాడిపంతము యేరుపరచఁ దా నేరఁడా ॥ తన ॥

కన్నవారితోడ మాకు కాఁతాళించ నేఁటికె
యిన్నిటదప శ్రీవెంకటేశుఁడేకాకా
మన్నించి నన్నుఁ గలనె మరి వారికి నాతఁడె
కన్నెల నందరిని వొక్కటి సేయనేరఁడా. ॥ తన ॥ 275

కేదారగౌళ

తెలిఁచిన తలఁపులు దలకూడె
వెలుపలె లోపల వెర గిఁకనేలే ॥ పల్లవి ॥

వలచిన వలపులు వడ్డికిఁ బారీ
తలుపు దెరవవే తరుణి యిఁక
పిలువక వచ్చెను ప్రియుఁడు వాకిటికి
నిలువుల బిగువులు నీ కిఁకనేలే ॥ తల ॥

ముసి ముసి నగవులు మోవులనుండఁగ
ముసుగిడనేలే ముదిత యిఁక
రసములు గురిసీ రమణుఁడు నీతో
దొసఁగుల సుద్దులు తుద నిఁకనేలే ॥ తల ॥

కరఁగినచెమటలు కాఁగిటనున్నవి
నిరతి మరఁగేలే నెలఁత యిఁక
యిరవుగ శ్రీవెంకటేశుఁడు గూడెను
ధర లోఁగొంటివి తడఁబాటేలే. ॥ తల ॥ 276

297-వ రేకు గౌళ

ఎట్టుండెనో నీభాగ్య మేనోము నోచెనో ఆకె
గుట్టుతోనె నీవలపు కొల్లగొనెఁ గదరా ॥ పల్లవి ॥

నీటున వయ్యాళివోయి నీవురాగా నదె చెలి
కోటకొమ్మ నొరగుండి గొబ్బునఁ జూచి
గాఁటపుఁ జన్నులు గొంత గానరాఁగాఁ జూపి మోపి
మాటలాడి యాపె నీమనసు గరఁచెఁగా ॥ ఎట్టు ॥

యేనుగపై నిలుచుండి యింతికిఁ జెయిచాఁచఁగా ని
న్నానించి యెక్కించి తనఅందకుఁ దీసి
మేను మేను గాఁగిలించి మెచ్చి మెచ్చి తనయింటి
లోనికిఁ బిలిచి నిన్ను లోలునిఁగాఁ జేసెఁగా ॥ ఎట్టు ॥

వాకిటికి నీవురాఁగా వనిత సన్నలుసేసి
చేకొని నన్నిటు గని శ్రీవెంకటేశ
యీకౌలఁదులను మన మిద్దరముఁ గూడితిమి
నీకు నాకుఁ దాఁ జుట్టమై నేరుపున నవ్వేఁగా. ॥ ఎట్టు ॥ 277

బౌళి

విన్నమాట యిదెసుమ్మీ వెల్లవిరిగా నేము
నిన్నటి మొన్నటి సుద్దినె మరియెరఁగము ॥ పల్లవి ॥
శిరసునెరులు నీవు చిక్కుదియ్యఁగా విభుఁడు
కరఁగి నీమోము చూచి కగ్గిరుపఁగా
తెరవేసిరి చెలులు దిష్టముగా నంతలోనె
సరసపు మీసుద్దు లచ్చట మే మెరఁగము ॥ విన్న ॥
మేనిగందమటు నీవు మెల్లనె నలఁచఁగాను
మోనాన నాతఁడు నీకు మోవియియ్యఁగా
పూని వూడిగేలవారు పొంచి వాకిటనుండిరి
మేనులుసోఁకినరతి మీఁద నే మెరఁగము ॥ విన్న ॥
పమ్మినచెమట నీవు పయ్యెదఁ దుడువఁగాను
కమ్మి శ్రీవెంకటేశుఁడు కాఁగిలించఁగా
చిమ్ముlఁ గొలువువారు సిగ్గున లోనికేఁగిరి
దొమ్మిగా నేఁ గూడితి మీతుద నే మెరఁగము. ॥ విన్న ॥ 278

లలిత

రంతుశా(సే?)య కిఁకరావయ్య
కొంత గొంత యిటుగూచుండవయ్యా ॥ పల్లవి ॥
ముచ్చటదీరక మోము చూచితే
అచ్చట లోఁగే వదేమయ్యా
చెచ్చెర నీమీఁదఁ జేయని కోపము
కొ చ్చె(చ్చి?)టు గడించుకోనేలయ్యా ॥ రంతు ॥

చనవున నేఁ జేయి చాఁచిన యపుడే
అనయముఁ బెనఁగే వదేమయ్యా
తనియుచు నాలోఁ దలఁచని తలఁపులు
నినుపున నూహించ నీ కేలయ్యా ॥ రంతు ॥
తమకంబున నే దగ్గరి కొసరఁగ
భ్రమసిన మాఁటల పనేలయ్యా
అమరఁగ శ్రీవెంకటాధిప కూడితి
చెమరించితివిఁక చింతేలయ్యా. ॥ రంతు ॥ 279

ముఖారి

ఏడలేని మొగమోట యిపుడుగలిగె నీకు
తోడ నిందాఁకా మమ్ము దూరు మని యంటివి ॥ పల్లవి ॥
తలఁచఁగానె వచ్చె తరుణి నీ రమణుఁడు
అలసి సొలసి నీవెలఅడవె మాట
అలుక దేరిచే నంటా అండనే కూచున్నవాఁడు
చెలరేఁగి యేమైనఁ జేయవే చేఁత ॥ ఏడ ॥
అడిగే నే ననఁగానె అరగొరలెల్లఁ దేర్చె
కడమలుమాని నవ్వఁ గదవె యిఁక
వొడలు నొడలు సోఁక నొద్దికై యాతఁ డున్నాఁడు
• యెడయ కాతని భ్రమయించవే నేఁడు ॥ ఏడ ॥
కరగించే ననఁగానె కాఁగిటఁ గూడి చొక్కె
యెరవులేక చన వియ్యవే నీవు
యిరవై శ్రీవెంకటేశుఁ డిన్నిటా నీ సొమ్మయ
నురముపై నొరపుగనుండవే కాఁపురము. ॥ ఏడ ॥ 280

కాంబోది

ఇదియౌనె నీమాట యియ్యకొంటి నిఁకను
సుదతిరో మీ రిద్దె చుట్టములై వుండరే ॥ పల్లవి ॥

కమలాక్షుఁ డాతఁడు కలువకంటిని నేను
తమిఁ గూట మిద్దరికిఁ దగులు పెట్టె
జమళి నందుకొరకె చంద్రసూర్యులకన్నుల
నమరివున్నాఁడు గదె అదివో రమణుఁడు ॥ ఇది ॥

బింబాధరుఁ డాతఁడు పికవాణిని నేము
యిం .బడర నిద్దరికి నేఁటిపొందులే
వంబులేక అందుకెపో వైపుగ మాధవుఁడనే
పంబిన పేరుధరించెఁ బక్కన నీవిభుఁడు ॥ ఇది ॥

తాను కౌస్తుభవక్షుఁడు తగు నే లతాంగిని
యీనెలవులఁ గూడితి మెటువంటిదే
పూని శ్రీవెంకటేశుఁడు పొసఁగె నీమేరలకె
కానవచ్చె నిన్నిటాను ఘనుఁడె నీమగఁడు. ॥ ఇది ॥ 281

సామంతం

ఏఁటికె యిందరూ నన్నియెరిఁగిన పనులకు
నాటకములు నాతోను నడపఁగవలెనా ॥ పల్లవి ॥

దవ్వులనున్న కోపము దగ్గరినప్పుడులేదు
యివ్వలనుండి విభుని నేల తిట్టేవె
చివ్వన నాతఁడువచ్చి చేయివట్టి తీసితేను
నవ్వకుండఁ గలవా నే నవ్వుదుఁ బో అపుడు ॥ ఏఁటి ॥

ముంగిటఁ బెట్టిన వొట్టు మూలకుఁ బోతేలేదు
యింగితానఁ బతినేల యెత్తిపెట్టేవె
వుంగిటినాతఁడు నీతో నొడివట్టి పెనఁగితే
నంగవించవా నే నిన్నాడుదుఁ బో అపుడు ॥ ఏఁటి ॥

కనుబొమ్మ యీజంకెలు కాఁగిటిలోనికిలేదు
యెనసె శ్రీవెంకటేశు నేల దూరేవె
ఘనుఁ డాతఁడిదె నిన్నుఁ గరఁగించి కొసరితే
చనవీకుందువా నిన్నెచ్చరింతుఁ బో అపుడు. ॥ ఏఁటి ॥ 282

298-వ రేకు శ్రీరాగం

నీ కేమిటఁగడమ నీచేతిలో వాఁ డతఁడు
మైకొని నీయడఁ జేసే మన్నన యెరఁగవా ॥ పల్లవి ॥

ఆరీతి మాటాడఁగా నిన్నోఁ గాదనరాదుగాక
కూరిమి నీపతి యిచ్చకుఁడె కాఁడా
మేరలు మీరినచోట మెప్పించరాదుగాక
యీరాని చనవు లాతఁ డిచ్చుట యెరఁగవా ॥ నీకే ॥

కాఁతాళించివున్నవేళ కైకొలుపరాదుగాక
చేఁతల నీచెప్పినట్టు సేయఁడా తొల్లి
మోఁతతోఁ దలవంచఁగా మొగి నవ్వరాదుగాక
బాఁతిపడి యతఁడు చేపట్టుట యెరఁగవా ॥ నీకే ॥

తప్పకచూడఁగా నిన్ను తలపించరాదుగాక
యెప్పుడూ శ్రీవెంకటేశుఁ డిరవె కాఁడా
నెప్పునఁ దలవంచఁగా నేర మెంచరాదుగాక
కుప్పలుఁ దెప్పలుగాఁగ కూడుట యెరఁగవా. ॥ నీకే ॥ 283

రామక్రియ

ఏల మమ్ము రేఁచేవు యింతఅట్టు మా కేఁటికి
మేలు మీఁదనుండరాదా మెప్పించేఁగాని ॥ పల్లవి ॥

మాయదారిమాటలేల మరఁగుననున్న యాపె
చాయల నీ మోహపు సతిగాదా
తీయరాదా నీచేతనె తెరమరఁ గించుకంతా
చేయిచాఁచి నీ కన్నియుఁ జెప్పి చూపేఁగాని ॥ ఏల ॥

యీడుగాని యానలేల యింటిలోననున్న యాపె
జోడుగ నీ ప్రాణమైన సుదతిగాదా
యేదసుద్ది గడియ దీయించరాదా నేఁ జూచి
యీడనె పేసఁ బెంపు నీ కెత్తియిచ్చేఁగాని ॥ ఏల ॥

సారెకు నవ్వులేల పచ్చడములోనున్న యాపె
    కూరిమి నీ కొత్తపెండ్లికూఁతురుగాదా
    చేర నా కెదురువచ్చి శ్రీవెంకటేశ కూడితి
    పూరకుండరాదా నీకు వొప్పగించేఁగాని. ॥ ఏల ॥ 284

పాడి

ఇంకనేలరావయ్యా యిద్దరము నిద్దరమే
    సంకెదేరెఁ బనులెల్ల సరికి బేసాయను ॥ పల్లవి ॥

కన్నుల నే నవ్వితిని కాఁకలు పైఁ జల్లితిని
    చన్నుల నొత్తితి నిన్ను సారె సారెకు
    పన్ని నన్నుఁ దిట్టితివి పక్కన జంకించితివి
    సన్నలఁ గొసరితివి సరికి బేసాయను ॥ ఇంక ॥

మారుమాట లాడితిని మనసెల్ల సోదించితి
    మేరమీరఁ జెనకితి మీఁద మీఁదను
    తేరకొనఁ జూచితివి తెక్కులఁ జేకొంటివి
    సారెఁ గొంగుదీసితివి సరికి బేసాయను ॥ ఇంక ॥

లాగులెల్లఁ జూపితిని లంకెలతోఁ బెనఁగితి
    చేగదేరఁ గూడితిని శ్రీవెంకటేశ
    బాగుగా మన్నించితివి పంతమెల్లా నిచ్చితివి
    సాగిన సబలలోన సరికి బేసాయను. ॥ ఇంక ॥ 285

హిందోళవసంతం

ఆతఁడు నేసేచేఁత కవిసరిదాఁకితేను
    యీతల నే నిందరిలో నిది వెంగెమాడుటా ॥ పల్లవి ॥

దగ్గరి యాతనెదుట తలచిక్కు దీసుకొంటే
    వెగ్గళించి నేఁ బతిని వెంగెమాడుటా
    సిగ్గుతోడ సురటిని చెమట విసరుకొంటే
    అగ్గలముగా నప్పటి నది వెంగెమాడుటా ॥ ఆత ॥

తలచి నితనియెదుట తమ్ములము మిసితేను
వెలవక నే నిప్పుడు వెంగెమాడుటా
నెలవుగ నామేని నీడలు చూచుకొంటే
అలిముల దనుఁ జూచి అది వెంగెమాడుటా ॥ అత ॥

చిలుకనుఁ బేరుకొవి శ్రీరామ రామ యంటే
వెలయఁగ నే నింతలో వెంగెమాడుటా
యెలమి శ్రీవెంకటేశుఁ డిందులకె నన్నుఁ గూడె
అలమి మోముచూచితే నది వెంగెమాడుటా. ॥ అత ॥ 286

ఆహిరి

కూళతనమున నిన్నుఁ గొసరే మింతెకాక
జాలి మావలపు నీకుఁ జవులయ్యీనా ॥ పల్లవి ॥

తేలింపుఁగన్నుల యాపె తీపులమాటల యాపె
లోలునిఁగాఁ జేసె నిన్ను లోక మెరఁగ
మాలుగొని వున్నాఁడవు మదమెత్తివున్నాఁడవు
ఆలరి మా విన్నపము లాలకించేవా ॥ కూళ ॥

నెలవినవ్వుల యాపె చేఁతలకలికి యాపె
బలిమి నీ మనసెల్లా భ్రమఁ బెట్టెను
చెలరేఁగి వున్నాఁడవు సిగ్గువిడిచున్నాఁడవు
అలరి మావంక యించుకంతైనాఁ జూచేవా ॥ కూళ ॥

కన్నుల మొక్కులయాపె గయ్యాళితనము లాపె
సన్నలుసేసి నిన్ను జట్టిగొనెను
నన్నుఁ గూడి శ్రీవెంకటనాయక మించినాఁడవు
పన్నిన నీవయసు ఆఁపఁగఁగలవా. ॥ కూళ ॥ 287

భైరవి

కదిసితి రిద్దరును కన్నులపండుగగాను
పెదవుల తేనెలనే పిక్కటిల్లీఁ బ్రేమము ॥ పల్లవి ॥

పలుకుల కొదబుతో పయ్యద వదలుతోడ
చెలి నీపై వలపులు చింద( జొచ్చెను
అలుగకు నీవంత ఆయములు రేగిని
చలపట్టి వోరిచితే చక్కనయ్యీ( బనులు ॥ కది ॥

కొప్పుజారు విరులతో కులుకు( జూపులతోడ
చిప్పిలు నాసలు నీపై( జింద( జొచ్చెను
వుప్పటించ కంత నీవు వొడలెల్ల( బులకించి
తొప్ప(దోగి నవ్వితేనె తుదకెక్కీ రతులు ॥ కది ॥

కూరిమి మొక్కులతోడ కొనగోరి తాకులతో
సారెకు సిగ్గులు నీపై( జల్ల( జొచ్చెను
పేరది( బెట్టకు మంత ప్రేమపు శ్రీవెంకటేశ
యీరీతి( గూడితి వింకనిరవయ్యీ మెచ్చులు. ॥ కది ॥ 288

299-వ రేకు ముఖారి

చదురాల నేను జాణ(డవు నీవు
తుది మొద లెంచితేను దొమ్మిగాదా ॥ పల్లవి ॥

మనసు నెరు(గుదు మర్మము నెరు(గుదును
నను( జూచి నీవింత నవ్వవలెనా
పనులెల్లా( దక్కెను పంతము తుద కెక్కెను
పెన(గ(బోతే నింక పిప్పిగాదా ॥ చదు ॥

పలుక(గ నేరుతును భ్రమయించ నేరుతును
యెలమి నాతో నింత యెమ్మెవలెనా
తల(పు లీడేరెను తమకము దైవారెను
చలపట్టితే నింక చప్ప(గాదా ॥ చదు ॥

పట్టెమంచ మెక్కితిని బలువావి చేకొంటిని
మెట్టుక నాతో నింత మెచ్చవలెనా
అట్టె శ్రీవెంకటేశు( డలమేలుమంగ నేను
గుట్టుతో నుండితే నింక కొసరుగాదా. ॥ చదు ॥ 289

దేసాళం

ఎవ్వరింక సరినీకు నేమిటికిని
    యివ్వలను నవ్వలను నిద్దరికెతగును ॥ పల్లవి ॥
చూపులనె భ్రమయించె సుదతి తనకెమ్మోవి
    తీపులనె తేలించె దిష్టముగను
    రూపునసె మరిగించి రుచులుగొనె నీవలపు
    యీపనులు నేఁడు మీకిద్దరికెతగును ॥ ఎవ్వ ॥
ఆసలనెతమిరేఁచె నతివ దనచిరునవ్వు
    మోసులనె మొలపించె మోహమెల్ల
    బాసలనె నీచేతి పంతంబు దక్కఁగొనె
    యీసుద్దులెల్ల మీయిద్దరికెతగును ॥ ఎవ్వ ॥
అంకెలరతుల గెలిచె నలమేలుమంగ దన
    లంకెలనుఁగూడి నిను లాలించెను
    వుంకువలు శ్రీవెంకటోత్తముఁడ నీకొసఁగె
    యింకా నిట్ల మీకు నిద్దరికెతగును. ॥ ఎవ్వ ॥ 290

రామక్రియ

దూరుదురు మమ్మును బుద్ధులు చెప్పరంటాను
    యీరీతి నింతలోనె యిటువలెఁ జూతురా ॥ పల్లవి ॥
చిత్తములో చింతలేలె సిగ్గులు వడఁగనేలె
    కొత్తపెండ్లికూఁతురవాకొమ్మ నీవు
    చిత్తిణిగుణమాతఁడు సెలవుల నవ్వుతోడ
    పొత్తుకుఁ బిలువఁగాను బొమ్మల జంకింతురా ॥ దూరు ॥
కన్నుల మొరఁగులేలె కడు నివ్వెరగులేలె
    కన్నెపడుచవాయేమె కలికి నీవు
    వెన్నవంటివాఁ డతఁడు వేడుకఁ గొంగువట్టఁగా
    సన్నలతిట్లతోడ చలము సాధింతురా ॥ దూరు ॥

వుసురన నింకనేలె వాగిం దలవంచనేలె
పసిబాలవాయేమె పడంతి నేండు
అసు(స?)దు శ్రీవెంకటేశుం డలమేల్మంగ నీవు
పొసంగ నాతండుగూడి పూంచి కొసరుదురా. ॥ దూరు ॥ 291

## ఆహిరి

వట్టిచనవులం బోతే వాసిగలదా
నెట్టన నీకు మొక్కితే నీవె మెచ్చేవూ ॥ పల్లవి ॥
మన్ననగలకాంతలు మాటలాడం జెల్లుంగాక
పున్నవారు మాటాడితే నొద్దికలౌనా
విన్నా విననియట్టు కన్నాం గననియట్టు
సన్నల మెలంగితేనె జాణతనముగాకా ॥ వట్టి ॥
నసుపుగలుగువారు నవ్వినా నమరుంగాక
వనితలెల్లా నవ్వితే వాడికలౌనా
పెనంగినాం బెనంగక బిగిసినా బిగియక
మనసులో మెలంగుటే మంచిదిగాకా ॥ వట్టి ॥
అలమేలుమంగను నే నంటిముట్టం జెల్లుంగాక
వెలుపలివా రంటితే వేడుకలౌనా
నెలవై శ్రీవెంకటేశ నీవు నన్నుం గూడితివి
బలిమి మెరయుటే పంతముగాకా. ॥ వట్టి ॥ 292

## హిందోళవసంతం

అమ్మవారు నయ్యవారు నండనే కూచున్నవారు
యిమ్మల నిద్దరూ జాణ లేమందమే ॥ పల్లవి ॥
కొల్లున నవ్వీ నతండు గుట్టున నున్నది యాకె
తెల్లవారుదాంకా మాంటదిద్దనెపట్టె
పల్లద మాతనివంక పంతము లీచెలివంక
యిల్లిదె యిద్దరూసరె యేమందమే ॥ అమ్మ ॥

తొక్కఁ బాదము లతఁడు తొరలి పెనఁగు నీకె
చెక్కులు నొక్కి బుద్ధులు చెప్పనెపట్టె
మొక్కల మాతనిపాలు మురిపె మీసతిపాలు
యెక్కఁజల మిద్దరికి నేమందమే ॥ అమ్మ ॥

చేతులు చాఁచు నతఁడు సిగ్గుననుండు నీకె
యీతల విదే లిద్దరి కియ్యనెపట్టె
అతఁడు శ్రీవెంకటేశుఁ డలమేలుమంగయింతి
యేతుల నిద్దరూఁ గూడి రేమందమే. ॥ అమ్మ ॥ 293

పాడి

వేసరివున్నారు తొల్లె వెలఁదులిందరు నీతో
వీసమంతపనికైనా వీఁగింతురుసుమ్మీ ॥ పల్లవి ॥

నీవు మోహించినసతి నిన్నేమనినాఁ జెల్లు
ఆవటించి నీ వాపె నేమనినాఁ జెల్లు
పూవుఁగాక పిందెఁగాక పోదిఁ బెట్టుకున్నవారి
దీవెనమాటలాడినాఁ దిట్టుదురుసుమ్మీ ॥ వేస ॥

చనవుగలుగుయింతి జంకించ నిన్నుఁదగు
చెనకి నీవాపె నేమిసేసినాఁ దగు
ననిచియు ననచక నవ్వకె లోనైనవారిఁ
-దనువులు నిమిరినాఁ దట్టింతురుసుమ్మీ ॥ వేస ॥

పట్టపుఅలమేల్‌మంగ పైకొంటివి నీమెచ్చు
గుట్టు శ్రీవెంకటేశ నీకూటమి మెచ్చు
అట్టుగా నాపెచేత నాఅడిఁబడ్డయట్టివారిఁ
బట్టి బలిమిఁ గూడితి పంగింతురుసుమ్మీ. ॥ వేస ॥ 294

300-వ రేకు మంగళకౌశిక

ఇద్దరూ నవ్వుతా నున్నా రింతటిలోనె
యెద్దుబండికంటిసంది యేమాయనయ్య ॥ పల్లవి ॥

22

చెంగలుపబంతి వేసె సేయరాని చేఁత సేసె
ముంగురులు పట్టితీసె మొదలఁ జెలి
అంగనయింటిలో కేఁగి తటమీఁది సుద్దెరఁగ
యింగితపు మీవాదు లేమాయనయ్యా ॥ ఇద్ద ॥

కన్నులఁ దప్పక తిట్టె గక్కన నీచేయి వట్టె
చన్నులు రొమ్మునఁ బెట్టె సాధించె నిన్ను
యెన్నికఁ దెరవేసితి వేమిసేసితో యెరఁగ
యిన్నేసి మీపంతములు యేమాయనయ్యా ॥ ఇద్ద ॥

కప్పురము నోటికిచ్చె కాఁగిలించి నిన్నుమెచ్చె
అప్పుడె శ్రీవెంకటేశ అలమేల్మంగ
దప్పిదేరితి వాపెతో తగ నన్ను మన్నించితి
యిప్పుడు మీ యెన్నికలు యేమాయనయ్యా. ॥ ఇద్ద ॥ 295

శ్రీరాగం

మనసుమెత్తనిదాన మరిగినదాన నీకు
చనవు చేకొన్నదాన సమ్మతించవయ్యా ॥ పల్లవి ॥

మొక్కలానఁ గోపగించి మోము చూడకుండుఁగాని
తక్కక నీరూపు నాతలఁపులోనెవుండు
చిక్కక ఆవేళ నీచిత్త మెట్టుండునో యని
మొక్కెద నిదివో నీకు మొగిఁజేకోవయ్యా ॥ మన ॥

చెప్పుడువారిమాఁటకు చింతతోడనుండుఁగాని
యెప్పుడూ నీరాకకు నెదురుగాచుకుండుదు
కుప్పించి నాఘాత కెంతకొంకుచునుందువో నీవు
చెప్పియందుకె సేవసేసేఁ జూడవయ్యా ॥ మన ॥

వచ్చిన వూఁకున నిన్ను వడిఁ దమకింతుఁగాని
యిచ్చకురాలనే నీకు నిటు నేను
అచ్చపు శ్రీవెంకటేశ అలమేలుమంగను
మచ్చికఁగూడితి నిఁక మన్నించవయ్యా. ॥ మన ॥ 296

దేసాళం

అంగమెల్లఁ జెమరించె నమ్మఁగారికి
అంగజరసములుబ్బీ నయ్యఁగారికి ॥ పల్లవి ॥

చెక్కునఁబెట్టిన చేయి నెలవి నవ్వీన నవ్వు
అక్కజమై తోఁచీ నదె అమ్మఁగారికి
చిక్కని మోముకళలు చెయివట్టి పెనఁగేటి
అక్కరవేడుకనిండె నయ్యఁగారికి ॥ అంగ ॥

సరుస కంటముమాఁటు సమరతితోడు చూపు
అరుదుగఁ జిమ్మిరేఁగె నమ్మఁగారికి
తొరలనాడినమాట తొడమీఁదనింతిఁబెట్టి
అరమరపులునిండె నయ్యఁగారికి ॥ అంగ ॥

మంచముపై సరసాలు మర్మముపై మంతనాలు
అంచుమోచె నెదుటనె అమ్మఁగారికి
కొంచక అలమేల్‌మంగఁ గూడినట్టి గురుతిదె
అంచ శ్రీవెంకటగిరి అయ్యఁగారికి. ॥ అంగ ॥ 297

సామంతం

మాయింటికి విచ్చేసిన మన్నన యిది చాలదా
యేయెడనుండివచ్చిన నెరవు నేసేమా ॥ పల్లవి ॥

కప్పురపుఁ జూపులు ఆకాంత నీపైఁ జల్లఁగాను
వుప్పతిల్ల వెన్నెల నవ్వులు చల్లేవు
చప్పుడు సేయక యింకఁ జల్లఁగా బదుకరయ్య
యెప్పుడు నీవారమె నే మెరవు సేసేమా ॥ మాయింటి ॥

వేడుకమాటల నాపె విందునీకుఁ బెట్టఁగాను
యీడనె వలపుసొమ్ము లియ్యఁ జూచేవు
యీడుజోడుగూడుక మీరిద్దరు బదుకరయ్య
యేడసుద్ది మిమ్ము నేము యెరవు సేసేమా ॥ మాయింటి ॥

అలమేలుమంగ నీకు నాసలుగానుకియ్యఁగ
కలిమి శ్రీవెంకటేశ కప్ప మిచ్చేవు
మెలఁగి వొకరొకరు మీ రిట్టె బదుకరయ్య
యెలమి నన్నుఁ గూడితి వెరవు సేసేమా. ॥ మాయింటి ॥ 298

గౌళ

అంగనకు నీవె అఖిలసామ్రాజ్యము
శ్రింగారరాయఁడ నీకు శ్రీసతినిధానము ॥ పల్లవి ॥
కమలాలపానుపు కాంతకు నీవురము
ప్రమదపు నీమనసు పాలజలధి
అమరు నీభుజాంతర మట్టె తీగెపొదరిల్లు
రమణీయ(ప్ర)హారాలు రత్నాలమేడలు ॥ అంగ ॥
సతికి నీమెడ రతిసాము సేసేకంబము
ప్రతిలేని వయ్యాళి బయలు నీవు
మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము
మితిలేని శ్రీవత్సము మించుబండారుముద్ర ॥ అంగ ॥
నెమ్మి నలమేల్మంగ నీ కాఁగిలి పెండ్లిపీఁట
చిమ్ముల చందనచర్చ సేసపాలు
వుమ్మడి మెడనూళ్ళు వుయ్యాలసరపణులు
పమ్మి శ్రీవెంకటేశ నీభావమే భోగము. ॥ అంగ ॥ 299

సాళంగనాట

అలుగకువమ్మ నీ వాతనితో నెన్నఁడును
పలువేడుకలతోనె పాయకుండరమ్మా ॥ పల్లవి ॥
జలధిఁ దపము సేసె సాధించెఁ బాతాళము
నెలఁత నీరమణుఁడు నీకుఁగానె
యిలవెల్లా హరించె నెననెఁ గొండగుహల
యెలమి నిన్నిటాను నీకితవుగానె ॥ అలు ॥

బాలబొమ్మచారై యుండెపగలెల్లా సాధించె
నీలీలలు దలఁచి నీకుఁగానె
తాలిమి వ్రతమువట్టి ధర్మముతోఁ గూడుండె
పాలించి నీవుచెప్పిన పనికిఁగానె ॥ అలు ॥

యెగ్గు సిగ్గుఁ జూడఁడాయె యెక్కెనుశిలాతలము
నిగ్గుల నన్నిటా మించె నీకుఁగానె
అగ్గలపు శ్రీవెంకటాద్రీశుఁడై నిలిచె
వొగ్గి నిన్నురాన మోచివుండుటకుఁగానె. ॥ అలు ॥ 300

## సంకీర్తన రాగముల అకారాది సూచిక


| రాగము పేరు. | | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|---|
| ఆహిరి | .... | 12, 54, 58, 65, 111, 131, 143, 163, 197, 209, 268, 287, 292. |
| కన్నడగౌళ | .... | 259. |
| కాంబోది | .... | 8, 33, 60, 113, 122, 123, 129, 138, 140, 171, 252, 264, 281. |
| కేదారగౌళ | .... | 62, 154, 176, 276. |
| గౌండమలహరి | .... | 87, 244, 271. |
| గౌళ | .... | 233, 242, 249, 277, 299. |
| దేశగాంధారి | | 15, 179. |
| దేసాక్షి | .... | 1, 158, 173, 213, 265. |
| దేసాళం | .... | 38, 99, 146, 153, 160, 167, 177, 186, 218, 234, 269, 290, 297. |
| ధన్నాసి | .... | 226. |
| నాట | .... | 190. |
| నాదరామక్రియ | .... | 89, 115, 169, 181, 217, 230, 270. |
| పాడి | .... | 2, 57, 90, 92, 96, 104, 107, 145, 159, 172, 180, 194, 201, 222, 228, 248, 273, 285, 294. |

| రాగము పేరు. | | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|---|
| బౌళి | .... | 9, 82, 100, 132, 174, 200, 204, 261, 278. |
| బౌళిరామక్రియ | .... | 48, 114. |
| భూపాలం | | 18, 55, 193. |
| భైరవి | .... | 3, 11, 68, 86, 93, 166, 184, 220, 236, 260, 288. |
| మంగళకౌశిక | .... | 19, 21, 27, 95, 110, 156, 216, 221, 247, 255, 295. |
| మధ్యమావతి | .... | 36, 150, 157, 196, 263. |
| మాళవిగౌళ | .... | 210. |
| ముఖారి | .... | 14, 17, 20, 31, 35, 45, 49, 51, 61, 63, 67, 74, 76, 84, 109, 117, 135, 136, 144, 147, 149, 151, 195, 206, 215, 227, 229, 237, 251, 254, 280, 289. |
| మేఁచబౌళి | .... | 235. |
| రామక్రియ | .... | 7, 40, 56, 64, 66, 73, 79, 81, 105, 118, 121, 199, 212, 219, 238, 256, 284, 291. |
| రీతిగౌళ | .... | 75. |
| లలిత | | 4, 16, 22, 24, 46, 50, 77, 127, 191, 214, 224, 279. |
| వరాళి | .... | 28, 30, 39, 53, 85, 91, 124, 141, 148. 168, 232, 266. |

| రాగము పేరు. | | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|---|
| శంకరాభరణం | .... | 23, 25, 47, 78, 83, 98, 137, 152, 162, 189, 240, 241, 253, 258, 262. |
| శుద్ధవసంతం | .... | 44, 72, 94, 128, 133, 192, 246, 267. |
| శ్రీరాగం | .... | 5, 59, 70, 112, 119, 164, 185, 188, 202, 208, 211, 243, 250, 275, 283, 296. |
| సామంతం | .... | 13, 26, 41, 42, 43, 69, 71, 80, 97, 101, 108, 116, 120, 126, 130, 134, 139, 161, 165, 170, 182, 203, 205, 223, 239, 245, 257, 282, 298. |
| సాళంగం | .... | 32, 34, 102, 125, 142, 187. |
| సాళంగనాట | .... | 88, 103, 155, 183, 207, 231, 272, 300. |
| సౌరాష్ట్రం | .... | 6, 198, 274. |
| హిందోళం | .... | 52, 225. |
| హిందోళవసంతం | .... | 178, 286, 293. |
| హిజ్జిజి | .... | 10, 29, 37, 106, 175. |

## సంకీర్తన రాగముల అకారాది సూచిక


| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| అంగనకు నీవె అఖిల .... | గౌళ .... | 299 |
| అంగమెల్లఁ జెమరించె .... | దేసాళం .... | 297 |
| అంతనింతనుండి | కాంబోది .... | 138 |
| అందాఁకా వేగిరమా | హిందోళం | 225 |
| అందుమీఁదమేలు | కేదారగౌళ .... | 176 |
| అక్కలాల అమ్మలాల .... | పాడి | 96 |
| అతని దెసచూచి .... | సామంతం | 80 |
| అతిరాజసపు దొరవైన .... | దేవగాంధారి | 15 |
| అతివ నీసింగారమట్టిదెకా .... | ముఖారి .... | 67 |
| అది గురుతు మరవ | శంకరాభరణం | 83 |
| అన్నిటా జాణవుగావా .... | మధ్యమావతి .... | 263 |
| అన్నిటాను జాణఁడు అప్పటి | పాడి .... | 159 |
| అన్నిటా నేఁ దనిసితి .... | కౌండమలహరి .... | 244 |
| అన్నిటా భాగ్యవంతుఁడు | మధ్యమావతి | 196 |
| అన్నియు నందె అమరె .... | పాడి | 180 |
| అప్పటి కప్పటి మాటలంటి .... | వరాళి | 168 |
| అప్పటి కప్పటి మాటలంతె .... | సామంతం | 69 |
| అప్పటి నమ్మఁడు తన్ను .... | దేసాళం .... | 218 |
| అప్పటి నన్నె కొసరీ .... | సామంతం .... | 223 |
| అమ్మవారు నయ్యవారు .... | హిందోళవసంతం | 203 |
| అయినట్టయ్యీఁ గాక | ముఖారి | 117 |
| అయినట్టయ్యీఁగాని | బౌళి | 100 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| అయ్యోతా నేమనీ | ఆహిరి | 131 |
| అలిగేదె సహజము | సౌరాష్ట్రం | 6 |
| అలుగకు వమ్మ | సాళంగనాట | 300 |
| ఆఁటదాని కింతయేల | సామంతం | 101 |
| ఆఁటదానికి పతితో | భైరవి | 220 |
| ఆకెవో నాప్రాణమోహన | రామక్రియ | 79 |
| ఆడనుండె యేమిగల్లా | భైరవి | 86 |
| ఆడరాని చూడరాని | రామక్రియ | .... 121 |
| ఆతఁడు నీవు నొక్కటె | గౌళ | .... 242 |
| ఆతఁడు నేసేచేఁత | హిందోళవసంతం | .... 286 |
| ఆపాటి కాపాటి | భైరవి | 68 |
| ఆపెకు నీకుఁ దెలుసు | పాడి | 172 |
| ఆపె నందునో నిన్ను | లలిత | 4 |
| ఆపె నిన్ను దిద్దుకొన | దేసాళం | 167 |
| ఆమాట మీరెరఁగరా | మధ్యమావతి | 150 |
| ఆయనాయఁ బోయ | కాంబోది | 33 |
| ఆయములంటే యారచి | మధ్యమావతి | 36 |
| ఆసుద్దులేల తడవే | కేదారగౌళ | 154 |
| ఆసోదకాఁడవో అన్నిటా | సాళంగనాట | .... 155 |
| ఇంకనేల ఆసుద్దులు | ముఖారి | 31 |
| ఇంకనేల రావయ్యా | పాడి | 285 |
| ఇంకనేల వేగిరము | ముఖారి | 63 |
| ఇంటిదాన నేనుండఁగా | దేసాళం | 269 |
| ఇంటిలో నున్నదానను | సౌరాష్ట్రం | 274 |
| ఇంతకంటె వలపు | ఆహిరి | 197 |
| ఇంతచాలదా మాకు | కాంబోది | 129 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఇంతచాలదా యింతి | శ్రీరాగం | 119 |
| ఇంతట నిట్టె విచ్చేసి | రామక్రియ | 56 |
| ఇంతటిది కావలదా | వరాళి | 30 |
| ఇంతయాల అంతయాల | సామంతం | 120 |
| ఇంతవాఁడు చెనకీ | హిందోళవసంతం | 178 |
| ఇంత నేసినట్టి పతి | ముఖారి | 136 |
| ఇంతికినీవెరవా | శ్రీరాగం | 112 |
| ఇంతి మాటలకు నేల | పాడి | 222 |
| ఇంతుల నెంతదూరునో | సాళంగం | 34 |
| ఇందరు సవతులకు | దేసాళం | 99 |
| ఇందాఁకా మాపని | మంగళకౌశిక | 255 |
| ఇందుకంటె నేమి సేతు | సాళంగం | 125 |
| ఇందుకేమి దోసమా | పాడి | 92 |
| ఇందుకేమె అందు | లలిత | 50 |
| ఇందునందునె యింతి | ముఖారి | 45 |
| ఇక నేలయ్య మాయెడ | లలిత | 24 |
| ఇచ్చకమాడ నెఱఁగ | సామంతం | 71 |
| ఇచ్చగించు కొంటగాఁక | శుద్ధవసంతం | 246 |
| ఇటువంటి నీభాగ్య | శ్రీరాగం | 202 |
| ఇట్టిదివో సతిమోహ | ఆహిరి | 111 |
| ఇట్టినీకు వలచిన | పాడి | 201 |
| ఇదియౌనె నీమాట | కాంబోది | 281 |
| ఇదివో వలపుచింది | సాళంగం | 187 |
| ఇద్దరిఁ గూర్చినవాఁడు | సౌరాష్ట్రం | 198 |
| ఇద్దరుఁ గూడినమీఁద | ఆహిరి | 204 |
| ఇద్దరు మోనాన | శంకరాభరణం | 23 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఇద్దరూ నవ్వుతా | మంగళకౌశిక | 295 |
| ఈతఁడు వద్దనుండఁగ | మాళవిగౌళ | 210 |
| ఉదయించె నతఁడు నీవు | సామంతం | 41 |
| ఊరకె తానుండఁబట్టె | సామంతం | 139 |
| ఎంచనిన్నిటికి | హిందోళం | 52 |
| ఎంతటివాఁడవు నిన్ను | సాళంగనాట | 183 |
| ఎంతటి వేగిరకాఁడు | రామక్రియ | 238 |
| ఎంతమాటకెంత | శుద్ధవసంతం | 192 |
| ఎంతమొగమాయ | ముఖారి | 147 |
| ఎంతలేదు మాటలు | ముఖారి | 229 |
| ఎందుకెందు బోలిచేపె | సామంతం | 43 |
| ఎందుకైనావచ్చు | శంకరాభరణం | 162 |
| ఎందుకైనావత్తువు | పాడి | 273 |
| ఎందువోయీ నింత | శుద్ధవసంతం | 128 |
| ఎక్కడఁ జూచినదాఁనై | దేసాళం | 160 |
| ఎక్కడి సుద్దులేలె | లలిత | 224 |
| ఎగ్గోతప్పోయెఱఁగ | సామంతం | 182 |
| ఎటువంటిచుట్టరిక | రామక్రియ | 212 |
| ఎటువంటి మోహమోయీపె | నాదరామక్రియ | 217 |
| ఎటువంటిమోహమోమెట్టి | సాళంగనాట | 88 |
| ఎట్టుండెనో నీభాగ్య | గౌళ | 277 |
| ఎట్టుగెలువగవచ్చు | పాడి | 107 |
| ఎట్టుసింగారింతమమ్మ | పాడి | 90 |
| ఎప్పటి వాఁడవెకావా | పాడి | 194 |
| ఎరవెసతముచేసె | కేదారగౌళ | 62 |
| ఎఱఁగని యాఁటదయితే | ముఖారి | 215 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఎఱుఁగవుగాక నీవు | కాంబోది | 261 |
| ఎఱిఁగిన పనులకు | హిజ్జిజి | .... 175 |
| ఎఱిఁగి వుండువుగాని .... | పాడి | .... 218 |
| ఎవ్వరింక సరినీకు | దేసాళం | .... 290 |
| ఎవ్వరికిఁ గలదురా | ముఖారి | 151 |
| ఎవ్వరితోనైనాఁ | బౌళి | 204 |
| ఎవ్వరి నేమనఁజాల | దేసాళం | 186 |
| ఎవ్వరి నేమనలేవు | శ్రీరాగం | .... 5 |
| ఎవ్వరిపై మోహ .... | శ్రీరాగం | 185 |
| ఎవ్వరి బలువెక్కుడో .... | పాడి | 228 |
| ఎవ్వరి బుద్ధులు యెక్కుడి .... | లలిత | 214 |
| ఏఁటికయ్య మాఁటలు .... | గౌళ | .... 233 |
| ఏఁటికె యిందరూ | సామంతం | 282 |
| ఏకచిత్తమైనప్పుడిన్నియు | మంగళకౌశిక | 110 |
| ఏడకేడ యెంచి .... | దేసాళం | 38 |
| ఏడలేని మొగమోట | ముఖారి | .... 280 |
| ఏమాట కేమాట | బౌళిరామక్రియ | 48 |
| ఏమిచూచేవాపె .... | హిజ్జిజి | 10 |
| ఏమిటికి వేఁడుకొనే .... | ముఖారి | 206 |
| ఏమినవ్వేవు మాతోను | దేసాక్షి | 265 |
| ఏమి నెరఁగనిబాల | శంకరాభరణం | 137 |
| ఏమిసేతు నాగుణమీ | భైరవి | 3 |
| ఏమిసేతు నీసుద్దుల | కొండమలహరి | 271 |
| ఏమే నేవచ్చియిప్పు | పాడి | 2 |
| ఏమేయిందుకెగ్గు | ముఖారి | 76 |
| ఏమోసేయఁగఁబోగా | కొండమలహరి | 87 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఏమౌత నెఱఁగ నీ | వరాళి | .... 53 |
| ఏల జోలిఁబెట్టె | ఆహిరి | 54 |
| ఏల నన్ను నేర | వరాళి | 28 |
| ఏల నీవు చిన్నఁ | .... రామక్రియ | .... 219 |
| ఏలమమ్ము రేఁచేవు | రామక్రియ | .... 284 |
| ఏల రట్టుసేసేవేమీ | .... మంగళకౌశిక | 247 |
| ఏలవేగిరించేవు | శంకరాభరణం | .... 253 |
| ఏలసిగ్గువడే | భైరవి | 184 |
| ఏలేచెలియ యీ | .... ముఖారి | .... 14 |
| ఒకటి కొకటి | .... శ్రీరాగం | .... 70 |
| ఒక్కరి కొకరు | దేసాక్షి | .... 158 |
| ఒద్దుమమ్మెఁజెనకక | బౌళిరామక్రియ | .... 114 |
| ఒయ్యనె విన్నవించరె | .... ముఖారి | 149 |
| ఒలసితే నొకమాట | .... నాదరామక్రియ | 169 |
| ఓపో అదేమోయి | .... ముఖారి | 51 |
| ఔదువు జాణవు నీవు | మెంచబౌళి | 235 |
| ఔనెమాటకుమాట | .... రామక్రియ | 81 |
| ఔనోకాదో నీ | ముఖారి | .... 35 |
| కంటినేనంతలో | .... వరాళి | .... 124 |
| కంటిమి వొకటి | .... వరాళి | 85 |
| కందము విందము | .... రామక్రియ | 105 |
| కదిసితి రిద్దరుసు | భైరవి | 288 |
| కదిసితి రిద్దరూను | ముఖారి | .... 237 |
| కదిసిన మిము మెచ్చ | ఆహిరి | 65 |
| కన్నులఁజూచేవు | బౌళి | 174 |
| కలదింతెమాఁట | లలిత | 16 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| కాంతనీవుగూడఁగా | దేసాళం | 153 |
| కాఁగల దయ్యీఁగాక | ముఖారి | 109 |
| కానీవయ్య దానికేమి | రామక్రియ | 7 |
| కూడని దొకటొకటి | ముఖారి | 20 |
| కూరిమిఁ గొసరనేల | ముఖారి | 227 |
| కూళతనమున | ఆహిరి | 287 |
| కైవసపు దానఁగాని | కాంబోది | 252 |
| కొండవంటిదొర | పాడి | 104 |
| కోడెకాఁడు వీఁడె | సామంతం | 257 |
| కోపగించుకోఁగ | ముఖారి | 251 |
| కోరిచేకొనఁగరాదు | ధన్నాసి | 226 |
| గుట్టుతో లోలో | రామక్రియ | 66 |
| గుట్టువాఁడవంటా | సామంతం | 13 |
| ఘనుఁడవు తెగి | హిజ్జిజి | 29 |
| చదురాల నేను | ముఖారి | 289 |
| చాలుఁజాలు నాతో | శుద్ధవసంతం | 72 |
| చాలుఁజాలు నేతులు | శుద్ధవసంతం | 133 |
| చాలుఁ జాలు నేల | కాంబోది | 171 |
| చాలుఁ జాలుఁ బొగ | సామంతం | 134 |
| చుట్టపు వరుసగొంత | పాడి | 145 |
| చూచితిఁ దనసరిత | కాంబోది | 140 |
| చూచితి నప్పుడే | వరాళి | 266 |
| చెప్పకువే వాని | సాళంగం | 102 |
| చెప్పినట్టు సేసే | ఆహిరి | 12 |
| చెప్పినట్టె పతిపంపు | కాంబోది | 8 |
| చెఱఁగు మాసినసుద్ది | పాడి | 57 |

| సంకీర్తన | | రాగము | | పుటసంఖ్య |
|---|---|---|---|---|
| చెలువుఁడ నీవుమేలు | | నాదరామక్రియ | | 89 |
| చెల్లని చేఁతలు చెల్లీ | | నాదరామక్రియ | | 115 |
| చెల్లుఁజెల్లు నీకు | | లలిత | | 127 |
| చెల్లెఁజెల్లె నీవు | | రామక్రియ | .... | 73 |
| చేతనైనపాటి | | కాంబోది | | 60 |
| చేతికిలోనైనప్పుడు | | సాళంగనాట | | 231 |
| చేరి నీవు చెప్పినట్టు | | మంగళకౌశిక | | 21 |
| జలములఁ బాసిన | | హిజ్జిజి | .... | 37 |
| తగుఁదగు నీకునాకు | | శ్రీరాగం | | 59 |
| తగుమాటలేమి | | సామంతం | | 130 |
| తనకె విన్నవించరె | | శ్రీరాగం | | 275 |
| తనివారఁ దిరువనందలము | .... | శంకరాభరణం | .... | 189 |
| తరవాతి పనులెల్ల | | ఆహిరి | | 58 |
| తరుణియిందుకే | | శ్రీరాగం | | 188 |
| తలఁచిన తలపులు | | కేదారగౌళ | .... | 276 |
| తానదివో నేనిదివో | | దేసాక్షి | | 213 |
| తానెట్లనున్నాఁడో | .... | శంకరాభరణం | | 78 |
| తిట్టనేర్తునా నిన్ను | | శుద్దవసంతం | .... | 94 |
| తొలుతె మీతమకము | | రామక్రియ | .... | 199 |
| తొల్లిటివంటి దానవా | | బౌళి | | 261 |
| తొల్లి నేసినంతె | .... | సామంతం | | 97 |
| దక్కెనీకుఁ బంతము | .... | హిజ్జిజి | | 106 |
| దగ్గరితే మొగచాటు | | దేసాక్షి | .... | 1 |
| దయఁదలఁచుక | | మంగళకౌశిక | | 221 |
| దవ్వుల సరసములు | | మంగళకౌశిక | | 19 |
| దూరలేను పోరలేను | .... | ముఖారి | | 61 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| దూరుదురు మమ్మును | రామక్రియ | 291 |
| దొడ్డవాఁడవవుదువు | శంకరాభరణం | 240 |
| దొరవైతె నింతలోనె | ముఖారి | 144 |
| నన్నుఁజూచి నీవేల | సామంతం | 245 |
| నలుగడ నిందరు | ముఖారి | 254 |
| నవ్వవొద్దాయిందుకు | సాళంగం | 142 |
| నాకుఁజూడనిదె | భైరవి | 166 |
| నాకునాకే వెరగయ్యీ | శంకరాభరణం | 98 |
| నాటిసుద్దులెవింటిమి | లలిత | 191 |
| నిండు సోబనమునేఁడు | భూపాలం | 55 |
| నిందలేని పతివిదె | సామంతం | 205 |
| నిలుచున్నాఁడాతఁడు | ఆహిరి | 163 |
| నిన్నటిమొన్నటికాఁక | దేసాళం | 234 |
| నిన్ననె పెండ్లినాకు | శంకరాభరణం | 47 |
| నివ్వెరగై వున్నాఁడవు | బౌళి | 200 |
| నీకు నీకె తెలుసు | రామక్రియ | 64 |
| నీకు నీకె మాకు | సామంతం | 116 |
| నీకేమిటఁగడమ | శ్రీరాగం | 283 |
| నీకేలవెరపు | సామంతం | 161 |
| నీటముంచు పాల | వరాళి | 39 |
| నీటి నడుమడచితే | రీతిగౌళ | 75 |
| నీతలనె వేఁగెనా | సామంతం | 170 |
| నీతోడివారమా | ఆహిరి | 268 |
| నీవు చల్లఁగాబదుకు | శంకరాభరణం | 152 |
| నీవు బదలితివి | రామక్రియ | 40 |
| నీవు వాఁటిదూరనేలె | భైరవి | 11 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| నీవెఱఁగవా నిందు | సామంతం | 239 |
| నీవేనేనై తిఁగా | రామక్రియ | 118 |
| నీవే యిన్నిటనిజ | సామంతం | 165 |
| నేఁడుగా యివి తనకు | కాంబోది | 122 |
| నేఁడురేపుఁజూతు | వరాళి | 141 |
| నేఁ దన్నుఁగైకోని | సాళంగం | 32 |
| నేనే యెరుఁగుదును | సామంతం | 203 |
| నేనేల తనునాడె | శంకరాభరణం | 262 |
| నేమెంతేసి వారమైనా | మంగళకౌశిక | 156 |
| నే సతముగాక | శుద్ధవసంతం | 44 |
| పచ్చిదేరెఁ బనులు | గౌళ | 249 |
| పదిలమై వుందుగాని | ముఖారి | 135 |
| పిలువవచ్చిన నేను | సాళంగనాట | 207 |
| పూవక వూచినవెల్లా | సామంతం | 42 |
| పైపై నిన్నుఁగొసరితే | నాట | 190 |
| పొద్దుగూఁకె తెల్ల | దేవగాంధారి | 179 |
| పోపో నీపోలికలు | సామంతం | 108 |
| పోయినదెల్లాఁ బొల్లు | లలిత | 22 |
| ప్రియములెల్లా నీవి | కన్నడగౌళ | 259 |
| బాపుబాపుమేలు | శంకరాభరణం | 241 |
| మంచివానివలెనె | దేసాళం | 146 |
| మగువనేను నీవు | ముఖారి | 17 |
| మగువల కొసరులు | నాదరామక్రియ | 270 |
| మదనరాగము నీకు | లలిత | 77 |
| మనలోని మాఁటా | వరాళి | 91 |
| మనసుకు మనసే | మంగళకౌశిక | 27 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| మనసు మెత్తనిధాన మరిగిన | శ్రీరాగం | 296 |
| మనసు మెత్తనిదాన మరినీకు .... | నాదరామక్రియ | 181 |
| మాటలు యింకానా | శ్రీరాగం | 213 |
| మానవుగామమ్మ | శంకరాభరణం | 25 |
| మానిని భావము | ముఖారి | 74 |
| మానుసులకుఁ దరమా | బౌళి | 9 |
| మామాటవినవె | భైరవి | 260 |
| మాయింటికి విచ్చేసిన | సామంతం | 298 |
| మించిన నాపంతములు | రామక్రియ | 256 |
| మీరుమీరు నొక్కటే | వరాళి | 232 |
| ముగురము జాణలమే | దేసాళం | 177 |
| ముట్టితేనె ముయి | శ్రీరాగం .... | 208 |
| మున్నిటి తానెకాఁడా | కాంబోది | 123 |
| మూలనున్నవారి | భూపాలం | 18 |
| మెచ్చితిరా నిన్ను .... | సాళంగనాట | 272 |
| మేఁటులాల బోఁటులాల | బౌళి | 132 |
| మేలుగల వారికెల్ల | వరాళి | 148 |
| మేలు నీతోడిపొందులు | ముఖారి | 195 |
| రంతుసేయకిఁక | లలిత | 279 |
| రమణుని చిత్తమింతే | భూపాలం | 193 |
| వట్టి చనవులఁబోతే | ఆహిరి | 292 |
| వట్టి పెద్దరికాలీడ .... | శుద్ధవసంతం | 267 |
| వద్దెలె బలిమి .... | శంకరాభరణం | 258 |
| వరుసతోనె వచ్చితే | శ్రీరాగం | 164 |
| వలపులాగటువంటిది | శ్రీరాగం | 211 |
| వాకిట నేలున్నాఁడవు | భైరవి | 236 |

| సంకీర్తన | రాగము | | పుటసంఖ్య |
|---|---|---|---|
| విచ్చేయవయ్యా | లలిత | | 46 |
| విడువిడరే | కాంబోది | | 113 |
| వినవమ్మ యశోద | దేసాక్షి | | 173 |
| విన్నప మేఁటికి | నాదరామక్రియ | .... | 230 |
| విన్నపాలకెవ్వరికి | భైరవి | | 93 |
| విన్నమాట యిదె | బౌళి | | 278 |
| విన్నవించ నేఁటికి | శ్రీరాగం | .... | 250 |
| విన్నవించనేల | సామంతం | | 126 |
| విభునికి నీమాపె | ముఖారి | | 49 |
| వెలపించఁ బోయి | సామంతం | | 26 |
| వేగుదాఁకా జాగరాల | ముఖారి | | 84 |
| వేసరివున్నారు | పాడి | | 294 |
| సటలకు జంపు | సాళంగనాట | | 103 |
| సరికి బేసికవె | బౌళి | | 82 |
| సవతులకెల్ల | మంగళకౌశిక | .... | 216 |
| సారెకువలవ | మధ్యమావతి | | 157 |
| సేతునో నీమేన | ఆహిరి | | 143 |
| సొరిది నీజాడకెల్ల | మంగళకౌశిక | .... | 95 |